జూన్
2014

98

సంపుటి : 9 సంచిక : 2

వెల రు. 10/-

## ఈ సంచికలో........

ఎన్నికలు -వామపక్షోద్యమానికి సవాళ్ళు
అనేక ప్రభంజనాలు, ఒక మీడియా సునామీ
పేదల సంక్షేమంపై దాడికి సిద్ధం
కాలం చెల్లిన స్వేచ్ఛా మార్కెట్ ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదం
పాఠం బోధించడంలో మెళకువలు
ఆర్థిక వ్యవస్థలో స్థబ్దత - ద్రవ్యీకరణ వైరుధ్య స్వభావం
భారత కార్మికోద్యమ మణిపూస కా॥ రామానాథ్
ప్రజాూద్యమాలద్వారా ప్రత్యామ్నాయ శక్తులు పెరగాలి

# భారత కార్మికోద్యమ మణిపూస కా॥ఉమానాథ్

ఎల్.ఎస్. భారవి



**భా**రత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు) మాజీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, కమ్యూనిస్టు కురువృద్ధుడు కామ్రేడ్ ఆర్.ఉమానాథ్ మే 21వ తేదీన తమిళనాడులోని తిరుచ్చిలో ఒక ఆసుపత్రిలో అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన వయసు 92 ఏళ్లు. సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ -సి.ఐ.టి.యు- వ్యవస్థాపక సభ్యులలో ఒకరైన కామ్రేడ్ ఉమానాథ్ తమిళనాడు రాష్ట్ర సిఐటియు మొట్ట మొదటి ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. 1962, 1967లో పార్లమెంట్ సభ్యుడిగా, 1977, 1980లో తమిళనాడు శాసనసభ సభ్యునిగా ఎన్నికయ్యారు. 1991 నుండి 2008 వరకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడిగా సుదీర్ఘ కాలం పని చేశారు. 2010 వరకు సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారు. కామ్రేడ్ ఉమానాథ్ మృతికి సిపిఎం పొలిట్‌బ్యూరో ప్రగాఢ సంతాపం తెలియచేసింది. కామ్రేడ్ ఉమానాథ్ నిఖార్సైన మార్క్సిస్టు, లెనినిస్ట్ అని, కార్మికవర్గంలో ఒక కమ్యూనిస్టుగా ఎలా పని చేయాలో మార్క్సిస్టులందరికీ దారి చూపిన ఆదర్శమూర్తి అని పార్టీ కొనియాడింది.

కామ్రేడ్ ఉమానాథ్ ఒకప్పటి మద్రాసు ప్రావిన్స్‌లోని (ప్రస్తుత కేరళలోని) కాసరగోడ్ జిల్లాలో మారుమూల గ్రామంలో ఒక నిరుపేద బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి పేరు రామ్‌నాథ్ షెనాయ్. తల్లి నేత్రావతి. వారికి ఆయన రెండవ సంతానం. ఆయన అన్నగారు కేశవరావు. చిన్న వయస్సులో ఆయన కన్‌హన్‌గడ్, తలిస్సెరీ ప్రాంతాలలో నివసించటం వలన బ్రిటీస్ సామ్రాజ్యవాదుల పరిపాలనలో శ్రమ జీవుల దుర్భర జీవితాలను గమనించటానికీ, అర్థం చేసుకోవటానికీ అవకాశం దొరికింది. ఆ తరువాత కాలంలో ఆయన అన్నగారు తన ఇన్సూరెన్స్ ఏజెన్సీ వ్యాపార అభివృద్ధి కోసం మొత్తం కుటుంబాన్ని కాసర్‌కోడ్ కు పంపించారు. అక్కడ హైస్కూల్‌లో చదువుతుండగానే ఉమానాథ్ తన స్నేహితులైన ఇకె నయనార్, ఇంబిచి బవ ప్రభావం వలన కమ్యూనిస్టు ఉద్యమాల వైపు మొగ్గు చూపారు. మలబార్ క్రిష్టియన్ కాలేజిలో ఇంటర్ చదువుతున్న కాలంలో సైద్ధాంతికంగా కమ్యూనిస్టు భావజాలం మరింత బలపడింది. కోజికోడ్ మొట్ట మొదటి మేయర్, కమ్యూనిస్టు కురువృద్ధుడు కామ్రేడ్ మంజునాథ.. ఉమానాథకు బంధువే. ఆ తరువాత కాలంలో ఉమానాథ్ ఉన్నత విద్య కోసం తమిళనాడు వెళ్ళి అన్నామలై యూనివర్సిటీలో బి.ఏ హానర్స్ కోర్సులో చేశారు. అక్కడే ఆయన పూర్తికాలం కమ్యూనిస్టుగా మారటానికి పునాది ఏర్పడింది. కమ్యూనిస్టు మేధావులైన కామ్రేడ్ పి.కృష్ణపిళ్ళై, ఇ.యం.యస్.నంబూద్రిపాద్, ఎస్. సుబ్రమణ్య శర్మల ప్రభావం వలన ఆయన డిగ్రీ చదువుతూనే 1939లో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడయ్యారు. కుటుంబ పోషణ కోసం భజన బృందాలలో గాయనిగా ఊరూరా తిరిగే తన తల్లితో పాటూ తాను కూడా హార్మోనియం నేర్చుకున్నారు. డిగ్రీ అవ్వగానే మంచి ఉద్యోగంలో చేరి పోషిస్తాడని ఉమానాథ్ కుటుంబం ఆశించింది. కానీ ఉమానాథ్ డిగ్రీ పూర్తవ్వకుండానే చదువు ఆపేసి పీడిత ప్రజల విముక్తికోసం పూర్తిగా అంకితమయ్యారు. ఆయన కమ్యూనిస్టు పార్టీ పూర్తికాలం కార్యకర్తగా మారాడు. ఆ సమయంలో పార్టీ కార్యక్రమాలపై నిషేధం అమలులో ఉంది. పార్టీ ఆయనను అజ్ఞాతంలో ఉండి పని చేయాలని ఆదేశించింది. ముంబై నుండి వచ్చే పార్టీ ప్రచురణలు, డాక్యుమెంట్‌లను కామ్రేడ్ పి.రామమూర్తి, మోహన్ కుమార మంగళం రహస్య స్థావరాలకు చేరవేయటం ఆయన ప్రధాన బాధ్యత. అలా కొరియర్‌గా పని ప్రారంభించిన ఉమానాథ్ 1941 బ్రిటీష్ సైనికులు కమ్యూనిస్టుల రహస్య స్థావరాలపై దాడులు జరిపినప్పుడు కామ్రేడ్ పి. రామమూర్తితోపాటు దొరికిపోయాడు. ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడనే నెపంతో బ్రిటీష్‌వారు అతనిని అరెస్టు చేసి, ఇతర కమ్యూనిస్టు నాయకులతోపాటు రెండున్నర సంవత్సరాలు జైలు శిక్ష విధించారు. ఆ కేసే 'మద్రాస్ కుట్ర కేసు'గా ప్రసిద్ధి గాంచింది.

జైలు నుండి విడుదలైన తరువాత పార్టీ ఆయనను తిరుచ్చిలోని పొన్నమలైలో రైల్వే సమ్మెను నిర్వహించాలని ఆదేశించింది. పొన్నమలైలో గోల్డెన్‌రాక్ వర్క్‌షాపులో 1946లో జరిగిన రైల్వే కార్మికుల సమ్మె కార్మికవర్గ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది. ఎంతో మంది కమ్యూనిస్టు నాయకులకూ, కార్యకర్తలకూ స్ఫూర్తినిచ్చింది. బ్రిటీష్ పాలకుల నిర్బంధకాండలకు బెదరకుండా యం. కళ్యాణసుందరం, కె. ఆనంద్ నంబియార్, ఆర్.ఉమానాథ్, పప్పా ఉమానాథ్‌లు రైల్వే సమ్మె జయప్రదం అవటం కోసం తీవ్రంగా కృషి చేశారు. కార్మికుల కనీస హక్కుల కోసం జరిగిన ఈ పోరాట ప్రభావం కమ్యూనిస్టు ఉద్యమం దేశవ్యాప్తంగా వ్యాపించడానికి దోహదపడింది. కార్మికవర్గ పోరాట చరిత్రలో గోల్డెన్‌రాక్ వర్క్‌షాపు కార్మికుల సమ్మె యావత్తు కార్మికవర్గానికి ఆదర్శంగా నిలిచింది. 1946 సెప్టెంబరు 5న హారిసన్ అనే పోలీసు అధికారి నేతృత్వంలో పోలీసులు వర్క్‌షాపు యూనియన్ ఆఫీసు పక్కనే ఉన్న మైదానంలో సమావేశమై ఉన్న కార్మికులపైకి పాశవికంగా కాల్పులు జరిపి ఐదుగురిని బలితీసుకున్నారు. ఈ పోరాట కాలంలోనే కామ్రేడ్ ఉమానాథ్‌కి, ధనలక్ష్మి ఎలియాస్ పప్పా, ఆమె తల్లి అలివేలు అలియాస్ లక్ష్మి పరిచయమయ్యారు. 1948లో కాంగ్రెస్ ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాలను నిషేధించింది. పప్పా, ఆమె తల్లి లక్ష్మి ఆ కాలంలో మద్రాసు నగరానికి చేరుకున్నారు. ఉమానాథ్ కూడా మద్రాసు కేంద్రంగా పని చేయటం ఆరంభించారు. 1950లో పోలీసులు ఉమానాథ్‌తో పాటు పప్పానూ, ఆమె తల్లి లక్ష్మినీ, మరికొందరు కమ్యూనిస్టు కార్యకర్తలనూ అరెస్టు చేసి జైలులో పెట్టారు. జైలులో వీరందరూ నిరవధిక నిరాహారదీక్ష చేయగా, 24 రోజు

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. భారత కార్మికోద్యమ మణిపూస
   కా॥ రామానాథ్
   – ఎల్.ఎస్. భారవి 2

2. ఎన్నికలు -వామపక్ష ఉద్యమానికి సవాళ్ళు
   – బి.వి. రాఘవులు 4

3. అనేక ప్రభంజనాలు, ఒక మీడియా సునామీ
   – పి. సాయినాథ్ 9

4. పేదల సంక్షేమంపై దాడికి సిద్ధం
   – ప్రభాత్ పట్నాయక్ 12

5. కాలం చెల్లిన స్వేచ్ఛా మార్కెట్ ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదం
   – వి.శ్రీనివాసరావు 15

6. పాఠం బోధించడంలో మెళకువలు
   – నిర్మల్ కుమార్ 17

7. ఆర్థిక వ్యవస్థలో స్థబ్దత - ద్రవ్యీకరణ వైరుధ్య స్వభావం
   – ఫ్రెడ్ మెగ్డాఫ్, జాన్ బెల్లమీ ఫాస్టర్ 24

8. ప్రజాఉద్యమాలద్వారా ప్రత్యామ్నాయ శక్తులు పెరగాలి
   – బి.వి. రాఘవులు 33



ఎడిటర్:
**ఎస్. వెంకట్రావు**

ఎడిటోరియల్ బోర్డు:
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరుపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: బి.వి.రాఘవులు
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
ముద్రణ : ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్–20
ఫోన్: ఎడిటోరియల్ 0866–2573822
మేనేజర్: 040–27673787
EMail:svenkatarao_1958@yahoo.com
Visit cpi(m) site at : cpim.org


# ఎన్నికల ఫలితాలు

16వ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు దేశవ్యాపితంగా, 15వ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణాల్లోనూ వామపక్ష ప్రజాతంత్ర శక్తులకు నిరాశకలిగించాయి. మూడు దశాబ్దాల తరువాత దేశంలో ఒక బూర్జువా పార్టీ తనంత తాను పూర్తి మెజారిటీతో విజయం సాధించడమే కాకుండా పచ్చి మతతత్వ, అభివృద్ధి నిరోధక శక్తి అయిన భారతీయ జనతా పార్టీ ఆ విజయం కైవశం చేసుకుంది. మరోవైపు వామపక్షాలకు లోక్‌సభలో ఉన్న బలం దాదాపు సగానికి తగ్గిపోయింది.

కాంగ్రెస్ నాయకత్వంలోని పదేళ్ల పాలన ముఖ్యంగా యుపిఎ2 ప్రభుత్వ విధానాలు, అవినీతిపై ఉప్పొంగిన ప్రజాగ్రహ వెల్లువలో నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ఉత్తరాది రాష్ట్రాల్లో పెద్ద మెజారిటీలు సాధించింది. దక్షిణాదిలో కూడా అది అనేక ప్రాంతాల్లోకి చొచ్చుకుపోయింది. ఒక్క త్రిపుర మినహా వామపక్షాల స్థావరాల్లోకి కూడా బిజేపీ చొచ్చుకుపోయింది. కేరళలో అది ఒక్కస్థానమూ గెలవకపోయినా ఓట్ల శాతం పెంచుకుంది, బెంగాల్‌లో ఓట్ల శాతం గణనీయంగా పెంచుకోవడంతోబాటు సిపిఐ(ఎం)తో సమానంగా రెండు స్థానాలు గెలుచుకుంది.

ఎన్నికల ఫలితాలపై పార్టీ కేంద్ర కమిటీ జూన్ 6,7 తేదీల్లో సమీక్షిస్తుంది. దాన్ని ప్రతి పార్టీ సభ్యుడు అధ్యయనం చేయాలి.

ఈ ఎన్నికల్లో రెండు ప్రధానమైన అంశాలు ప్రజాతంత్ర శక్తులకు ఆందోళన కలిగిస్తున్నాయి. 1. బడా పెట్టుబడిదారీ వర్గం నేరుగా ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకుని తమకు అనుకూలంగా వ్యవహరిస్తాడనుకున్న మోడీని గెలిపించడానికి వేలకోట్ల రూపాయల డబ్బు ఖర్చు చేయడం, తన అధీనంలోని మీడియాను ఉపయోగించడం. 2. లోక్‌సభలో ఒకవైపు కార్మికవర్గ పార్టీలైన వామపక్ష స్థానాలు తగ్గిపోయి, అధిక స్థానాలను పెట్టుబడిదారులే నేరుగా కైవశం చేసుకోవడం. వీటి పర్యవసానాలు భారత రాజకీయ, ఆర్థిక రంగాలపై తీవ్రంగా ఉంటాయన్నదాంట్లో సందేహం లేదు. అదే సమయంలో బిజెపీకి దేశవ్యాపితంగా వచ్చిన ఓట్లు 31 శాతం మాత్రమేనన్న విషయం మనం గుర్తుంచుకోవాలి. అంటే దేశంలోని ఓటర్లలో దాదాపు 70 శాతం మంది మోడీకీ, బిజెపీకీ ఓటు వేయలేదు.

మోడీని రంగంమీదకు తెచ్చినవి రెండు శక్తులు. ఒకటి, పచ్చి మతోన్మాద సంస్థ అయిన ఆర్ఎస్ఎస్. రెండవది, బడా బూర్జువా వర్గం. అందువల్ల ఇప్పుడు మోడీ ముందు ఆ రెండు శక్తుల ఎజెండాలు ఉన్నాయి. కాంగ్రెస్ కన్నా బలంగా నయా–ఉదారవాద ఆర్థిక విధానాలను అమలు పరచాలని కార్పొరేట్ రంగం కోరుకుంటున్నది. మతోన్మాద ఎజెండాలైన 370 అధికరణం రద్దు, అయోధ్యలో రామాలయ నిర్మాణం, మతమార్పిడి నిరోధక చట్టం వంటి వాటిని అమలు చేయాలని ఆర్ఎస్ఎస్ ఆరాటపడుతోంది. ఒక ఎజెండా ప్రజలమీద విపరీతమైన భారాలు మోపుతుంది, రెండోది ప్రజల మధ్య చిచ్చుపెట్టి దేశ సమైక్యతను నాశం చేస్తుంది.

ప్రజలకు హాని కలిగించే ఈ రెండు విధానాలను వామపక్షాలు మొదటినుండి వ్యతిరేకిస్తున్నాయి. వాటికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తున్నాయి. వీటి ప్రమాదం గురించి ఇప్పుడు ప్రజలందరికీ అర్థం కాకపోవచ్చు. కానీ రానురాను వారు అర్థం చేసుకుంటారు. ప్రతిఘటిస్తారు. ఆ ప్రతిఘటనకు నాయకత్వ వహించడానికి పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి. విస్తృతస్థాయిలో వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాలు నడపడం ద్వారా మాత్రమే మనం ప్రజాపునాది పెంచుకోగలం.


**చందా వివరాలు**

విడిప్రతిక: రూ.10, సంవత్సర చందా:రూ.100, పోస్టు ద్వారా రూ. 120

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**

మేనేజర్,
మార్క్సిస్టు
(సైద్ధాంతిక మాసపత్రిక),
ఎం.హెచ్ భవన్ (ప్రజాశక్తి కార్యాలయం),
అజామాబాద్, హైదరాబాద్- 20

**ఈ మాసం ముఖ్యాంశం**

# ఎన్నికలు -వామపక్ష వాద్యమానికి సవాళ్ళు

**బి.వి. రాఘవులు**



**రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పొలిట్ బ్యూరో సభ్యులు.**

గత రెండు దశాబ్దాలలో పార్లమెంటరీ ఎన్నికల రంగంలో వచ్చిన తీవ్ర మార్పులను ప్రస్తుత పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు చక్కగా ప్రతి బింబిస్తున్నాయి. డబ్బు ప్రభావం అనూహ్యాంగా పెరిగింది. కులం, మతం, ప్రాంతం, తెగ వంటి అస్థిత్వభావాల పాత్ర తీవ్రమైంది. ఎన్నికల నిర్వహణ కార్పోరేట్ సరళిలోకి మారి పోయింది. ఎన్నికల సంఘం స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకన్నా బూర్జువా పార్టీల మధ్య పోటీని నియంత్రణలో ఉంచే పాత్రను పోషిస్తున్నది. ఎన్నికల రంగంలో వచ్చిన మార్పులు పాలక వర్గాల పట్టును ఇంకా బిగిస్తున్నాయి. వామపక్షాల అవకాశాలను బాగా కుదిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, వైఎస్ఆర్‌పి, టిఆర్ఎస్, బిజెపి వగైరా బూర్జువా పార్టీలన్నీ అనుసరించిన వ్యూహాలు, పద్ధతులను పరిశీలిస్తే వామపక్షాలకు ఎన్నికల రంగంలో ఎదురవుతున్న సవాళ్ళను అర్థం చేసుకోవచ్చు.

**మితిమీరిన డబ్బు ప్రభావం**

ఎన్నికల్లో డబ్బు పాత్ర కీలకంగా మారింది. ఈ ఎన్నికల్లో దేశంలో రూ.30 వేల నుండి 45 వేల కోట్ల వరకు అభ్యర్థులు ఖర్చు చేశారని అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థుల ఎన్నికల ఖర్చు రూ.10 వేల కోట్ల దాకా ఉంటుందని అంచనా.

డబ్బే ప్రధాన కొలబద్దగావడంతో ధనవంతులు మాత్రమే పోటీ చేయగలుగుతున్నారు. ఎన్నికల అధికారులకు సమర్పించిన అఫిడవిట్లు పరిశీలిస్తే వాస్తవంగా వాన్న ఆస్తులలో చాలా స్వల్ప భాగమే అఫిడవిట్లలో వెల్లడైనప్పటికీ అభ్యర్థుల ఆర్థిక స్థోమత ఎంత భారీగా వుందో విదితమవుతుంది. ధనవంతులైన అభ్యర్థుల సంఖ్య ప్రతి ఎన్నికకు పెరుగుతున్నది. ప్రజా ప్రతినిధుల వర్గ పొందికలో ముఖ్యమైన మార్పులు వస్తున్నాయి. 1990-91లో దేశస్థాయిలో పార్లమెంటులో వ్యాపారవేత్తలు 7.24 శాతం మంది ఉంటే 14వ పార్లమెంటులో వారి శాతం 22.33 కు పెరిగింది. ప్రస్తుత పార్లమెంటులో వారి నిష్పత్తి ఇంకా ఎక్కువగా ఉండబోతున్నది.

గతంలో లాయర్లు, డాక్టర్లు, భూస్వాములు ఎన్నికల్లో అభ్యర్థులుగా ఎక్కువగా కనపడేవారు. అరుదుగా మాత్రమే పెట్టుబడిదారులు ప్రత్యక్షంగా రంగంలో ఉండేవారు. వారు పరోక్షంగా పార్టీలకు అండనిచ్చేవారు. కానీ ఇప్పుడు కార్పోరేట్ శక్తులు వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలే ఎన్నికల్లో ప్రత్యక్షంగానే అభ్యర్థులుగా ప్రవేశిస్తున్నారు. విద్య, వైద్య రంగం, రియల్‌ఎస్టేటు, మద్యం, మైనింగ్, ఫైనాన్స్, చేపల చెరువులు, పొగాకు, పత్తి, బంగారం, నీరు, పాలు వగైరా వ్యాపారాలు, సినిమా, ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు రంగాల నుండి ఎక్కువగా అభ్యర్థులు రంగంలోవాన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో విజయం సాధించిన అభ్యర్థుల వివరాలను(పార్లమెంటు, శాసనసభ) పరిశీలిస్తే 75 శాతం పారిశ్రామిక, వ్యాపార రంగాల నుండి ఉన్నారు. భూస్వాములు 20 శాతం మాత్రమే ఉన్నారు. 5 శాతం బ్యూరోక్రాట్స్ నుండి వచ్చారు. అభ్యర్థుల వర్గ పొందికలో జాతీయ-ప్రాంతీయ పార్టీల మధ్య వ్యత్యాసం పెద్దగా లేదు.

శాసనసభ, పార్లమెంట్ స్థాయిల్లో పెట్టుబడిదారీ వర్గాల ప్రతినిధులు అత్యధికంగా ఉంటే, స్థానిక సంస్థల్లో వీరి సంఖ్య గతంలో తక్కువగా ఉన్నా ఈ మధ్యకాలంలో భూస్వామ్య, ధనిక రైతులు నుండే కాకుండా, కాంట్రాక్టర్లు, వ్యాపారస్తుల నుండి కూడా ఎక్కువగా స్థానిక సంస్థల్లో ప్రవేశిస్తున్నారు.

సరళీకరణ విధానాల తర్వాత నయా-సంపన్నుల సంఖ్య పెరగడంతో భారీగా ఖర్చు చేయగల డబ్బున్న అభ్యర్థులకు కొదవ ఉండడం లేదు. ఇంతకుముందు ప్రభుత్వ ఆధీనంలో నిర్వహించబడిన రంగాలలో ప్రైవేటు శక్తులకు అవకాశం కల్పించడం, ప్రభుత్వ కార్యకలాపాలన్నీ కాంట్రాక్టీకరణ (అవుట్‌సోర్స్) కావడంతో ప్రైవేటు ధనవంతుల సంఖ్య గణనీయంగా పెరిగింది. రాజకీయాలతో ప్రత్యక్ష అనుబంధం లాభార్జనకు సులభ మార్గంగా, అవసరంగా ఈ శక్తులు భావిస్తున్నాయి. ఈ కొత్త సంపన్న వర్గాలు సంపదలో భాగమేగాకుండా అధికారంలో (పవర్‌లో) భాగం కావాలన్న కాంక్షతో రాజకీయాల్లోకి వస్తున్నారు.

బూర్జువా రాజకీయ పార్టీలు డబ్బు ఖర్చుపెట్టగల శక్తి ప్రధాన కొలబద్దగా పెట్టుకుని అభ్యర్థులను ఎంపిక చేస్తున్నాయి. పార్లమెంటుకు 50కిపైన, శాసనసభకు 10కి పైన కోట్ల రూపాయలు ఖర్చుపెట్టగల్గినవారినే అభ్యర్థులుగా ఈ ఎన్నికల్లో ఎంపిక చేశారు. డబ్బుకు తోడు ఇతర అంశాలను అదనంగా మాత్రమే పరిగణించారు (కులం, మతం, స్థానికం వగైరా). ముఖ్యంగా ఎం.పి. అభ్యర్థులకు రాజకీయాలతో, ప్రజలతో సంబంధం వుండడం కొలబద్దగా ఇంకెంత మాత్రమూ లేదు. డబ్బు ఖర్చుపెట్టగలవారిని ఎక్కడ వుంటే అక్కడ నుండి తెస్తున్నారు. శాసనసభ్యుని ఎంపికకు డబ్బుతోపాటు కొంత వరకు సామాజిక ప్రాతినిధ్యం కూడా చూస్తున్నారు. ఇక్కడ కూడా సామాజిక ప్రాతినిధ్యం ద్వితీయమే.

**వ్యాపార సరళిలో ఎన్నికల నిర్వహణ**

ఎన్నికల ప్రక్రియంతా వ్యాపార నిర్వహణలాగా మారిపోయింది. ప్రతీదీ కొనడం, అమ్మడం రూపం సంతరించుకుంది.

పార్టీలకు, అధినేతలకు డబ్బులిచ్చి టిక్కెట్లు కొనుక్కుంటున్నారు. తిరుగుబాటుదారులను, ప్రత్యర్థులను డబ్బుముట్టచెప్పి పోటీలో లేకుండా లోబర్చుకుంటున్నారు.

క్షేత్రస్థాయిలో ఓటర్లను ప్రభావితం చేయగల వ్యక్తుల వివరాలను (మాజీ, తాజా ప్రజా ప్రతినిధులు, స్థానిక రాజకీయ కార్యకర్తలు, మత,

కుల, పెద్దలు, స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు, డ్వాక్రా బృందాల నాయకులు వగైరా) ముందుగానే సేకరించుకొని స్థాయిని బట్టి వారికి డబ్బును పంపిణీ చేసి ఆకర్షిస్తున్నారు. వాహనాలను సరఫరా చేస్తున్నారు.

బహిరంగ సభలకు, ప్రదర్శనలకు, పాదయాత్రలకు, కూడళ్ళలో జైకొట్టడానికి, రోడ్లపై బార్లు తీరడానికి రేట్లు నిర్ణయించి పాల్గొన్నవారికి ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నారు. ఈ ఎన్నికల్లో ప్రదర్శనలకు, సభలకు వస్తే మనిషికి రూ. 200 నుండి రూ.500 వరకు, భోజనం పొట్లాం, సారా ప్యాకెట్లు ఇస్తున్నారు.

ఇతర పనులకు కూలీలను సమీకరించడానికి మేస్త్రీలు, బ్రోకర్లు ఎలా వుంటారో ఎన్నికలకు కూడా అలాగే వుంటున్నారు. వాస్తవంగా అంతకు ముందే ఉనికిలో వున్న మేస్త్రీ నెట్‌వర్క్‌లు, స్వయం సహాయ బృందాల నెట్‌వర్క్‌లు, ఎన్.జి.వో నెట్‌వర్క్‌లను ఇందుకు వాడుకుంటున్నారు.

డబ్బును రవాణా చేయడానికీ, పంపిణీ చేయడానికీ ఎన్నో వినూత్న మార్గాలు అనుసరించబడుతున్నాయి.

బూర్జువా పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల నిర్వహణలో ఆధునిక యాజమాన్య పద్ధతులనూ, సాంకేతిక, ప్రచార పరిజ్ఞానాన్నీ విరివిగా వినియోగించారు.

ప్రతి పార్టీ ప్రొఫెషనల్ సంస్థలచే ఎన్నికలకు ముందు, ఎన్నికల రోజు సర్వేలను నిర్వహించుకోవడం, సమాచారాన్ని కంప్యూటర్ల ద్వారా విశ్లేషించుకోవడం, వచ్చిన నిర్ధారణలను బట్టి వ్యూహాలను, ప్రణాళికలను మార్చుకోవడం చేస్తున్నాయి.

**ఓటును సరుకుగా భావిస్తున్న జనం**

ఎన్నికల కార్యక్రమాలలో పాల్గొనడం స్వచ్ఛంద కార్యక్రమంగా గాకుండా కూలీ కార్యక్రమంగా మారిపోయింది. ఎవరు కూలీకి పిలిచినా వెళ్ళినట్టుగానే, ఏ పార్టీ పిలిచినా డబ్బు (కూలీ) తీసుకుని పేదలు వెళుతున్నారు. ఒక పార్టీకి కూలీకి వెళ్ళినంత మాత్రాన అదే పార్టీకి ఓటు వేయకపోవచ్చు. తాము ఓటు వేసే పార్టీ కార్యక్రమానికే వెళుతున్నాంగదా అని, కూలీ తీసుకోకుండా వుండడంలేదు (కూలీ డబ్బులతోపాటు, భోజనం, మగవారికి మద్యం కూడా వుంటాయి).

ఓటు కూడా సరుకుగా మారింది. ఈ ఎన్నికల్లో 500 రూపాయల నుడి 1000 రూపాయల వరకు ఒక ఓటుకు ధర పలికింది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఓటు ధర ఐదారు వేలకు కూడా వెళ్లింది. ప్రతి ఓటరు ఓటుకు డబ్బు ఆశిస్తున్నాడు. సాధారణ సరుకుకూ, ఓటు సరుకుకూ ఒక వ్యత్యాసం వుంది. ఓటు వేసిన తర్వాతనే ఓటు వ్యక్తి నుండి విడిపోతుంది. అప్పటి వరకు ఓటును ఎంత మందికైనా అమ్ముకునే అవకాశం వుంది. అందువలన ఓటరు ఇచ్చిన ప్రతి పార్టీ నుండి డబ్బు తీసుకుంటున్నాడు. ప్రతి పార్టీ నుండి డబ్బు ఆశిస్తున్నాడు. డబ్బు ఇవ్వని పార్టీని పరిగణించడానికి నిరాకరించే ధోరణి పెరుగుతూ వున్నది.

> **"పోలీసు, పారామిలిటరీ యంత్రాంగాన్ని వినియోగించి కొన్ని తరహాల కండబలం ప్రయోగించే సందర్భాలను తగ్గించగలిగారేమోగాని, డబ్బు ప్రభావాన్ని ఎన్నికల సంఘం అరికట్టలేకపోయింది. ఒక రాజకీయవేత్త అన్నట్టు ఎన్నికల సంఘం "ఇంటి ముందు ద్వారాన్ని కాపలా కాస్తూ వెనక ద్వారాన్ని వదిలివేస్తున్నది"."**

డబ్బు ప్రభావం ఒక ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం కాదు. సంస్కరణలు అమలు జరిగిన అన్ని రాష్ట్రాల్లోనూ ఇది వ్యాపిస్తున్నది. వామపక్షాలు బలంగా ఉన్న రాష్ట్రాలకు సైతం క్రమేణా వ్యాపిస్తున్నది.

ఎన్నికల కమిషన్ డబ్బు సరఫరా కాకుండా ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నామని చెబుతున్నా, చాలా సొమ్మును పట్టుకున్నామని ప్రచారం చేసినా, డబ్బు ప్రభావం ఏమాత్రం తగ్గలేదు. ఎన్నికల సంఘం హడావిడి పేద అభ్యర్థులకు, చిన్న పార్టీలకు ఎక్కువ ఇబ్బందిగా వుంది తప్ప పెద్ద బూర్జువా పార్టీలకు ఎటువంటి ఇబ్బంది కలిగించడంలేదు. ప్రస్తుత ఎన్నికల్లో రాష్ట్రంలో రూ. 131 కోట్లు పట్టుబడ్డాయి. ఈ డబ్బు మొత్తం ఖర్చవుతున్నదానితో పోల్చితే సముద్రంలో నీటి చుక్కంత కూడా ఉండదు.

పోలీసు, పారామిలిటరీ యంత్రాంగాన్ని వినియోగించి కొన్ని తరహాల కండబలం ప్రయోగించే సందర్భాలను తగ్గించగలిగారేమోగాని, డబ్బు ప్రభావాన్ని ఎన్నికల సంఘం అరికట్టలేకపోయింది. ఒక రాజకీయవేత్త అన్నట్టు ఎన్నికల సంఘం "ఇంటి ముందు ద్వారాన్ని కాపలా కాస్తూ వెనక ద్వారాన్ని వదిలివేస్తున్నది".

**ప్రచార సరళి**

బూర్జువా పార్టీల ఎన్నికల ప్రచార పద్ధతులు కూడా కార్పోరేటీకరణ, వ్యాపారీకరణ అయ్యాయి. ఎన్నికల ప్రచారం కార్పోరేట్ సంస్థల సరుకుల ప్రచారాన్ని తలపిస్తున్నది. వ్యాపార ప్రకటనలకు, రాజకీయ ప్రచారానికి వ్యత్యాసం లేకుండా పోయింది. బ్రాండ్ సృష్టించడమే రాజకీయ ప్రచా రంగా మారింది. వానవాలను మరుగుపర్చడమే ప్రచారం ధ్యేయంగా వున్నది.

ప్రస్తుతం ఎన్నికల ప్రచార సరళి ప్రజల్లో రాజకీయ చైతన్యాన్ని మొద్దుపరుస్తున్నది. రాజకీయ రహితం చేస్తున్నది. విధాన పరంగా చూసినప్పుడు బూర్జువా పార్టీల మధ్య వ్యత్యాసం ఉండడం లేదు. వామపక్షాలు చెబుతున్న ప్రత్యామ్నాయం ప్రజలకు చేరడం లేదు. ఇతర పార్టీలతోటి సర్దుబాట్లు చేసుకున్నప్పుడు వామపక్షాలు కూడా ప్రత్యామ్నాయాన్ని ముందుకు తేలేకపోతున్నాయి. ఒకవేళ తెచ్చినా, దానికి ప్రాధాన్యత ఉండడం లేదు. వీటన్నింటి మూలంగా ప్రజలు రాజకీయంగా ఎంచుకోవడానికి విధానపరమైన అంశాలు ఏమీ ఉండడం లేదు.

విధాన పరమైన భిన్నత్వం లేనందున ప్రధాన బూర్జువా పార్టీలు ప్రచారమంతా వ్యక్తిగత ఆరోపణలతో, దూషణలకు ప్రాధాన్యతనిస్తున్నాయి. వ్యక్తుల మంచిచెడ్డల గురించి, గుణగణాల గురించి ప్రచారం చేస్తున్నాయి. అస్థిత్వ భావాలు రెచ్చగొట్టేందుకు, సామాజిక సమీకరణలను సాధించేందుకు అవసరమైన నినాదాలను ముందుకు తెస్తున్నాయి. పేద ప్రజలను ఆకర్షించడానికి పోటీలు పడి ప్రజాకర్షక వాగ్దానాలను చేస్తున్నాయి. మొత్తం మీద ఈ ప్రచారమంతా బూర్జువా పార్టీల్లో ఎవరో ఒకరిని ఎంచుకోవడానికి తప్ప భిన్నమైన విధానాలను ఎంచుకోవడానికి ఆస్కారం ఇవ్వడం లేదు.

బూర్జువా పార్టీలన్నీ ప్రచారాన్ని కేంద్రీకృతం చేస్తున్నాయి. రోడ్‌షోలు, హెలికాప్టర్ ప్రచారాలు, నాయకుని కేంద్రంగానే నడుస్తున్నాయి. ఒకే నాయకుని చుట్టూ ప్రచారం తిప్పబడుతున్నది. వ్యక్తి కేంద్రంగా ప్రచారం ప్రధాన బూర్జువా పార్టీలకు అవసరం. వాపక్షాలు కూడా ఆ ధోరణిలో పడాల్సిన పరిస్థితి సృష్టిస్తున్నది. వామపక్ష నాయకుల చుట్టూ వివాదాలను సృష్టించడం ద్వారా హాని చేయడానికి కార్పోరేట్ మీడియా ప్రయత్నిస్తున్నది.

టెలివిజన్‌లో ప్రచారం బాగా పెరిగింది. స్వంత చానళ్ళు లేదా ప్రభావం వున్న చానళ్ళ ద్వారా ప్రచారం చేసుకుంటున్నాయి. వ్యాపార

> **❝ ప్రజలు కూడా అస్థిత్వ భావాలకు ప్రభావితులవుతున్నారు. దీని మూలంగా అభ్యర్థులు అవినీతిపరు లైనా, నేరస్తులైనా పట్టించుకోకుండానే ఓటర్లు ఆదరిస్తున్నారు. నేరపూరితమైన చరిత్ర ఉన్నా తమ అస్థిత్వానికి చెందిన వాడైతే తమ ప్రయోజనాలకు రక్షణగా ఉంటాడనీ, అక్రమంగానైనా తమకు మేలు చేస్తాడనీ ప్రత్యర్థుల నుండి కాపాడుతాడనీ వారిని ప్రజలు అంగీకరిస్తున్నారు.❞**

ప్రకటనలకు భారీగా ఖర్చు చేస్తున్నాయి. పెయిడ్ న్యూస్‌పై ఎన్ని ఆంక్షలున్నా కొత్త కొత్త మార్గాలలో పెయిడ్ ప్రచారం ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో భారీగా పెరిగింది. డబ్బిచ్చిన వారికి ప్రచారం ఇచ్చే ధోరణి మీడియాలో బాగా పెరిగింది.

బిజెపి ప్రారంభించిన హోర్డింగ్ ప్రచారానికి పోటీగా మిగతా పార్టీలు కూడా చేస్తున్నాయి. నెట్‌లో కూడా రకరకాల రూపంలో ప్రచారం పెరిగింది. వాహనాలు పెట్టి త్రీడీ పద్ధతిలో ప్రత్యక్ష ప్రచారం చేయడం, కార్పోరేటు సంస్థలు తమ ఉత్పత్తులను ప్రచారం చేయడానికి స్పెషల్ డిస్లే వాహనాలను వినియోగించినట్లుగానే, అభ్యర్థులు విస్తృతంగా వినియోగిస్తున్నారు.

గ్రామాలలో, బస్తీలలో విందులు, వినోదాలను ప్రచార సాధనాలుగా వినియోగిస్తున్నారు.

ఈ సరళి ప్రచారానికి భారీ ఖర్చు, భారీ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన వినియోగం అవసరం. బడా ధనవంతులు, బ్లాక్ మనీ వున్నవారు మాత్రమే ఈ ఖర్చుకు తట్టుకోగలరు.

### కులం, మతం ప్రభావం

ప్రధాన బూర్జువా పార్టీల మధ్య పోటీలో ఒకదానిమీద ఇంకొకటి పైచేయి సాధించాలంటే డబ్బు ఒక్కటే సరిపోదు. అన్ని పార్టీలూ పోటీపడి డబ్బు ఖర్చు చేస్తున్నందు వలన డబ్బు ప్రభావం బూర్జువా పార్టీల విషయంలో న్యూట్రలైజ్ అయిపోతున్నది. డబ్బుకు ఇతర అంశాలు తోడయితేనే ప్రత్యర్థుల మీద పైచేయి సాధించడానికి సాధ్యమవుతుంది. ఈ ఇతర అంశాల్లో ప్రస్తుతం కులం, మతం కీలక పాత్ర పోషిస్తున్నాయి. కులమత భావాలను బూర్జువా పార్టీలు అనేక రూపాల్లో వినియోగించుకుంటున్నాయి.

సంఖ్యాబలం తక్కువైనా రాష్ట్రంలోని ఆధిపత్య కులాలు బూర్జువా పార్టీలకు పునాదిగా వున్నాయి. ప్రతి బూర్జువా పార్టీకి ఒకటి లేక కొన్ని ఆధిపత్య కులాలకు చెందిన సంపన్న వర్గాలు వెన్నెముకగా వుంటూ వాటి చుట్టూ ఇతర తరగతులను సమీకరిస్తున్నాయి. ప్రతి పార్టీ ఈ కోర్ బలం మీద ఆధారపడి ఎన్నికల పోరాటం చేస్తున్నాయి.  ఆయా పార్టీల మీద వచ్చే అసంతృప్తి, సంతృప్తులు ప్రత్యేక, అసాధారణ సందర్భాలలో తప్ప, ఈ కోర్ బలాన్ని పెద్దగా ప్రభావితం చేయడంలేదు. పార్టీలపై విశ్వాసానికి కులం, మతం అభిప్రాయాలే బలంగా పని చేస్తున్నాయి. బూర్జువా పార్టీలు కూడా తమకు పునాదిగా వున్న కులాలు, మతాలను జాగ్రత్తగా పోషించుకుంటూ వస్తున్నాయి.

బూర్జువా పార్టీలు బలహీనవర్గాలనూ, తరగతులనూ, కులాలనూ ఆకర్షించడానికి కులమత భావాలను ప్రోత్సహించే నినాదాలను, వాగ్దానాలను ప్రచారం చేస్తుంటాయి. ఆకట్టుకోదల్చుకున్న కులాలకు, మతాలకు పదవులు, రిజర్వేషన్లు, రాయితీలను ఎరవేయడం ద్వారా ఓటర్లను ఆకర్షించడానికి పూనుకుంటున్నాయి. తెలంగాణాలో బిసికి ముఖ్యమంత్రినిస్తానని, ఆంధ్రప్రాంతంలో రెండు కులాలకు ఉపముఖ్యమంత్రులను ఇస్తానని తెలుగుదేశం ప్రకటించడం, కాపులను బిసిల్లో చేర్చుతామని ప్రకటించడం, ముస్లింలకు 12శాతం రిజర్వేషన్లు ఇస్తామని టిఆర్ఎస్ చెప్పడం ఈ కోవలోకే వస్తాయి.

రాష్ట్ర స్థాయిలో బూర్జువా పార్టీల నాయకత్వాలు, బూర్జువా పార్టీలు కొన్ని సంఖ్యాబలం కలిగిన తరగతులను ఆకర్షించాలని ప్రయత్నం చేస్తే ఆ పార్టీల అభ్యర్థులు స్థానికంగా నియోజకవర్గాల్లో తమ కులంవారిని, మతం వారిని సమీకరించే ప్రయత్నాలు చేస్తున్నారు. కులం సెంటిమెంటును ఉపయోగించడమే కాకుండా కుల సంఘాలనూ, కులపెద్దలనూ, మత పెద్దలనూ రంగంలోకి దించి తెరచాటున ముమ్మరమైన ప్రయత్నాలు చేస్తున్నారు.

ప్రజలు కూడా అస్థిత్వ భావాలకు ప్రభావితులవుతున్నారు. దీని మూలంగా అభ్యర్థులు అవినీతిపరులైనా, నేరస్తులైనా పట్టించుకోకుండానే ఓటర్లు ఆదరిస్తున్నారు. నేరపూరితమైన చరిత్ర ఉన్నా తమ అస్థిత్వానికి చెందినవాడైతే తమ ప్రయోజనాలకు రక్షణగా ఉంటాడనీ, అక్రమంగానైనా తమకు మేలు చేస్తాడనీ ప్రత్యర్థుల నుండి కాపాడుతాడనీ వారిని ప్రజలు అంగీకరిస్తున్నారు. సామాజిక విభజన వైరుధ్య పూరితంగా, తీవ్రంగా ఉన్నంత వరకు అవినీతి, నేరం అనే అంశాలను అన్ని తరగతులు ఒకేరకంగా తీవ్రంగా పరిగణించవని ఎన్నికల ఫలితాలు రుజువు చేస్తున్నాయి.

### కుదించబడుతున్న వామపక్షాల అవకాశాలు – ఎదుర్కొనే మార్గాలు

బూర్జువా పార్టీలన్నీ డబ్బునూ, కుల మత భావాలనూ, కార్పోరేట్ ప్రచారాన్నీ వినియోగిస్తున్నందున ఆయా పార్టీల గెలుపోటముల్లో వాటి పాత్ర ఎంతనేది స్పష్టంగా చెప్పలేకపోయినా వామపక్షాలకు మాత్రం తీవ్రంగా నష్టం జరుగుతున్నది. వామపక్షాల రాజకీయ పునాదినీ, ఓట్ల, సీట్ల బలాన్నీ కుదిస్తున్నది.

డబ్బు పంచని వామపక్షాలు ఎన్నికల పోరాటంలో లెక్కలో లేకుండా పోతున్నాయి. బూర్జువా పార్టీలు అన్నింటికీ డబ్బు అలవాటు చేయడం వలన వామపక్షాల నుండి కూడా పేదలు డబ్బు ఆశిస్తున్నారు. డబ్బులివ్వాలని అడుగుతున్నారు. బూర్జువా పార్టీలకూ, వామపక్షాలకూ మధ్య తేడాను గుర్తించడంలేదు. మన ఉద్యమాలలో పాల్గొన్న ప్రజానీకం కూడా ఈ ధోరణికి మినహాయింపుగా వుండడంలేదు. పార్టీతో బాగా మమేకమైన ప్రజలు మాత్రమే నిలబడగల్గుతున్నారు. ఇతర పార్టీల నుండి డబ్బు తీసుకోకుండా కట్టడి చేయప్రయత్నిస్తే మన ప్రజలే మనకు ఎదురు తిరుగుతున్నారు. డబ్బు తీసుకున్నా మీకే వేస్తాంగదా అని చెబుతున్నారు. మన ఓట్లను నిలబెట్టుకోవడానికి మనం డబ్బు ఖర్చు  కూడా పెట్టకపోతే మన ఓటింగు దెబ్బ తింటుందేమోనని కనీసం సారాకు, సాదరు ఖర్చులకు డబ్బు పెట్టాలన్న అభిప్రాయం బలపడుతున్నది.

బూర్జువా పార్టీల మాదిరిగా డబ్బు ఖర్చును వామపక్షాలు చేయలేవు. అటువంటి వనరులు వాటివద్ద ఉండవు. ఉన్న కొద్ది వనరులతో బూర్జువా పార్టీలను అనుకరించినా వాటితో పోటీ పడలేవు. (కమ్యూనిస్టు పార్టీలు, విప్లవ పార్టీలు అటువంటి పద్ధతులను అనుసరిం చవచ్చా అనేది పక్కనపెట్టినా). అందువలన ధన ప్రభావానికి వ్యతిరేకంగా పోరాటం తప్ప మరోమార్గం లేదు.

ప్రచారంలోనూ వామపక్షాలు పోటీ పడలేక పోతున్నాయి. బూర్జువా పార్టీల ప్రచార ధాటికి తట్టుకోలేక ప్రచారంలో వామపక్షాలు బాగా వెనుకబడుతున్నాయి. ప్రత్యామ్నాయ ప్రచా ర పద్ధతులను అన్వేషించాలి.

**" బూర్జువా పార్టీల మాదిరిగా డబ్బు ఖర్చును వామపక్షాలు చేయలేవు. అటువంటి వనరులు వాటివద్దఉండవు.ఉన్న కొద్ది వనరులతో బూర్జువా పార్టీలను అనుకరించినా వాటితో పోటీ పడలేవు. (కమ్యూనిస్టు పార్టీలు, విప్లవ పార్టీలు అటు వంటి పద్ధ తులను అనుసరించవచ్చా అనేది పక్కనపెట్టినా). అందువలన ధన ప్రభావానికి వ్యతిరేకంగా పోరాటం తప్ప మరోమార్గం లేదు. "**




వామపక్షాలు కూడా బూర్జువా పార్టీల మాదిరిగా కుల, మత తత్వాలను ఉపయోగించుకుంటే ఫలితాలు పొందగలవేమోనన్న ఆశ కొంత మందిలో వ్యక్తమవుతున్నది. డబ్బుతో ఎలా పోటీ పడలేమో, కులం, మతం విషయంలో సైతం బూర్జువా పార్టీలతో పోటీ పడడం సాధ్యంకాదు.

అస్థిత్వ భావాలు కొత్త వారిని ఆకర్షించటానికి ఆటంకం కావడమే కాకుండా వామపక్షాలకు ఇప్పటికే ఉన్న ప్రజాపునాదిని కూడా దెబ్బతీస్తున్నాయి. అట్టడగున ఉన్న సామాజిక తరగతులు గతంలో ఏకీకృతంగా ఉండేవి. బృందం మొత్తం ఐక్యంగా స్పందించేవి. వారి సమస్యలపై వామపక్షాలు ఉద్యమాలు చేసినప్పుడు ఆ తరగతి మొత్తం కమ్యూనిస్టులవైపు నిలబడేవి. ఆ సామాజిక తరగతుల మధ్య ఉన్న పురాతన సామాజిక సంబంధాలు కూడా వామపక్షాల వెనక సమీకరించబడేందుకు పరోక్షంగా తోడ్పడేవి. పెట్టుబడిదారీ సంబంధాలు, డబ్బు సంబంధాలు ఈ తరగతుల్లోకి ప్రవేశించిన తర్వాత, ముఖ్యంగా సరళీకరణ విధానాల ప్రభావం పెరిగిన తర్వాత ఏకీకృతంగా ఉన్న ఈ తరగతుల్లో ఆర్థిక వర్గ వ్యత్యాసాలు ఏర్పడ్డాయి. మధ్యతరగతి ఆవిర్భవించింది. ఈ తరగతిని సామాజికంగా పైకెదగాలన్న ఆలోచనలే ప్రధానంగా ప్రభావితం చేస్తున్నది. అస్థిత్వ భావాలవైపు ఆకర్షించబడుతున్నది. ఉద్యోగాల కోసం, వనరుల కోసం జరిగే పోటీలో తమ భాగాన్ని రాబట్టుకునేందుకు ఈ తరగతి పాత సామాజిక సంబంధాలను ఉపయోగించుకుని తమ సామాజిక తరగతిలోని పేదలను కూడా తమ ప్రయోజనాలకు అండగా సమీకరిస్తున్నది. తమ కులం, మతం నుండే వచ్చారు కాబట్టి ఈ మధ్యతరగతి ప్రభావానికి పేదలు లోనవుతున్నారు. అంతకు ముందు వరకు వామపక్షాల వెనకున్న పేదలు కూడా ఈ ప్రభావంతో చెదిరిపోతున్నారు.

పీడిత వర్గాలు అత్యధికంగా వుండే కులాల నుండి (ఉదా: దళితుల, గిరిజనులు, వృత్తికులాలు) ధనవంతులుగా అభివృద్ధి అయిన కొద్ది మందిని ముందుబెట్టి మొత్తం తరగతిని తమవెనక సమీకరించుకునే శక్తి బూర్జువా పార్టీలకు లేకుండా పోవాలంటే ఆ తరగతుల నుండి స్వతంత్రమైన నాయకత్వాన్ని క్షేత్రస్థాయి నుండి అభివృద్ధి చేయడం ఒక్కటే మార్గం. మనం కులతత్వాన్ని వినియోగించుకోకపోయినా బూర్జువా పార్టీలు కులతత్వాన్ని వినియోగించుకోగల్గే శక్తిని బలహీనం చేయగలం.

### నిర్మాణ ఏర్పాట్లు

వామపక్షాలకు అటువంటి సహజసిద్ధమైన యంత్రాంగం, వ్యవస్థలు ఉండవు. బుద్ధిపూర్వకంగా అభివృద్ధి చేసుకుంటేనే బూర్జువా పార్టీలకు ధీటైన నిర్మాణ వ్యవస్థలు ఏర్పడతాయి. వున్న కార్యకర్తలే శక్తికి మించి కృషి చేయడం ద్వారా ఓటర్లను కలుసుకుంటున్నారు. ప్రచారం చేస్తున్నారు. హంగూ ఆర్భాటం వున్న బూర్జువా పార్టీలకు తీసిపోకుండా ప్రచారం చేశారని అన్పించుకోగల్గుతున్నారు. కాని ఎన్నికల రోజున ఎక్కడి వారక్కడ వుండాల్సి వచ్చేసరికి మన బలహీనత బయటపడుతున్నది. అన్ని చోట్ల ఒకే సారి పోలింగ్ జరుగుతున్నందున, ఒక చోట నుండి మరో చోటుకి పోవడం అసాధ్యమయినందున స్థానికంగా ప్రజల్లో వున్న చోటనే పార్టీ ఉనికిని ప్రజలకు చూపగల్గుతున్నాం.

బూర్జువా పార్టీలకు రెడీమేడ్ ఎన్నికల యంత్రాంగం దొరుకుతుంది. స్థానిక సంపన్న వర్గాలు అండగా నిలుస్తాయి. పాతకాలపు నిర్మాణ రూపాలు (కుల, మత, కుటుంబపెద్దలు, కుల మత సంఘాలు) రకరకాల ఆధునిక ప్రజా సంఘాలు, వేదికలు అందుబాటులో ఉంటాయి. వీటిని సమీకరించుకోవడానికి డబ్బు, కుల మత తదితర సెంటిమెంట్లు ఉపయోగపడతాయి.

ఇటువంటి స్థితిలో బూర్జువా పార్టీల యంత్రాంగాన్ని ఎదుర్కోవడం సాధ్యంకాదు. స్థానికంగా ప్రజలలో వుండే వారు మన పక్షాన లేకపోతే ప్రత్యర్థులు చేసే ప్రచారాలను తిప్పి కొట్టడంగానీ, ప్రలోభాలను ఎదిరించడంగానీ, మన ప్రత్యేకతను చెప్పడంగానీ సాధ్యంకాదు.

వికేంద్రీకరణ, క్షేత్రస్థాయికృషి, బృందాలు, తరగతులు సంఘాలతో సంభాషణలూ, చర్చలూ, అందుకవసరమైన సాంకేతిక, ప్రచార సామాగ్రి వినియోగం తప్ప వేరే దగ్గరితోవలేదు. ఇటువంటి కృషి చేయాలంటే క్షేత్రస్థాయిలో విస్తృతమైన ఆయా తరగతులలో మమేకమైన నిర్మాణ నెట్ వర్క్ అవసరం.

### ప్రజాస్వామ్యం కోసం పోరాటం

బూర్జువా ఎన్నికల పట్ల అనుసరించాల్సిన ఎత్తుగడల విషయంలో స్థూలంగా మూడు రకాల అభిప్రాయాలున్నాయి.

మొదటిది, బూర్జువా వ్యవస్థలో ఎన్నికల ద్వారా కార్మిక వర్గరాజ్యాధికారాన్ని పొందడం సాధ్యకాదు కాబట్టీ ఎన్నికలను బహింష్కరించటమే దాన్ని అధిగమించడానికి మార్గమన్న అతివాద వాదన ఉన్నది. ప్రజలందరూ బూర్జువా ఎన్నికల్లో పాల్గొంటున్నంతకాలం ఎన్నికల బహిష్కరణ వాదం బూర్జువా వ్యవస్థమీద పోరాటానికి ఉపయోగపడదు.

రెండవది, బూర్జువా పార్టీలతో సర్దుబాటు చేసుకోవడం ద్వారా వామపక్షాలకు ఎదురవుతున్న ఆటంకాలను సులభంగా అధిగమించ

> **"బూర్జువా పార్టీలకు రెడీమేడ్ ఎన్నికల యంత్రాంగం దొరుకుతుంది. స్థానిక సంపన్నవర్గాలు అండగా నిలుస్తాయి. పాతకాలపు నిర్మాణ రూపాలు (కుల, మత, కుటుంబపెద్దలు, కుల మత సంఘాలు) రకరకాల ఆధునిక ప్రజా సంఘాలు, వేదికలు అందుబాటులో ఉంటాయి. వీటిని సమీకరించుకోవడానికి డబ్బు, కుల మత తదితర సెంటిమెంట్లు తోడ్పడతాయి."**

వచన్న భావన కూడా ఉన్నది. తాత్కాలికంగా ఈ సర్దుబాట్ల వలన ప్రయోజనం జరిగినా దీర్ఘకాలంలో వామపక్షాల ప్రజా పునాదికే ఎసరు వస్తున్నది. అది ఒక విషవలయంగా మారుతున్నది.

మూడవది, ప్రజల చైతన్య స్థాయిని బట్టి బూర్జువా ప్రజాస్వామిక వ్యవస్థల్లో నిర్ణయించుకుంటూ బూర్జువా ప్రజాస్వామ్య పరిమితులకు వ్యతిరేకంగా పోరాడుతూ అంతిమంగా దానిని అధిగమించి సోషలిస్టు ప్రజాస్వామ్యానికి చేరుకొనేందుకు కమ్యూనిస్టులు నిరంతరం పోరాటం చేయాల్సి ఉంటుంది.

ఎన్నికల రంగంలో వామపక్షాల పాత్ర కుదింపును అరికట్టాలన్నా, ప్రత్యామ్నాయ శక్తులను కూడాగట్టాలన్నా ఎన్నికల సంస్కరణల కోసం పోరాటం కూడా జరగాలి.

బూర్జువా పార్లమెంటరీ రాజకీయాల దోపిడీ వర్గ స్వభావం గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన పనిలేదు. జవహర్‌లాల్ నెహ్రూ తన స్వీయ చరిత్రలో రాజకీయాలగురించి ఇలా చెప్పారు : "Politics is a gentle art of getting votes from the poor and funds from the rich, promising both to protect each from the other." రాజ్యాన్ని వర్గాలకు అతీతమైందిగా నెహ్రూ చెప్పిన విషయం వాస్తవం కాకపోయినా అనాడు అటువంటి భ్రమ విస్తృతంగా ఉండేది. కార్పొరేట్ శక్తుల ప్రత్యక్ష పాత్ర కనిపించేది కాదు. 1990 దశకానికి ముందు వామపక్షాలు పార్లమెంటరీ రంగంలో జోక్యం చేసుకోగల్గే అవకాశాలు కొంత మేరకు మెరుగ్గా ఉండేవి. ఆ తరువాత కార్పోరేట్ శక్తులు రాజకీయాలలో నగ్నంగా ప్రవేశించిన తర్వాత ఆ అవకాశాలు సన్నగిల్లాయి.

ఇటువంటి స్థితిలో బూర్జువా ప్రజాస్వామ్యంలో కూడా ఉన్న ప్రజాస్వామిక అంశం కుదించుకుపోతుంటే సర్దుకుపోవడం కమ్యూనిస్టులు చేయకూడనిపని. ఎన్నికల రంగంలో వచ్చిన ప్రతికూల మార్పులకు వ్యతిరేకంగా పోరాడటమనేది నిరంతరం కమ్యూనిస్టుల కర్తవ్యంగా ఉండాలి.

ఎన్నికల అక్రమాలను అరికట్టేందుకు అనేక పరిష్కారాలు సూచించబడుతున్నాయి. అందులో కొన్ని :

1) ప్రభుత్వమే ఎన్నికల ఖర్చులను పెట్టుకోవడం.

2) అభ్యర్థుల, ఎన్నికల ఖర్చుపై పరిమితి విధించడం.

3) రాజకీయ పార్టీల ఎన్నికల ఖర్చులపై పరిమితి విధించడం.

4) కార్పొరేట్ సంస్థల ఎన్నికల విరాళాలను నిషేధించడం.

4) నల్లడబ్బును అరికట్టడం.

5) ఎన్నికల కోసం ఇచ్చే నిధులను చట్టబద్ధం చేయడం.

6) అభ్యర్థుల ఆస్తులను ప్రకటించడం.

7) ఎన్నికల సందర్భంగా డబ్బు పంపిణీని, మద్యం పంపిణీని అరికట్టడం.

8) గీత ముందు ఎవరు దాటితే వారు గెలిచినట్టుగా ప్రకటించే ప్రస్తుత విధానం స్థానంలో దామాషా పద్ధతి (పూర్తి/పాక్షిక) ఎన్నికల విధానాన్ని ప్రవేశపెట్టడం.

9) ఎన్నికైన ప్రతినిధులను వెనక్కు పిలిపించే (రీకాల్) హక్కును కల్పించడం.

ఎన్నికల సంస్కరణలు అన్ని సమస్యలను పరిష్కరించవు. పాలక వర్గాల పట్టును తొలగిస్తాయని భ్రమ పడకూడదు. ప్రజల పాత్రను క్రియాశీలం చేసేందుకు, వామపక్షాల పాత్ర కుదించబడకుండా అడ్డుకొనేందుకు కొంతమేరకు తోడ్పడతాయి.

ఎన్నికల సంస్కరణల కోసం పార్టీ చేస్తున్న సూచనలు ఇటువంటి పోరాటానికి ప్రాతిపదికగా ఉంటాయి. వామపక్షాలే కాకుండా అనేక ప్రజాస్వామిక తరగతులు కూడా ప్రస్తుత ఎన్నికల వ్యవస్థలో మార్పుల కోసం పని చేస్తున్నారు. అటువంటి వారితో విశాల ఉద్యమాన్ని నిర్మించవచ్చు. దీని ద్వారా పాలకులపై ఒత్తిడి తీసుకురావడం, ప్రజల్లో చైతన్యం తీసుకురావడం చేయకపోతే వామపక్షాలు ఎన్నికల రంగంలో ఇంకా నామమాత్రమైపోతాయి. బూర్జువా పార్టీల అనుయాయులుగా ఎన్నికల్లో పాల్గోవడం మాత్రమే సాధ్యమవుతుంది.

ఎన్నికల వ్యవస్థలో అంతకంతకు పెరుగుతున్న ఆటంకాలను అధిగమించాలంటే ప్రజల ప్రజాస్వామ్య చైతన్యం చాలా పెరగాల్సి ఉంది. ఎన్నికల్లో తప్పుడు పద్ధతులతో రాజీ పడకుండా పోరాటం చేయడం ద్వారా కొన్ని తరగతులనైనా చైతన్యపరిచే అవకాశం ఉంది. అయితే విశాలమైన ప్రజానీకాన్ని పార్లమెంటేతర పోరాటాల ద్వారా మాత్రమే చైతన్యపరచగలం. ఉద్యమాల ద్వారా పెరిగిన చైతన్యాన్ని అనుసరించి ప్రజలు ప్రలోభాలకు గురికాకుండా ఎన్నికల్లో పాల్గొనే అవకాశం పెరుగుతుంది.


బూర్జువా పార్లమెంటరీ ప్రాతినిధ్య సంస్థలు కూడా కింది నుండి పైకి వెళ్లేకొద్దీ ప్రజలకు అందుబాటులో ఉండడం తగ్గుతుంది. క్షేత్రస్థాయిలో ఉండే స్థానిక ప్రాతినిధ్య సంస్థలు కొంత మేరకు ప్రజలకు దగ్గరగా ఉంటాయి. వాటిల్లో ప్రజలయొక్క ప్రత్యక్ష పాత్రను పెంచడం ద్వారా ప్రజల ప్రజాస్వామిక చైతన్యాన్ని పెంచవచ్చు. ఈ సంస్థల్లో కూడా ప్రస్తుతం స్థానిక ధనార్జిత వర్గాల ఆధిపత్యమే కొనసాగుతోంది. దీనికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ప్రజలు చైతన్యం కాగలిగితే పైస్థాయి ప్రాతినిధ్య సంస్థల్లో (శాసనసభ, పార్లమెంట్) పాలకవర్గాల ఆధిపత్య పద్ధతులను ఎదిరించగలిగే శక్తి ప్రజలకు పెరుగుతుంది.

ప్రస్తుత బూర్జువా వ్యవస్థ ఏర్పరచిన ప్రాతినిధ్య సంస్థలే ప్రజాస్వామ్య రూపాలని అనుకోవడం, వాటిల్లో పాల్గొనడం, వాటిల్లో ప్రాతినిధ్యం సంపాదించడమే ప్రజాస్వామిక కృషి అనుకోవడం పొరపాటు. ఈ సంస్థలకు బయట కూడా తమంతట తాము సంఘటితమై, సహకరించుకుని ప్రజాస్వామ్య బద్ధంగా కార్యకలాపాలు నిర్వహించగలిగే సంస్థలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేయాలి. బూర్జువా ప్రజాస్వామిక రూపాలకు పోటీగా పెట్టుబడిదారీ విధానంలోనే సోషలిస్ట్ ప్రజాస్వామ్యానికి బీజరూపాలుగా వీటిని అభివృద్ధి చేయాలి. అప్పుడే బూర్జువా ఎన్నికల వ్యవస్థ యొక్క పరిమితులను అధిగమించాలన్న చైతన్యం ప్రజల్లో కల్పించగలుతాం. అవకాశాలు మెరుగ్గా ఉన్నప్పుడు కూడా బూర్జువా పార్లమెంటరీ వ్యవస్థ కమ్యూనిస్టులకు సర్వస్వం కాదు. దాన్ని అధిగమించి సోషలిస్టు ప్రజాస్వామ్యాన్ని సాధించడమే లక్ష్యం. సోషలిస్ట్ ప్రజాస్వామ్యానికి సామాన్య ప్రజలు ప్రత్యక్షపాత్ర గుండెకాయలాంటిది. బూర్జువా ప్రజాస్వామ్యంలోని ప్రజల భాగస్వామ్య రూపాల విస్తరణ కోసం పోరాటం కమ్యూనిస్టు ఉద్యమానికి ఎంతో ప్రాధాన్యత ఉంది.

ఈ మాసం ప్రత్యేకం

# అనేక ప్రభంజనాలు, ఒక మీడియా సునామీ

పి. సాయినాథ్



రచయిత ప్రముఖ పాత్రికేయులు.

అదొక ప్రభంజనం. ఒకటి కాదు చాలా ప్రభంజనాలు. కేంద్రంలో కాంగ్రెస్ నాయకత్వం లోని యుపిఎ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చిందొక ప్రభంజనం. ఒక్క అయిదేళ్ల కాలం లో ఏ దశాబ్దంలోనూ లేనంతగా ధరలు పెరిగి నందుకు ప్రజల ఆగ్రహంనుండొచ్చిన ప్రభం జనం అది. శీఘ్రంగా పడిపోతున్న జీవన ప్రమాణాలపై ప్రజల నిస్పృహనుండి వచ్చిన ప్రభంజనం. అంత పెద్ద ప్రభంజనం మీద తేలుకుంటూ నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీఎ ప్రభుత్వం పెద్ద విజయంతో అధికారం లోకి వచ్చేసింది.

అయితే, ఈ కాంగ్రెస్–యుపిఎ వ్యతిరేక ప్రభంజనం ప్రతి రాష్ట్రంలోనూ అక్కడ ప్రధాన ప్రతిపక్ష శక్తికి లాభం చేకూర్చి పెట్టింది. హిందీ ప్రాంతంలోనూ, పశ్చిమ భారతంలోనూ ఆ ప్రతిపక్ష శక్తి బిజెపి గనుక అక్కడది లాభపడింది. ఒరిస్సాలో బిజెడీ, పశ్చిమ బెంగాల్‌లో తృణ మూల్ కాంగ్రెస్ లాభపడ్డాయి. తమిళనాడులో అన్నా డిఎంకె లాభపడింది. ఆంధ్ర ప్రదేశ్‌లో టిడిపి, టిఆర్ఎస్‌లు లాభపడ్డాయి. అందువల్ల దేశవ్యాపితంగా ఏదైనా పెద్ద ప్రభంజనం వుందంటే అది కాంగ్రెస్ వ్యతిరేక ప్రభంజనం మాత్రమే. అయితే ఈ ప్రభంజనాలకు దిగువ చాలా విషయం వుంది.

2014 ఎన్నికలు ఇంకా చాలా విషయాలు చెబుతున్నాయి. వాటిలో కొన్ని :

### కాంగ్రెస్ పార్టీ పతనం

కాంగ్రెస్ పార్టీ ఒకదాని వెంట ఒకటిగా వచ్చిన అవినీతి కుంభకోణాలవల్ల, పనికిమాలిన విధానాలవల్ల పతనమైపోయింది. కొత్త ప్రభు త్వం ఈ విధాన చట్రాన్ని మార్చలేదు సరికదా, వాటిని మరింత వుధృతంగా, కొన్ని రంగాల్లో మరింత దుర్మార్గంగా అమలు చేస్తుంది. నయా–వుదారవాద విధాన చట్రం మారదు, కార్పొరేట్ 'కార్ సేవ' మారదు. మతిమాలిన సరళీకరణ వల్ల రాడియా, 2జి, కెజీ, కాల్గేట్, ఇంకా అనే దజన్ల కుంభకోణాలు జరిగాయి. ఇవి యుపిఎ ప్రభుత్వాన్ని పక్షవాతంలోకి నెట్టా యి. దాంతో కోర్టులు జోక్యం చేసుకోవడంతో పరిశ్రమలకు అనుమతులు మందగించాయి. ప్రజా వనరుల లూటీ మందగించడంతో కార్పొరే ంట్ రంగం అప్పటివరకు తాము గొప్ప సరళీకరణవాదులుగా ప్రజలముందుంచిన మన్మోహన్‌సింగ్‌నూ, చిదంబరాన్నీ చెత్తబుట్టలోకి విసిరేశారు. వాళ్ల స్థానంలో మోడీని తెచ్చారు. ఇక చూడండి 'అనుమతులు' చకచకా మంజూ రయిపోతాయి.

పి. చిదంబరంగారికి ఇదంతా కోపం తెప్పించింది. తాను వాళ్లకెంత చేశాడు! "ఈ దేశంలో నిలకడలేని రంగం ఏదైనా వుందంటే అది వ్యాపారమే" అని ఏప్రిల్ 13న ఇంకా ఎన్నికల ప్రక్రియ ముగియకముందే సిఎన్ ఎన్–ఐబిఎన్‌లో పల్లవి ఘోష్‌కు ఇచ్చిన ఇంట ర్వ్యూలో వాపోయాడాయన. చిదంబరం కాంగ్రెస్ వ్యతిరేక ప్రభంజనాన్ని ముందే చూశాడు. అందుకే ఆయన పోటీ చేయలేదు. ఆయన గతంలో గెలిచిన పాత శివగంగ స్థానం లో చిదంబరం కొడుకు కార్తీ పోటీ చేసి నాలుగో స్థానంలోకి వచ్చాడు.

బడా వ్యాపార వర్గాలు డిమాండు చేసి, నడిపించిన విధానాలు అమలు చేయడంలో కాంగ్రెస్–యుపిఎ ముందుండి కృషి చేశాయి. కానీ, ఈ చర్యలు ప్రజాగ్రహానికి గురై వారి నౌక మునిగిపోతుంటే కార్పొరేట్ రంగం, వారి కబంధ హస్తాల్లోని మీడియా ఇంకా వేగంగా నడపనందుకు వారిని నిందించడం ప్రారంభిం చారు.

ఈ ఎన్నికల్లో భారత కార్పొరేట్ రాజ్యం బలపడింది.

అంతర్గతంగా కూడా ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్రల్లో తనగొయ్యి తను తవ్వుకుని అందులో పూడ్చుపెట్టుకోడానికి కాంగ్రెస్ పార్టీ చాలా తీవ్రమైన కృషి చేసింది. ఈ రెండు రాష్ట్రాలే దానికి 2009లో మొత్తం దేశంలో వచ్చిన స్థానాలకన్నా అధిక స్థానాలు సంపాదించి పెట్టాయి. ఈ రెండు రాష్ట్రాల్లో కూడా పార్టీ రుద్దిన ముఖ్య మంత్రులు 'పనికిమాలినవాళ్లు' అన్న పదానికే చెడ్డపేరు తెచ్చారు. ఇతర రాష్ట్రాల్లో కూడా కాంగ్రెస్ ఇలాగే తన కాళ్లు తాను నరుక్కుంది.

### భారత దేశ చరిత్రలోనే అతి పెద్ద ఎన్నికల ఖర్చు

ఈ ఎన్నికల్లో అభ్యర్థులు చేసిన ఎన్నికల ఖర్చు ఒక పెద్ద సముద్రపుటలను మించిపోం యింది. 2009 ఎన్నికల ఖర్చు దీని ముందు దిగదుడుపైపోయింది. పార్టీలు పెట్టే ఖర్చుల మీద చట్టపరమైన పరిమితులు లేవు గనుక అభ్యర్థుల ఖర్చులో చాలా భాగం ఈ పేరుమీదకు పోయింది. టివి ప్రకటనలు, వార్తా పత్రికల్లో ప్రకటనలు, ర్యాలీలు, హెలీకాప్టర్లు, టెలివిజన్ ఈవెంట్లు వగైరాలకు ఎంత ఖర్చయిందన్న విషయమై ఎవరూ లోతైన లెక్కలు తీయలేదు. (ఇదంతా ఓట్లు కొనడానికి చేసిన ఖర్చు కాకుండా). కానీ మొత్తం మీద ఈ ఖర్చులో బిజెపీ అగ్ర భాగాన వుందన్న విషయం మనకు తెలుసు.

ప్రజాస్వామ్య సంస్కరణ సంఘం (ఎడిఆర్) ఇచ్చిన వివరాల ప్రకారం 2014లో "గెలిచిన వారిలో 82 శాతం మంది కోటీశ్వరులు." అదింకా ఇలా చెప్పింది: "కోటి రూపాయలకన్నా తక్కువ ఆస్తి వున్న అభ్యర్థిమీద కోటీశ్వరులు గెలిచే అవకాశాలు" పదిరెట్లు ఎక్కువ? మొత్తం మీద ఇప్పుడు మనకు 442 మంది కోటీశ్వరులున్న పార్లమెంటు లభించింది. అంటే కొత్త లోక్‌సభలో 82 శాతం మంది సభ్యులు కోటి రూపాయలు అంతకన్నా ఎక్కువ ఆస్తి వున్నవాళ్లు. 2009లో 58 శాతం నుండి వీరి సంఖ్య గణనీయంగా పెరిగింది.

> **" 2014లో గెలిచిన ప్రతి లోక్‌సభ సభ్యుని సగటు ఆస్తి రూ. 14.61 కోట్లు అని ఎడిఆర్ చెప్పింది. అంటే 2009 లో గెలిచిన వారికన్నా ఇది 173 శాతం అధికం. 2009లో సగటు ఆస్తి రూ. 5.35 కోట్లు. కానీ జరిగిందేమిటి? సామాన్య మానవుడు ఈ ఎన్నికల పోటీ నుండి బయటకు నెట్టబడ్డాడు. వాళ్లు గెలవడం మాట అటుంచి పోటీ చేయగలరా? "**

2014లో గెలిచిన ప్రతి లోక్‌సభ సభ్యుని సగటు ఆస్తి రూ. 14.61 కోట్లు అని ఎడిఆర్ చెప్పింది. అంటే 2009లో గెలిచిన వారికన్నా ఇది 173 శాతం అధికం. 2009లో సగటు ఆస్తి రూ. 5.35 కోట్లు. కానీ జరిగిందేమిటి? సామాన్య మానవుడు ఈ ఎన్నికల పోటీ నుండి బయటకు నెట్టబడ్డాడు. వాళ్లు గెలవడం మాట అటుంచి పోటీ చేయగలరా?

రెండు దశాబ్దాల నయా-ఉదారవాదం స్వతంత్ర భారతావనిలో అతి నికృష్టమైన అసమానతలు సృష్టించింది. ఫోర్బ్స్ జాబితాలో మనకు 56 మంది డాలరు శతకోటీశ్వరులున్నారు. అదే సమయంలో సుమారు 30 కోట్ల మంది అధికారికంగా రోజుకు అర్ధ డాలరు, అంతకన్నా తక్కువ ఆదాయంతో బతుకీడుస్తున్నారు. ఇటువంటి అసమానతలు ఎన్నికల్లో ధనికులకు మినహా మిగతా వాళ్లకు అవకాశాలను మూసేస్తుంది. అందుకే భారత దేశ ఎన్నికల్లో ఎన్నడూ లేనంత అధికారం నేడు కార్పొరేట్ రంగం వశమైంది.

### ఒక పార్టీ, వ్యక్తికోసం అతి పెద్ద కార్పొరేట్ మీడియా ప్రచారం

ఇంత కొద్ది మందికోసం ఇంత పెద్ద మీడియా ప్రచారం ఎన్నడూ జరగలేదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో అమెరికా-అధ్యక్ష తరహా ప్రచారం జరిగింది. దీనికి అందరూ మూల్యం చెల్లించక తప్పదు. అన్నిటికన్నా మించి బిజెపీ పార్టీ మొత్తం ఒక వ్యక్తికి దాసోహం అయిపోయింది.

ఆవిధంగా నరేంద్ర మోడీ చుట్టూ వ్యక్తి ఆరాధన పెంచడంలో మీడియా ప్రచారం విజయం సాధించింది. అయితే, నేడు మీడియా మానియా పట్టుకున్న ఓటర్లుండబట్టి ఇది సాధ్యమైంది. 20 ఏళ్ల క్రితం అద్వానీ రథయాత్ర గురించిన ప్రచార ప్రవాహంలో మునగని వారు కూడా 2014లో అందులో మునిగి తేలారు.

ఈనాడు మీడియా పూర్తిగా కార్పొరేటీకరించబడింది. అద్వానీ ఎసి రథం ఎక్కినప్పుడు కార్పొరేట్ మీడియా ఇంకా పూర్తిగా 'వికసించ' లేదు. కానీ 2014లో పెద్ద మీడియా సంస్థలు కలిగి ఉన్న కొన్ని ప్రధాన కార్పొరేట్ సంస్థలు 'సెల్స్' ఏర్పాటు చేసి మోడీ ప్రచారాన్ని ముందుకు తీసుకుపోయాయి.

అయిదు ప్రధాన ఛానళ్లలో ప్రధాన వార్తా సమయంలో మూడోవంతు మోడీ ఆక్రమించేశారని న్యూఢిల్లీకి చెందిన సెంటర్ ఫర్ మీడియా స్టడీస్‌లో భాగమైన సిఎంఎస్ మీడియా లాబ్ అధ్యయనంలో తేలింది. అతంతా కూడా మార్చి 1 నుండి ఏప్రిల్ 30 మధ్య. మే 1 నుండి 11 మధ్య 'మోడీ' సమయం 50 శాతం దాటిపోయిందని మీడియా లాబ్‌కు చెందిన ప్రభాకర్ చెప్పారు. ఈ కాలంలో రాహుల్ గాంధీకి ఇచ్చిన సమయం కన్నా ఇది ఆరు రెట్లు ఎక్కువ. కేజ్రీవాల్‌కు ఇచ్చిన సమయం కన్నా 10 రెట్లు ఎక్కువ.

కేజ్రీవాల్‌కు కొంత ప్రతికూల కవరేజీ వచ్చింది. మోడీకి అలాంటిదేమీ లేదు.

మీడియా ఈ ఎన్నికల్లో పాల్గొన్న విధంగా గతంలో ఎన్నడూ పాల్గొనలేదు. వారాల తరబడి దేశంలోని ఏ మారుమూల మోడీ ప్రసంగించినా అనేక ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారం చేశారు.

కార్పొరేట్ మీడియా ఒక వ్యక్తికి పదవిని కట్టబెట్టడం ఇదే మొదటిసారి కాదు. కాకపోతే దాని తీవ్రత ఇంతకు ముందెన్నడూ చూడలేదు. గత రెండు సంవత్సరాలుగా మీడియా శాపనార్థాలకు గురైన మన్మోహన్ సింగ్ ఒకప్పుడు మీడియా ముద్దుబిడ్డ. భారత దేశ తొట్ట తొలి (బహుశా చిట్టచివరి కూడా) ఎన్నికల్లో గెలవని ప్రధాన మంత్రి అయుండి కూడా ఆయన మీడియాకు ముద్దుబిడ్డ అయినాడు. ఆయన రాజకీయవేత్త కాదు 'ఆర్థికవేత్త ప్రధాని' అని అవి కొనియాడాయి. ఓహ్... ఎంత గొప్పదనం. 2009లో యుపిఎ తిరిగి అధికారానికి రావడానికి ఆయనే కారణమని బ్రహ్మరథం పట్టాయి. వామపక్షాల ఆటంకాలు లేవు కాబట్టి ఆయన కార్పొరేట్ బొక్కసాలను రెండు చేతుల్తో వేగంగా నింపేస్తాడన్నాయి. నిన్నటికి నిన్న... 2011 ఆగస్టులో ఎలక్ట్రానిక్ మీడియా అధిపతులు, ఎడిటర్లు పెద్ద సంఖ్యలో ఆయనతో సుదీర్ఘ సమావేశం జరిపారు. ఒక్కరు కూడా ఆయనను ఒక్కటంటే ఒక్క కఠినమైన ప్రశ్న వేయలేదు.

ప్రధానిగా ఇక ఆయన పనికిరాడని కార్పొరేట్ ఛాంపియన్లు అనుకున్నప్పటికే ప్రజలు తమ బాధలు పట్టించుకునే మరో నాయకుడి కోసం చూడ్డం మొదలుపెట్టారు. సిఐఐ, ఫిక్కీ, అసోచెమ్, మోర్గన్ స్టాన్లే వంటి కార్పొరేట్ సంస్థలు కూడా అటువేపే చూడ్డం మొదలెట్టాయి. దీన్నుండి 2014 ఎన్నికల్లో రాజకీయనాయకుడు, ఉపన్యాసకుడు అయిన మోడీ బాగా లాభపడ్డాడు.

అయితే మోడీ-మీడియా జట్టు గురించి ఇంతచిన్న వ్యాసంలో చెప్పుకోవడం సాధ్యం కాదు. దాని గురించి మరింత విపులంగా చర్చిద్దాం.

### ఎన్నికల వినాశకర ఫలితాల వెనుక గణితం

హిందీ ప్రాంతంలోనూ, పశ్చిమ భారత దేశంలోనూ బిజెపికి వచ్చిన అద్భుతమైన సీట్ల టాలీని చూపిస్తూ ప్రధాన స్రవంతి మీడియా మోడీ ప్రభంజనం గురించి చెబుతూ పండగ చేసుకున్నది. రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీశ్‌ఘర్‌లలో కాంగ్రెస్, బిజెపీల మధ్య నేరుగా పోటీ ఉంది. యుపి, బీహార్‌లలో బిజెపికి అనేక అంశాలు కలిసి వచ్చాయి. అందులోనూ మొదటి స్థానం వచ్చిన వాడు గెలిచే పద్ధతి

---

**'మార్క్సిస్టు'కు**

**మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**
'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక,
ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

దానికి బాగా లాభించింది.

దక్షిణాది రాష్ట్రాల్లో ఈ ప్రభంజనం కాస్తా చిరుగాలిగా మారిపోయింది.

కేరళలో బిజెపీకి ఒక్క స్థానం కూడా రాలేదు. తమిళనాడులో దాని అయిదు పార్టీల కూటమికి రెండు స్థానాలు వచ్చాయి. తెలంగాణాలో తెలుగుదేశంతో పొత్తు పెట్టుకుని అది సంపాదించింది ఒక్క స్థానం. అక్కడ బిజెపీనీ, మోడీనీ వ్యతిరేకించిన టిఆర్ఎస్ పెద్ద విజయం సాధించింది. సీమాంధ్రలో అది టిడిపితో పొత్తు పెట్టుకుని రెండు స్థానాలు సంపాదిం చింది. ఇక్కడ టిడిపీకి మోడీ 'ప్రభంజనం' సహకరించిందా? ఈ ఎన్నికలకు ఒక్క నెల ముందు జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపీ గెలుపొందింది. అప్పుడు బిజెపీ-టిడిపీ పొత్తు లేదు, సరికదా రెండూ ఒకదానిపై ఒకటి పోటీ చేసుకున్నాయి.

కర్నాటకలో కూడా బి.ఎస్. ఎద్యూరప్ప తిరిగి పార్టీలోకి వచ్చినతరువాత మాత్రమే బిజెపీ గెలిచింది. (మోడీ ప్రచారం చేసినప్పటికి కూడా) అసెంబ్లీ ఎన్నికల్లో ఎద్యూరప్ప విడిగా పోటీ చేయడంతో అది ఓడిపోయింది.

ఒడిశాలో నవీన్ పట్నాయక్ బిజెడీ 2009 కన్నా తన సంఖ్యను పెంచుకుంది. అక్కడ కాంగ్రెస్‌కు బిజెపీ కన్నా ఎక్కువ శాతం ఓట్లు వచ్చాయి.

కాంగ్రెస్ వ్యతిరేక ఆగ్రహాన్ని తనవైపు తిప్పుకోవడం ద్వారా మోడీ, తన పార్టీ విజయానికి దోహదపడ్డాడు. ఆయన దాన్ని చాలా చాకచక్యంగా చేశాడు. అయితే, అదంతా పార్టీ ఇప్పటికే బలంగా వున్న రాష్ట్రాల్లోనే జరిగింది. ఆయన మధ్యతరగతిలో కొత్త (యువ) ఓటర్లను ఆకర్షించగలిగాడు. మహారాష్ట్రలో అయితే ఇంకా పేద వర్గాల్లో కూడా ఆకర్షించగలిగాడు. ఇతర కాంగ్రెస్-వ్యతిరేక శక్తులు బలంగా వున్న రాష్ట్రాల్లో ఆయన ప్రభావం పరిమితంగా వుంది.

ఎక్కువ ఓట్లు వచ్చినవాడు ఎన్నికయ్యే పద్ధతి ఈ సారి పెద్ద ప్రభావం చూపించింది. అనేక పార్టీలు, కూటములు, అభ్యర్థులు వందలాది సీట్లలో పోటీపడుతున్నప్పుడు, కొన్ని శక్తులు బలమైన ప్రాంతీయ కూటములుగా ఏర్పడినప్పుడు ఈ పద్ధతిలో జరిగిన ఎన్నికలు వినాశనకరమైన ఫలితాలిచ్చాయి.

జాతీయంగా చూస్తే బిజెపీ 31 శాతం ఓట్లతో 282 స్థానాలు గెలుచుకుంది. కాంగ్రెస్ 19.3 శాతం ఓట్లతో 44 స్థానాలు గెలుచుకుంది. సిద్ధార్థ వరదరాజన్ రాసినట్లు ఓట్లలో రెండు పార్టీలకు తేడా 12 శాతం, కానీ సీట్లలో తేడా 500 శాతం.

ఉత్తర ప్రదేశ్‌లో బిఎస్పికి 20 శాతం ఓట్లు వచ్చాయి కానీ ఒక్క సీటూ రాలేదు. ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ 8 శాతం కన్నా తక్కువ ఓట్లు తెచ్చుకుంది కానీ రెండు స్థానాలు సంపాదిం చింది. బిఎస్పి కన్నా 2.6 శాతం అధికంగా ఓట్లు సాధించిన సమాజ్ వాదీ పార్టీ అయిదు స్థానాలు గెలుచుకుంది. ఇక్కడ బిజెపీ 42 శాతం ఓట్లు సంపాదించుకుని 90 శాతం సీట్లు గెలుచుకుంది.

" ఉత్తర ప్రదేశ్‌లో బిఎస్పికి 20 శాతం ఓట్లు వచ్చాయి కానీ ఒక్క సీటూ రాలేదు. ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ 8 శాతం కన్నా తక్కువ ఓట్లు తెచ్చుకుంది కానీ రెండు స్థానాలు సంపాదించింది. బిఎస్పి కన్నా 2.6 శాతం అధికంగా ఓట్లు సాధించిన సమాజ్ వాదీ పార్టీ అయిదు స్థానాలు గెలుచుకుంది. ఇక్కడ బిజెపీ 42 శాతం ఓట్లు సంపాదించుకుని 90 శాతం సీట్లు గెలుచుకుంది. "



సీమాంధ్రలో టిడీపీ-బిజెపీ కూటమికీ వైఎస్ఆర్‌సిపికీ లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన ఓట్ల తేడా కేవలం 2 శాతం మాత్రమే. కానీ కూటమి వైఎస్ఆర్‌సిపి కన్నా రెండు రెట్లు ఎక్కువ సీట్లు గెలుచుకుంది.

తమిళనాడులో డిఎంకె 23.6 శాతం ఓట్లు పొందింది. కానీ దానికి ఒక్క సీటు కూడా రాలేదు. బిజెపీ నాయకత్వంలోని అయిదు పార్టీల కూటమికి 18.6 శాతం ఓట్లు వచ్చాయి. సీట్లు రెండు దక్కాయి. ఇక్కడ అనేక స్థానాల్లో పంచముఖ పోటీలు జరిగాయి. అన్నా డిఎంకె, డిఎంకె, బిజెపీ కూటమి, కాంగ్రెస్, వామపక్షాల మధ్య. చివరికి అన్నా డిఎంకె 44 శాతం ఓట్లతో 39 స్థానాలు ఎగరేసుకు పోయింది.

పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష సంఘటనకు దాదాపు 30 శాతం ఓట్లు వచ్చాయి. కానీ అది గెలిచింది రెండు స్థానాలు మాత్రమే. 10 శాతం ఓట్లతో కాంగ్రెస్ నాలుగు స్థానాలు దక్కించుకుంది. తృణమూల్ కాంగ్రెస్ 40 శాతం ఓట్లతో 80 శాతం స్థానాలను, అంటే 42లో 34 స్థానాలను గెలుచుకుంది.

ఇటువంటి ప్రభంజనాల్లో నిజంగా గాలి వుందంటారా? ఓట్లు వేసిన భారతీయుల్లో 60 మంది బిజెపీనీ దాని మిత్రులనూ ఇష్టపడ లేదు.

ఇప్పుడైనా ఏదో ఒకరకం దామాషా పద్ధతి ఎన్నికలకు సమయం రాలేదంటారా? బహుశా ప్రారంభంగా మూడోవంతు లోక్‌సభ స్థానాలకు దామాషా పద్ధతిలోనూ, మిగిలిన వాటికి ఇప్పటిలాగా ఎక్కువ ఓట్లు వచ్చిన వారు గెలిచే పద్ధతిలోనూ ఎన్నికలు జరపడం మంచిది. అప్పుడు మనం ఫలితాలను బేరీజు వేసుకుని చూడవచ్చు.

**ఇప్పుడిక అంతా భవిష్యత్‌కాలం**

నరేంద్ర మోడీ ప్రజలను...అందులోనూ 2002-1980 మధ్యలో దేశాన్ని కుదిపేసిన తీవ్ర మతఘర్షణల తరువాత అనేక సంవత్సరాలకు ఓటు హక్కు సంపాదించిన యువతను బాగా ఆకర్షించారు. నయా-వుదారవాద వాతావరణంలో ఇతరుల గురించి తెలియకుండా పెరిగిన వర్గాలను ఆకర్షించారు. ఆయన కోట్ల కొద్దీ వుద్యోగాలిస్తారని ఈ యువతరం, వీరితో పాటు పాత తరం వారిలోకూడా కొందరు భావిస్తున్నారు.

మోడీ 'అభివృద్ధి మంత్రాన్ని' మీడియా పదేపదే వల్లె వేస్తున్నది. ఆ పురాతన మతతత్వ సంభాషణల నుండి ఎంత దూరంగా వారు జరిగితే అంత సంతోషం. ఇక గుజరాత్ 'మోడల్'ను విడిచి పెడదాం. అది మరో కథ. మోడీ మతతత్వ, కులతత్వ కుంపట్లు ఇక రాజేయరు. దాన్ని ఆయన అమిత్ షా, గిరిరాజ్ సింగ్, బాబా రామ్‌దేశ్ తదితరులకు ఔట్ సోర్సింగ్‌కు ఇచ్చేశారు. ఆయన అభివృద్ధికి కనెక్ట్ అయ్యారు. వారు వినాశనానికి హామీ ఇస్తున్నారు. వారి ప్రచారం ప్రజల్లో చాలా బలమైన భయం, అభద్రతా భావం కలిగించింది. అది అంత తొందరగా మాసిపోదు.

ఈ మాసం ప్రత్యేకం

# పేదల సంక్షేమంపై దాడికి సిద్ధం

**ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలలో కోత పెట్టడానికి జరుగుతున్న భారీ కసరత్తు అంతా కార్పొరేట్ పెట్టుబడి తన వర్గ సహజ స్వభావ రీత్యా కష్ట జీవుల మీద ఎక్కుపెట్టిన దాడి తప్ప మరొకటికాదు. ఈ ప్రయత్నాలను నిలవరించడానికి చేసే పోరాటం వర్గపోరాటంలో భాగమే.**


రచయిత ప్రసిద్ధ మార్క్సిస్టు ఆర్థికశాస్త్రవేత్త

**ప్రభాత్ పట్నాయక్**

నరేంద్ర మోడి ఎన్నికల ప్రచారానికి ఒక్క మీడియా ప్రచారానికే 5000 కోట్ల రూపాయలు రాజ్జాయింపున ఖర్చు చేసిన కార్పొరేట్ అధిపతులు అప్పుడే తమ పెట్టుబడిని తిరిగి రాబట్టుకునేందుకు తయారయిపోయారు. ఇదేదో వాళ్ళకు ప్రత్యక్షంగా చేసే మేళ్ళను రాబట్టుకోవడానికే పరిమితంగా లేదు ఈసారి. వామపక్ష పార్టీల ఒత్తిడితో యుపిఎ1 ప్రభుత్వం పేదలకూ, బడుగులకూ, దళితులకూ అసరాగా నిలిచిన ఉపాధి హామీవంటి కొద్దిపాటి సంక్షేమ పథకాలను కూడా మోడీ ప్రభుత్వం అటక ఎక్కించాలని కోరుకుంటున్నది. దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న ద్రవ్యోల్బణం దృష్ట్యా ఇప్పటికే అటువంటి సంక్షేమ పథకాల లబ్దిదారుల జీవన ప్రమాణాలు దిగజారిపోయి ఉన్న నేపథ్యంలో ఇలాంటి ప్రయత్నాలు మొదలవడం ఆందోళనకరం

యుపిఎ 2 ప్రభుత్వం మీద ఉన్న 'అవినీతి', 'అసమర్థ పాలన', 'నిర్ణయ రాహిత్యం' వంటి బలమైన ఆరోపణల నేపథ్యాన్ని అడ్డం పెట్టుకుని ఇప్పుడు కొత్తగా 'ప్రజాధనం పందేరం' అన్న కొత్త విమర్శనుక విపరీతంగా ప్రచారంలోకి తీసుకురావడం ద్వారా పేదసాదలకు అందుతున్న సంక్షేమ పథకాలకు ఎసరు పెట్టేందుకు కావల్సిన ఒక మేథోవాతావరణాన్ని సృష్టించేందుకు కార్పొరేట్ శక్తులు ప్రయత్నిస్తున్నాయి. ప్రజా ధనాన్ని 'పందేరం చెయ్యడం' అంటే 'అభివృద్ధి' పేరిట ఏటా కార్పొరేట్ రంగం అందిపుచ్చుకున్న వేలు లక్షల కోట్ల రూపాయల పన్ను రాయితీ కాదనీ, పేదలకు అంద చేస్తున్న సంక్షేమ పథకాల వ్యయం మాత్రమే అనీ వేరుగా చెప్పకూడదు.

ప్రజాధనం 'పందేరం' చేస్నున్నారు అన్న భావన బలంగా మిగిలిన ప్రజానీకంలోకీ చొప్పించడానికి అనేక రకాల వాదనలనూ, ఆర్థిక తర్కాలనూ ముందుకు తెస్తున్నారు. సంక్షేమ పథకాలు బారీ అవితీతిలో కూరుకుపోయాయనేది వీళ్ళు ప్రముఖంగా ముందుకు తెస్తున్న వాదన. బిజెపి అధికార ప్రతినిధులు టివిల్లో ఈ వాదన బలంగా ముందుకు తెస్తున్నారు. ఈ వాదనలో నిజం ఉందని కాసేపు అనుకున్నా అవినీతిని రూపుమాపడానికి ఏకంగా సంక్షేమ పథకాలే ఎత్తివెయ్యడం అనేది పరిష్కారమయితే కాదు. ఇక్కడ మనం గుర్తు చేసుకోవాల్సిన అంశం ఏమిటంటే 'రక్షణ' (డిఫెన్స్) రంగ కాంట్రాక్టులో భారీ అవినీతి చోటు చేసుకుంది అనేది ఈమధ్యనే వెలుగులోకి వచ్చింది. అంత మాత్రాన రక్షణ రంగానికి కేటాయింపులు జరపొద్దని ఇదే బిజెపి నాయకులు డిమాండ్ చెయ్యగరా? ఇలా ఎవరైనా తమని నిలదీసే ప్రమాదం ఉందని గ్రహించిన బిజెపి నాయకులు ఇప్పుడు ఈ సంక్షేమ పథకాల వ్యయం వల్లనే ఆర్థిక సంక్షోభం దాపురించింది అనే కొత్త వాదన ఎత్తుకున్నారు. ఈ వాదన వింటే ఎవరైనా కళ్ళు తేల వెయ్యాల్సిందే. నిన్నా మొన్నటి దాకా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నప్పుడు, మరీ ముఖ్యంగా దక్షిణ ఐరోపా దేశాలు రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలంలో ఎన్నడూ కనీవినీ ఎరుగనంతటి తీవ్ర సంక్షోభంలో చిక్కుకుపోయి ఉన్నప్పుడు ఆ ప్రభావం మన దేశ ఆర్థిక వ్యవస్థ మీద లేకుండా పోవడానికి తాము అనుసరించిన నయా-ఉదారవాద విధానాలే కారణం అని గత ప్రభుత్వం గొప్పలు చెప్పుకొచ్చింది. అవే నయా-ఉదారవాద విధానాల పట్ల బిజెపికి ఎలాంటి అభ్యంతరాలూ, అనుమానాలూ లేవు. పై పెచ్చు ఈ విధానాలు మా నుండి వాళ్ళు కాపీ కొట్టారని వాళ్ళ మీద వీళ్ళు, వీళ్ల మీద వాళ్ళూ ఆరోపణలు గుప్పించుకుంటూ వచ్చారు. హఠాత్తుగా ఇవాళ మన దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడిపోయిందని కొత్తగా చెప్పుకొస్తున్నారు. ఒక వేళ ఆర్థిక సంక్షోభం నెలకొని ఉన్న మాటే నిజమయితే ఆ సంక్షోభం ఇన్నాళ్ళూ తాము ఏ విధానాలను 'బేష్', శభాష్ అంటూ ఆకాశానికి ఎత్తుతూ వచ్చారో ఆ విధానాల వల్లనే దాపురించిందనీ, దేశ ఆర్థిక వ్యవస్థను స్వాతంత్ర్యానంతర కాలంలో మునుపెన్నడూ ఎరుగనంతటి స్థాయిలో బార్లా తెరిచేసినందు వల్లనే ప్రపంచ ఆర్థిక సంక్షోభానికి బలికావాల్సి వచ్చిందినీ వాళ్ళు ఒప్పుకుని తీరాలి.

దాన్నలా ఉంచుదాం. ఇప్పుడు వాళ్ళు ముందుకు తెస్తున్న ఆర్థిక సంక్షోభానికి మూలం ఏమిటీ అని అడిగి చూద్దాం. సమాజంలో పేదసాదలకు ఉపశమనంగా ఉండేందుకు సంక్షేమ పథకాలపై చేస్తున్న ఖర్చే దీనికి

**" పేదలకు ఉపశమనం కలిగించే సంక్షమ పథకాల ఎత్తివేత కోసం సాగుతున్న ప్రచారం కొత్తపుంతలు తొక్కడం ఆందోళన కలిగించే అంశం. జైపూర్ సాహిత్యోత్సవ నిర్వహకుడు, రచయిత విలియం డాల్ రింపుల్ ఈ మధ్య 'న్యూ స్టేట్స్‌మన్' పత్రికకు రాసిన వ్యాసం ఈ ఆందోళనకు మరింత ఊతమిస్తుంది. "**

కారణం అని చెబుతారు తప్ప ఇంతకు పదింతలు, వందింతలుగా పెట్టుబడిదారులకు దోచి పెడుతున్న రాయితీల గురించి గానీ, అసలుకి తాము ఎంచుకున్న పెట్టుబడిదారీ అభివృద్ధి పంథాయే ఇటువంటి సంక్షోభాలకు కారణమనిగానీ పల్లెత్తు మాట చెప్పరు.

ఇదంతా కష్టజీవుల పట్ల వర్గ ద్వేషంతో చేస్తున్న ప్రచారమే తప్ప ఇందులో నిజాయితీ కానీ, మేధావితనం కానీ ఏమీ లేవు. కానీ పేదలకు ఉపశమనం కలిగించే సంక్షమ పథకాల ఎత్తివేత కోసం సాగుతున్న ప్రచారం కొత్తపుంతలు తొక్కడం ఆందోళన కలిగించే అంశం. జైపూర్ సాహిత్యోత్సవ నిర్వహకుడు, రచయిత విలియం డాల్ రింపుల్ ఈ మధ్య 'న్యూ స్టేట్స్‌మన్' పత్రికకు రాసిన వ్యాసం ఈ ఆందోళనకు మరింత ఊతమిస్తుంది. నిజానికి డాల్ రింపుల్ మితవాద కూటమి మనిషి కాదు. ఒకప్పుడు ప్రముఖ వామపక్ష చరిత్ర కారుడు అరవింద్ నారాయణ దాస్ స్మారకోపన్యాసం చేసిన వాడు. అలాగే స్టేట్స్‌మన్ పత్రిక కూడా మితవాద భావజాలానికి ప్రతినిధి. అలాంటి పత్రికకు డాల్ రింపుల్ రాసిన వ్యాసం.. మితిమీరిన సంక్షేమ వ్యయం భారతదేశంలో ఆర్థిక సంక్షోభానికి దారి తీసింది అన్న వాదన ముందుకు తేవడం అందులోనూ నరేంద్ర మోడి గద్దెనెక్కిన నేపథ్యంలో ఈ వ్యాసం రావడం ఖచ్చితంగా ఆందోళన కలిగించే అంశమే. ఏది ఏమైనా నయా-ఉదారవాద విధానాల్లో ఉండే ద్వంద్వత్వానికీ, కపటత్వానికీ కొనసాగింపే ఈ వ్యాసం అని మనం చెప్పుకోవచ్చు.

డాల్ రింపుల్ ఇంకా ఏమన్నాడో చూడండి- 2009లో మళ్ళీ అధికారంలోకి వచ్చాక మన్మోహన్ సింగ్ ఆర్థిక సంస్కరణల క్రమానికి ఫుల్‌స్టాప్ పెట్టేసి గ్రామీణ మేళ్ళకూ, వ్యవసాయ సంక్షేమానికీ పెద్ద పీటవేశాడు. ఇదంతా సదుద్దేశంతో మొదలు పెట్టినా బడ్జెట్ సమతుల్యత దెబ్బతినేంత భారీ పందేరంగా తయారయింది. స్వాతంత్రానంతర భారత చరిత్రలో ఎన్నడూ లేనంత భారీగా మారిపోయింది. కేంద్ర ఆర్థిక మంత్రిగా కెరీర్ మొదలు పెట్టిన సింగ్ తొలినాళ్ళలోనే ఏ సంక్షేమ వ్యయాన్నయితే కోత పెట్టి పదిమంది ప్రశంసలకు ప్రీతి పాత్రుడు అయ్యాడో దానికి ఇవాళ దూరమయ్యారు.

ఒకప్పుడు 9.3 శాతం ఆర్థిక వృద్ధి రేటు నమోదు చేసిన భారతదేశం "సంక్షేమ పథకాల వ్యయం వల్ల" 2010-11 నాటి చివరి త్రైమాసికంలో 5 శాతం వృద్ధిరేటుకి పడిపోయింది. ఇతర ఆర్థిక ప్రమాణాలూ ఆందోళన కలిగించే స్థాయికి దిగజారాయి. గత ఐదేళ్ళలో ప్రభుత్వరుణాలు నాలుగింతలు పెరిగాయి. ఆర్థిక లోటు పెరిగిపోయింది. ద్రవ్యోల్బణం అత్యధిక రేటున నడుస్తోంది. రూపాయి విలువ 20 శాతం పడిపోయింది. 2004-13 మధ్య కాలంలో ఆహార పదార్థాల టోకు సూచిక 157 శాతం పెరిగింది. కూరగాయలు 350శాతం, ఉల్లిపాయలు 521 శాతం పెరిగిపోయాయి. అవినీతి, అసమర్థ యాజమాన్య నిర్వహణ గురించిన ఆరోపణల విషయం సరేసరి.

ముందుగా డాల్ రింపుల్ లేవనెత్తిన 'మోయలేని సంక్షేమ భారం' గురించి మాట్లాడుకుందాం. డాల్ రింపుల్ బ్రిటిష్ జాతీయుడు. వాళ్ల దేశంలో ఏం జరిగిందీ చూద్దాం - ప్రపంచ యుద్ధం వల్ల బ్రిటిష్ ఆర్థిక వ్యవస్థ చితికి పోయిన నేపథ్యంలోనే అక్కడ 'జాతీయ సేవలు' తదితరమైన ఎన్నో సంక్షేమ పథకాలను చేపట్టారు. ఆనాటి బ్రిటిష్ ఆర్థిక వ్యవస్థను చంద్రమండలం మీద గొగ్గులతో సరిపోల్చుతూ ప్రచారం సాగిన రోజుల్లోనే అక్కడి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు చేపట్టింది. కానీ ఆనాడు ఎవరూ దీనిని 'మోయలేని సంక్షేమ భారం' అని ఆక్షేపించ లేదు. మోయగలగడం, లేకపోవడం అనేది వర్గ స్వభావం మిళితమైన ప్రశ్న. పెట్టుబడిదారులు, ధన వంతుల మీద పన్నుల భారం కాస్త పెంచి కార్మికులు, కష్టజీవులకు కొంత ఉపశమనం చేకూర్చే చర్యలు చేట్టడమే ఇందిలి పరమార్థం. భౌతిక వాస్తవ పరిస్థితులను దృష్టిలో పెట్టుకోకుండా సంక్షేమ పథకాల మీద 'అనవసర వ్యయం' 'మోయలేని భారం' అని ముద్ర వెయ్యడం అంటే అది పెట్టుబడిదారీ దోపిడీ వర్గాల తరపున వకల్తా తీసుకుని వాదించడమే.

9.3 శాతం వృద్ధిరేటును మెచ్చుకున్న నోటితోనే సంక్షేమ పథకాలను తెగనాడడం అంతే నాలుక మడత పెట్టడం మినహా మరొకటి కాదు. యుపిఎ ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే 'మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ స్కీమ్' కింద ఖర్చు చేసిన మొత్తం స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో సుమారు 0.3 శాతంగా ఉండింది. అంటే ఏడాదికేడాదికి స్థూల జాతీయోత్పత్తిలో 31వ వంతు ఖర్చు 'మోయలేని భారంగా' ఎలా మారిందో వాళ్ళే లెక్క తేల్చాలి.

సంక్షేమ పథకాలను చాపచుట్టేయ్యమనే సలహాలిచ్చే మేధావులు చేసే ఇంకో వాదన ఏమిటంటే - ద్రవ్యోల్బణం, మాంద్యం నెల కొని ఉన్న నేటి పరిస్థితులలో గ్రామీణ మేళ్ళు, వ్యవసాయ సంక్షేమాల గురించి పాకులాడడం తెలివైన పని కాదు అనేది. మామూలుగా చూస్తే ఈ వాదన సైద్ధాంతికంగా సరైనదే అనిపిస్తుంది. పెచ్చు మీరిన డిమాండు వల్ల ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణం పెరుగుతూవస్తూ ఉంటే వ్యయం అనేది మోయలేని భారమనేది నిజమే కానీ మాంద్యం - ద్రవ్యోల్బణం రెండూ కలగలిసిన పరిస్థితిలో ఈ వాదన పొసగేది కాదు. అంతకు మించి ఇవాళ దేశంలో నెలకొని ఉన్న దద్రవ్యోల్బణం పెచ్చు మీరిన డిమాండు వల్ల ఏర్పడింది కాదు. ఒక్క ఆహార ధాన్యాల లభ్యత విషయం ఉదాహరణగా తీసుకుంటేనే మనకీ వాస్తవం స్పష్టమవుతుంది.

ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గిడ్డంగులలో 8.2 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు నిలువ ఉన్న 2012 జూన్ నాటికి ద్రవ్యోల్బణం వల్ల బహిరంగ మార్కెట్‌లో బియ్యం, గోధుమల ధరలు ఎంతలా మండిపోయాయో మనకందరికీ తెలుసు. ఆహార ధాన్యాల నిల్వలు ఎంత ఎక్కువగా ఉన్నాయో వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్ అధ్యక్షుని మాటల్లోనే మనం తెలుసుకోవచ్చు. 2012-

> **“ఆర్థిక వ్యవస్థలో తగినంత డిమాండు లేకపోవడానికి పారిశ్రామిక రంగం యావత్తూ ఎదుర్కొంటున్న మాంద్యమే కారణం. ఆఖరికి భవిష్యత్తులో అన్నా వ్యాపారం జోరుగా సాగుతుందనే అంచనాతో కార్పొరేట్ రంగం 'కాపిటల్ గూడ్స్' మీద పెట్టే పెట్టుబడులు కూడా ఇవాళ నేల ముఖం చూస్తున్నాయి.”**

13, 2013–14 ఆర్థిక సంవత్సరాల్లో 4.0 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు విదేశాలకు ఎగుమతి అయినట్లు ఆయన ప్రకటించారు. ఒక పక్క ఇంత భారీ ఎత్తున ఆహార ధాన్యాల నిల్వలు ఉండి, అందునా సగం నిల్వలు విదేశాలకు ఎగుమతి చేస్తుండడం – అదీ దేశంలో పోషకాహార లేమి సమస్య సబ్–సహారా ఆఫ్రికా దేశాల స్థాయిలో ఉందనగా, ఆహార సరుకుల ధరలు మండిపోతా ఉండగా– ఇది ఏ రకంగా సమర్థనీయం. అంతకన్నా ఎగుమతులు ఆపి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలందరికీ చౌకగా అందే ఏర్పాటు చేసి, జనాల ఆకలి మంటలు ఆపేందుకూ, పోషకాహారలేమి సమస్యనధిగమించేందుకూ పాటు పడొచ్చుకదా. దీనికి కూడా ఆర్థిక పండితులు ఇంకా సాకు చెప్తారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఆహార ధాన్యాల సరఫరా వల్ల ద్రవ్యలోటు పెరిగిపోతుందనే లాజిక్కు తీస్తారు. కానీ ఆహార ధాన్యాల సేకరణ జరిగేటప్పుడే రైతులకు ధర చెల్లించేసి ఉన్నందున ఇప్పుడా నిల్వ ధాన్యాలను పంపిణీ చెయ్యడం వల్ల ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసే అవకాశమే ఉంటుంది తప్ప అది పెరిగే అవకాశం ఉండదు. వాస్తవానికి ఆహార ధాన్యాల నిల్వలను ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సార్వత్రిక పంపిణీ చెయ్యడం వల్ల ఎలాంటి ద్రవ్యోల్బణం తలెత్తదు, ద్రవ్య లోటు పెరగదు. పాలకుల భయమల్లా ఒక్కటే – ఇలాంటి ప్రజా సంక్షమ చర్యలు చేపట్టడం ద్వారా ఎక్కడ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి కన్నెర్రకు గురికావాల్సి వస్తుందో అనే.

మన దేశంలో ఇవాళ నెలకొని ఉన్న ద్రవ్యోల్బణాకి కారణం డిమాండ్ – సరఫరాల్లో ఉన్న అంతరం కానేకాదు, ఏ సంస్కరణలంటే ప్రజలు మోజు పడుతున్నారనీ, ఏ సంస్కరణలకు పాలకులు పట్టం కడతున్నారనీ, కట్టారనీ డాల్ రింపుల్ భావిస్తున్నాడో ఆ నయా–ఉదారవాద సంస్కరణలే అసలు కారణం. ఈ సంస్కరణలను నెత్తికి ఎత్తుకున్నందునే ప్రభుత్వం ఆహార ధాన్యాలను నిల్వ చెయ్యడానికే మొగ్గు చూపుతోంది కానీ ప్రజల వినియోగానికి పంపిణీ చెయ్యదు. ద్రోవ్యోల్బణానికీ – సంక్షే పథకాల వ్యయానికీ సంబంధం లేక పోయినా ఎవరూ దీని గురించి ప్రభుత్వాన్ని నిలదియ్యరు. బూర్జువా పార్టీలు ప్రజల దృష్టిలో చెడు కాకుండా ఉండడానికి మాట వరసకు ఆహార ధాన్యాల పంపిణీ చెయ్యాలి అని డిమాండు చేస్తాయే తప్ప ప్రజలకు మేలు చేసే దాన్ని సాధించడం కోసం ఉద్యమించవు.

ఇక రూపాయి విలువ తగ్గిపోవడాన్ని కారణంగా చూపించి సంక్షేమ పథకాల వ్యయానికి సున్నా చుట్టాలనే వాదన విషయానికి వద్దాం. చెల్లింపుల ఖాతా లోటు (బ్యాలన్స్ ఆఫ్ పేమెంట్స్) కరెంటు ఖాతా లోటు (వాణిజ్య లోటు) వల్ల రూపాయి విలువ పడిపోతుంది.

రూపాయి విలువ పడిపో కుండా ఉండడానికి విదేశీ పెట్టుబడులను అడ్డం పెట్టుకుంటూ ఉంటుంది ప్రభుత్వం. అయితే ఇంత కాలం అమెరికా బదులు భారత్ వంటి వర్థమాన దేశాలకు వస్తున్న పెట్టుబడులు ఇక మీదట ఆస్థాయిలో వచ్చే అవకాశం లేదు. ఎందుకంటే అమెరికా ఇప్పటిదాకా అనుసరిస్తూ వచ్చిన పరిమాణాత్మక నిబంధనలను సరళతరం చేసు కుంది. ప్రస్తుతానికి బంగారం దిగుమతులు తగ్గి విదేశీ పెట్టుబడులు నికరంగా వస్తున్న తరుణంలో పరిస్థితులు కాస్త మెరుగుపడినట్లే భావించవచ్చు. కానీ ప్రభుత్వం ప్రయత్న పూర్వకంగానే రూపాయి విలువ పడిపోయినట్లు అట్టే పెడుతుంది. తద్వారా ఎగుమతిదారులకు లబ్ది చేకూర్చాలనీ, మన ఎగుమతులు అంతర్జాతీయ మార్కెట్లో చౌకయ్యి మరింత వ్యాపారం చెయ్యవచ్చనీ సర్కారు ఆలోచన. ఈ మొత్తం వ్యవహారంలో రూపాయి విలువ పడిపోవడానికి సంక్షేమ పథకాల కోసం పెట్టు ఖర్చు ఎలా కారణమయ్యిందో చెప్పమనండి. రూపాయి విలువ పడిపోవడం వల్ల కరెంటు ఖాతా లోటు పెరిగింది నిజమే దీనికి కారణం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నెలకొని ఉన్న సంక్షోభం వల్ల మన ఎగుమతులు జోరందుకోకపోవడం, బంగారం దిగుమతులపై నియంత్రణ లేకపోవడం. అంతే తప్ప పేదల సంక్షేమం కోసం పెట్టే ఖర్చు మాత్రం కారణం కాదు. పేదలు ఏమన్నా దిగుమతి సరుకుల మీద ఆధారపడి జీవిస్తున్నారా వాళ్ళని అడిగితెలుసుకోవడానికి?

ఆర్థిక వ్యవస్థలో తగినంత డిమాండు లేకపోవడానికి పారిశ్రామిక రంగం యావత్తూ ఎదుర్కొంటున్న మాంద్యమే కారణం. ఆఖరికి భవిష్యత్తులో అన్నా వ్యాపారం జోరుగా సాగుతుందనే అంచనాతో కార్పొరేట్ రంగం 'కాపిటల్ గూడ్స్' మీద పెట్టే పెట్టుబడులు కూడా ఇవాళ నేల ముఖం చూస్తున్నాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికీ, డిమాండును పెంచడానికీ ప్రభుత్వం ముందు తగిన ప్రత్యామ్నాయాలు ఉన్నా అవేవీ చేపట్టలేని చక్రబంధంలో ఇరుక్కుపోయి ఉంది. అది అనుసరిస్తున్న నయా–ఉదారవాద విధానాలే దాని పీకకు చుట్టుకుంటున్నాయి.

డిమాండును సృష్టించడానికి అయితే ధనవంతుల మీద పన్నులు పెంచాలి. కానీ నయా–ఉదారవాద విధానాల సిద్ధాంత రీత్యా ఇటువంటి చర్యలు పెట్టుబడి విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. కాబట్టి ప్రభుత్వం అలా చెయ్యడానికి వీల్లేదంటారు. పోనీ ద్రవ్యలోటు పెరిగినా ఖాతరు చెయ్య కూడదు అనుకంటే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి కన్నెర్రజేస్తుంది. ద్రవ్య లోటు పెరిగితే విదేశీ అప్పులు, నెలవారీ కిస్తీలు ఎలా చెల్లిస్తావ్ అని గల్లా పట్టుకుంటుంది. అందుకే సర్కారు చేష్టలుడిగి పోయి ఉండాల్సివస్తోంది.

ఏతావాతా మనం అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలలో కోత పెట్టడానికి జరుగుతున్న భారీ కసరత్తు అంతా కార్పొరేట్ పెట్టుబడి తన వర్గ సహజ స్వభావ రీత్యా కష్ట జీవుల మీద ఎక్కు పెట్టిన దాడి తప్ప మరొకటికాదు. ఈ ప్రయత్నాలను నిలవరించడానికి చేసే పోరాటం వర్గపోరాటంలో భాగమే.

**(అనువాదం:సత్యరంజన్)**

గ్రంథ పరిచయం

# కాలం చెల్లిన స్వేచ్ఛా మార్కెట్ ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదం
## ("21వ శతాబ్దంలో పెట్టుబడి" సంచలనం)



పరియకర్త భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు

వి.శ్రీనివాసరావు


"అమెరికా, యూరప్‌లను ధనికస్వామ్యం అనే దెయ్యం పీడిస్తోంది"... '21వ శతాబ్దంలో పెట్టుబడి' అనే పుస్తకంపై బ్లూమ్‌బర్గ్ బిజినెస్ వీక్‌లో సమీక్ష రాస్తూ మెగన్ మెకార్డెల్ చేసిన వ్యాఖ్య ఇది. "సంపన్నుల కాళరాత్రి" అన్న పేరుతో ఈ వ్యాసం ప్రచురించారు. థామస్ పికెటి రాసిన ఈ పుస్తకం నేడు అమెరికా లోనే కాదు ప్రపంచ ఆర్థికవేత్తలందరిలోనూ పెద్ద ఎత్తున చర్చనీయాంశమౌతోంది. పికెటి ఫ్రెంచి ఆర్థికవేత్త. "21వ శతాబ్దంలో పెట్టుబడి" అనే ఈ పుస్తకం 2013లో ఫ్రెంచి భాషలో వెలువడినప్పుడు ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. కానీ 2014 మేలో ఆంగ్లానువాదాన్ని అమెరికన్ హార్వర్డ్ యూనివర్శిటీ వాళ్లు ప్రచురించినపుడు అది సంచలనమయ్యింది. అప్పటికే అమెరికాలో 'వాల్‌స్ట్రీట్ ముట్టడి' ఉద్యమ నినాదాలు దేశవ్యాప్తంగా ప్రభావితం చేసి ఉండటంతో ఈ పుస్తకం ఆ చర్చకు మరింత ఊపు తెచ్చింది. ఒక్కశాతం కార్పొరేట్లు 99 శాతం సామాన్యుల ఆస్తులు, ఆదాయాలను కొల్లగొట్టడం చెల్లదన్న ఉద్యమ నినాదం కష్టాల్లో ఉన్న మధ్యతరగతిని బాగా ఆకర్షించింది. అమెరికాలో పెరుగుతోన్న ఆర్థిక అసమానతలపై ఒబామా సైతం ఆందోళనతో స్పందించక తప్పలేదు. అందువల్లనే ఇటీవల ఏ పుస్తకమూ చూపనంత ప్రభావాన్ని ఇది చూపింది. పెట్టుబడి అనే పేరుతో రాసిన మార్క్స్ ప్రఖ్యాత గ్రంథం ప్రపంచమంతా పరిచయమే. మార్క్స్ దాన్ని కార్మికవర్గ దృక్పథంతో రాశాడు. తద్విరుద్ధంగా పికెటి పెట్టుబడిదారీ విధానాన్ని పరిరక్షించడానికి అదే పేరుతో 'కాపిటల్ ఇన్ ద ట్వంటీ ఫస్ట్ సెంచరీ' పుస్తకాన్ని ప్రచురించాడు. పెరిగిపోతున్న అసమానతలు తత్ఫలితంగా విస్తరిస్తోన్న సామాజిక అశాంతిని చూసి తల్లడిల్లిపోతున్న అభ్యుదయవాదులు, ప్రజాస్వామ్యవాదులు ఈ పుస్తకం పట్ల హర్షం ప్రకటిస్తుండగా సంప్రదాయవాదులు, స్వేచ్ఛా మార్కెట్ మద్దతుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికాలోని ఉదార ప్రజాస్వామికవాదులు (డెమోక్రాట్స్) దీన్ని స్వాగతిస్తుండగా పోగేసుకున్న సంపదను కాజేయడానికి దొంగలు వస్తారేమోనన్నంత భయంతో సంప్రదాయవాదులు (కన్సర్వేటివ్స్) కుంగిపోతున్నారు. గత దశాబ్ధకాలంలో అమెరికాను ఆర్థిక సంక్షోభం పీడిస్తోంది. నిరుద్యోగం పెరిగింది. మొత్తం విద్యావంతుల్లో మూడింట రెండొంతుల మంది కాలేజి డిప్లమా పూర్తి చేసుకుని ఉద్యోగాలు రాక నిరాశలో మునిగి తేలుతున్నారు. దానికి తోడు సాంస్కృతిక పతనం అమెరికా సమాజాన్ని పట్టి పీడిస్తోంది. ఈ పూర్వరంగంలో వచ్చిన ఈ పెట్టుబడి గ్రంథం చర్చనీయాంశమయ్యింది.

1930లలో రెండవ ప్రపంచయుద్ధానికి ముందు మహా సంక్షోభం వెల్లువెత్తిన సంగతి మనకు తెలుసు. నాడు ఆ సంక్షోభాన్ని పరిష్కరించడానికి పెట్టుబడిదారీ విధానాన్ని సంస్కరించాలని కొందరు ఆర్థిక వేత్తలు బయల్దేరగా, మరికొందరు ఆ వ్యవస్థనే తిరస్కరించాలని తిరుగుబాటుకు పూనుకున్నారు. ఆ క్రమంలోనే ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీలు విస్తరించాయి. చైనా సహా అనేక దేశాల్లో విప్లవాలు వెల్లువెత్తాయి. భారత్‌లాంటి వలస దేశాలు విముక్తయ్యాయి. రెండవ ప్రపంచయుద్ధానంతరం తూర్పు యూరప్ విముక్తి అవ్వడంతో సోషలిస్టు కూటమి పెద్ద శక్తిగా అవతరించింది. నాడు కమ్యూనిజం విస్తరించకుండా నిరోధించడానికి పెట్టుబడిదారీ వ్యవస్థను సంక్షోభం నుండి గట్టెక్కించడానికి కీన్స్‌లాంటి సంస్కరణవాదులు ప్రయత్నించారు. డిమాండ్ ఆధారిత సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఉత్పత్తిమాంద్యం నుండి బయటపడాలంటే మార్కెట్‌లో సరుకులు అమ్ముడుపోవాలి. సరుకులు అమ్ముడుపోవాలంటే ప్రజలకు కొనుగోలు శక్తి కావాలి. ప్రజల కొనుగోలు శక్తి పెంచడానికి సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వమే ప్రజల ఆదాయాలు పెంచాలని కీన్స్ ప్రతిపాదించాడు. తర్వాత దీనికే సంక్షేమ ఆర్థిక శాస్త్రం అని పేరు పెట్టారు. కుప్పకూలిన పెట్టుబడిదారీ వ్యవస్థ లేచి నిలదొక్కుకోవడానికి అప్పటికి ఒక ఔషధంలా పనిచేసింది. కెలక్కీ అనే మరో ఆర్థికవేత్త ఇదే కాలంలో 'ఆదాయ ఆధారిత పన్ను విధానం' ప్రతిపాదించాడు. అంటే సంపన్నుల మీద అదనపు పన్నులు వేయడం ద్వారా ఆ డబ్బును ప్రజల సంక్షేమానికి ఉపయోగించవచ్చని తద్వారా ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించవచ్చని ఆయన సూచించాడు. మరో ఆర్థికవేత్త జోన్ రాబిన్‌సన్ సంపూర్ణ ఉద్యోగిత సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఉపాధి ఎక్కువగా కల్పించడం ద్వారా ప్రజల ఆదాయాల మధ్య గండిని తగ్గించి ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించవచ్చని ఆమె ప్రతిపాదించారు. ఈ సిద్ధాంతాలన్నీ ప్రభుత్వ జోక్యం ద్వారా ప్రజల ఆదాయాలను పెంచి తద్వారా మార్కెట్‌లో డిమాండును సృష్టించే మార్గాలను చూపాయి. 1970ల తర్వాత ముందుకొచ్చిన నయా-ఉదారవాద

విధానాలు పై సిద్ధాంతాలను వెనక్కుతోసి సరఫరా ఆధారిత అభివృద్ధిని ముందుకు తెచ్చాయి. పెట్టుబడిని ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలు పెంచవచ్చని తద్వారా సంపద పై నుండి కిందకు ఊటలా దిగుతుందని సిద్ధాంతీ కరించారు. దీన్ని 1990లలో రీగన్ హాయంలో అమెరికాలోనూ, థాచర్ హయాంలో బ్రిటన్ లోనూ వేగంగా అమల్లోకి తెచ్చారు. ఈ విధా నాలే ఆఖరుకు మరో సంక్షోభానికి పునాది వేశాయి. ఈ పూర్వరంగంలోనే పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థను సమీక్షిస్తూ పికెటి పుస్తకం రాశాడు.

థామస్ పికెటి మార్క్సిస్టు కాదు. పైగా మార్క్సిజం ప్రస్తుత పరిస్థితులకు సరిపోదని నమ్మే ఆర్థికవేత్త. సంక్షోభంలో ఉన్న పెట్టుబడి దారీ వ్యవస్థను సంస్కరించాలన్న ఉద్దేశంతోనే ఆయన ఈ అధ్యయనం చేపట్టాడు. ఆయన సేకరించిన యావత్సమాచారం మార్క్స్ ప్రతిపాదించిన వర్గ దోపిడీ సిద్ధాంతాన్ని మరింతగా బలపరుస్తోంది తప్ప బలహీనపర్చడం లేదు. అందుకే పెట్టుబడిదారీ మేథావులు, ఆర్థికవేత్తలు ఈ పుస్తకాన్ని చూసి ఆందోళన పడుతున్నారు. లండన్ నుండి వెలువడే ఫైనాన్షియల్ టైమ్స్ ఎకనమిక్ ఎడిటర్ క్రిస్ గైల్స్ ఈ పుస్తకంలో పేర్కొన్న సమాచారమంతా తప్పులతడకని సవాల్ విసిరాడు. దానికి పికెటే సవివరమైన జవాబునిచ్చాడు. గణాంక దోషాలున్నాయా లేదా అనే దాని కన్నా ఆర్థిక అసమాతలపై ఈ పుస్తకంలో చేసిన నిర్ధారణలు సరైనవేనని హార్వర్డ్ యూనివర్శిటీ ఎకనామిక్స్ ప్రొఫెసర్ కెన్నత్ రోగోఫ్ సమర్థించాడు.

దాదాపు 700 పేజీలున్న ఈ పుస్తకంలో ప్రధానంగా నాలుగు భాగాలున్నాయి. ఒకటి: డేటా ( గణాంక సమాచారం ), రెండు: విశ్లేషణ, మూడు: భవిష్యత్తును గురించిన అంచనాలు, నాలుగు: విధానపరమైన సిఫార్సులు. థామస్ పికెటి ఈ పుస్తకం రాయడానికి దాదాపు 200 సంవత్సరాల గణాంక వివరాలు సేకరించాడు. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి, పెట్టుబడి, లాభం, వేతనాలు వీటి మధ్య అంతఃసంబంధాలను గురించి ఆయన లోతైన సమాచారం సేకరించాడు. ఈ సమాచారం ఆధారంగా ఆయన కొన్ని నిర్ధారణలకు వచ్చాడు. ఈ కాలంలో ఎక్కువభాగం ఆర్థికాభివృద్ధి పెరుగుదల రేటు కన్నా పెట్టుబడి మీద వచ్చే లాభం రేటు అధికంగా ఉందని తేల్చాడు. అలాగే కార్మికులు, ఉద్యోగుల వేతానాలకన్నా పెట్టుబడిపై యజమానులకు వచ్చే ఆదాయం ఎక్కువగా ఉంటున్న దని చూపించాడు. అందువల్ల ప్రజల ఆదాయాలకన్నా సంపన్నుల ఆస్తులు బాగా పెరిగాయని




*"21వ శతాబ్దంలో పెట్టుబడి" గ్రంథంతో రచయిత థామస్ పికెటి*

**పుస్తకం వివరాలు**

***"క్యాపిటల్ ఇన్ ద ట్వంటీ ఫస్ట్ సెంచరీ"***

***రచయిత :*** *థామస్ పికెటి, ప్రొఫెసర్, పారిస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్*

***అనువాదకులు :*** *ఫ్రెంచి టు ఇంగ్లీష్ – ఆర్థర్ గోల్డ్‌హ్యామర్*

***ప్రచురణ:*** *బెల్కనాప్ ప్రెస్ ఆఫ్ హార్వర్డ్ యూనివర్శిటీ ప్రెస్, కేంబ్రిడ్జి, మెస్సాచూట్స్ లండన్.*

***ప్రచరణ కాలం:*** *మే 2014,* ***పేజీలు :*** *655* ***ధర :*** *888 రూపాయలు*

నిర్ధారించాడు. ఫలితంగా ప్రజల ఆస్తులు ఆదాయాల మధ్య వ్యత్యాసాలు తీవ్రంగా పెరిగాయన్నాడు. అమెరికాలో ఒక శాతం కార్పొరేట్ల చేతుల్లో 40 శాతం ఆస్తులు కేంద్రీకరించబడి ఉండటం ఇందుకు నిదర్శనం. ఇది ఇలాగే కొనసాగితే ప్రజాస్వామ్య వ్యవస్థకే ముంపు ముంచుకొస్తుందని ఆయన హెచ్చరించాడు. దీనిని నిలువరించి పెట్టుబడిదారీ వ్యవస్థను సుస్థిరం చేయాలంటే సంపద పన్ను ప్రవేశపెట్టాలని ఆయన ప్రతిపాదించాడు. ఈ ప్రతిపాదననే కార్పొరేట్ వర్గాలు తట్టుకోలేకపోతున్నాయి.

సంపద పన్ను ప్రవేశపెట్టినంత మాత్రాన అసమానతలు తగ్గిపోజాలవని మరోవైపు మార్క్సిస్టు ఆర్థికవేత్తలు చెబుతున్నారు. పికెటి ప్రతిపాదనలపై ప్రముఖ మార్క్సిస్టు ఆర్థికవేత్తలు సానుకూలంగా స్పందిస్తూనే దీనిని తక్షణ నివారణ చర్యగా మాత్రమే భావించారు. ప్రభాత్ పట్నాయక్ మే 4న వెలువడిన పీపుల్స్ డెమోక్రసీలో ఈ పుస్తకంపై విమర్శనాత్మక వ్యాఖ్యానం రాశారు. పికెటి చెప్పినట్లుగా ఆర్థికాభివృద్ధి రేటు కన్నా లాభం రేటు ఎక్కువగా లేనప్పటికీ... రెండూ సమానంగా ఉన్నా సంపదలో అసమానతలు కొనసాగుతూనే ఉంటాయని చెప్పారు. అలాగే నిరుద్యోగం ఉండదనుకున్నా ఆమేరకు ఆదాయ అసమానతలు తగ్గినా కూడా సంపదలో అసమానతలు కొనసాగుతూనే ఉంటాయని ప్రభాత్ పట్నాయక్ అభిప్రాయపడ్డారు. ఆదాయ అసమాతనల కన్నా సంపదలో అసమానతలు

మరింత తీవ్రమైన సమస్యని ఆయన పేర్కొన్నారు. సంపదలో ఈ అసమానతలే ప్రజాస్వామిక వ్యవస్థలకు విఘాతం కల్పిస్తున్నాయన్న వాస్తవాన్ని పికెటి గుర్తించాలని ఆయనకోరారు. తక్షణ ఉపశమనం దృష్ట్యా అయినా సంపద పన్ను ప్రవేశపెట్టాలని పికెటి ప్రతిపాదించడం కార్మికవర్గ చైతన్యం పెరగడానికి దోహద పడు తుందని అభ్యుదయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అనతికాలంలో ఈ పుస్తకం ఇంతగా ప్రాచుర్యంలోకి రావడానికి కారణమైన భౌతిక పరిస్థితిని మనం చూడాల్సి ఉంది. 2008 తర్వాత ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థపై క్రమంగా నీలి మేఘాలు ముసురుకుంటున్నాయి. సోవియట్ పతనానంతరం ఊపందుకున్న నయా–ఉదారవాద సంస్కరణలతో సాధించిన అభివృద్ధిని చూపించి... నేటి తరంలో పెట్టుబడిదారీ వ్యవస్థపై కల్పించిన భ్రమలు క్రమంగా పటాపంచలవుతున్నాయి. స్వేచ్ఛా మార్కెట్ ఆర్థిక విధానాల ద్వారా ముందుకు పోగలమని చెప్పిన మాటలన్నీ ఇప్పుడు దూదిపింజల్లా తేలిపోతున్నాయి. యుపిఎ–1 కాలంలో సాధించిన అభివృద్ధిని, యుపిఎ–2 కాలంలో చూపించలేక పోవడానికి ఇదే కారణం. యుపిఎ–2లో వచ్చిన సంక్షోభాన్ని అధిగమించడానికి మరిన్ని కార్పొరేట్ అనుకూల ఆర్థిక సంస్కరణలు చేపట్టాలని వచ్చిన డిమాండును కాంగ్రెస్ అందుకోలేకపోయింది. అంతకన్నా సమర్థవంతంగా సంస్కరణలను

(మిగతా 34వ పేజీలో)

కార్యకర్తలకోసం

# పాఠం బోధించడంలో మెళకువలు

**విద్య పాత్ర మనిషి జీవితం మీద, సమాజం మీద ఎలా వుంటుందో తెలుసు కనుకనే కమ్యూనిస్టులు విద్యా ప్రక్రియకు ఎనలేని ప్రాధాన్యతనిస్తారు. ప్రతి కమ్యూనిస్టు కార్యకర్తా ఈ విలువైన వారసత్వాన్ని కొనసాగించాలి. ప్రతి కార్యకర్తా సొంత లైబ్రరీ ఇంట్లో ఏర్పరుచుకోవాలి. కమ్యూనిస్టు పార్టీ ఆఫీసులు విజ్ఞాన కేంద్రాలు కావాలి.**

**నిర్మల్ కుమార్**

మనిషి జీవితంలో విజ్ఞానం పాత్ర అతి ముఖ్యమైనది. మనిషి ఆలోచనలు, మాటలు, చేతలు, ప్రవర్తన, దృక్పథం, ఆచరణ మొదలైన వన్నీ అతను పొందిన, పొందుతున్న జ్ఞానం చేత ప్రభావితమవుతాయి. మనిషిని సరైన జ్ఞానం సరైన మార్గంలో నడిపిస్తే, తప్పుడు జ్ఞానం తప్పుడు మార్గంలో నడిపిస్తుంది. మనుషులపై పనిచేస్తున్న భావాలకు వారి ఆచరణకు అవినాభావ సంబంధముంటుంది. అజ్ఞానం కన్నా తప్పుడు జ్ఞానం మరింత ప్రమాదకరమైనది. ఒక విషయాన్ని గురించి ఏమీ తెలియని మెదడు ఆ విషయాన్ని గూర్చి సూటిగా, సులువుగా నేర్చుకుంటుంది. కానీ అప్పటికే మెదడులో తప్పుడు భావాలు లేదా తప్పుడు జ్ఞానం తిష్ట వేసి వుంటే, ఆ మెదడు సరైన భావాలను లేదా సరైన జ్ఞానాన్ని సులువుగా గ్రహించలేదు. పాత భావజాలం కొత్త భావజాలాన్ని అడ్డుకుంటుంది. అప్పటికే ఏర్పడిన జ్ఞానం మెదడునూ, మనిషినీ నిబద్ధీకరిస్తుంది. భావాలమధ్య సంఘర్షణ జరుగుతుంది.

“అన్నీ తెలిసిన వాడికైనా చెప్పొచ్చు, ఏమీ తెలియని వాడికైనా చెప్పొచ్చు కానీ అటూ ఇటుగా తెల్సిన వాడికి చెప్పలేము” అనేది తెలుగులో ఒక సామెత. అటూ ఇటుగా తెల్సిన వాడు అంటే తప్పుడు జ్ఞానాన్ని పొందినవాడు లేదా కొంత తప్పుగా కొంత ఒప్పుగా తెలిసిన వాడని అర్థం. అసత్యం కంటే అర్ధసత్యం మరీ ప్రమాదకరం. ఈ రోజుల్లో ప్రతివారూ తమ భావజాల ప్రచారం కోసం ఏవో కొన్ని వాస్తవాలను ప్రకటిస్తూనే వాటికి కొన్ని అవాస్తవాలను జోడించి తమదైన వ్యాఖ్యానంతో ప్రజలను తమవైపుకు తిప్పుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. సరైన జ్ఞానం (భావజాలం) మనిషి జీవితానికీ, సామాజిక అభ్యుదయానికీ ఎంతైనా అవసరం. మనిషికి శాస్త్రీయ దృక్పథం వంటబట్టనంత కాలం అతని జీవితం లోపభూయిష్టంగానే వుంటుంది.

మనం నేడు వర్గ సమాజంలో, దోపిడీ వ్యవస్థలో జీవిస్తున్నాం. సామ్రాజ్యవాదులు, బహుళజాతి కంపెనీలు, పెట్టుబడిదార్లు, భూస్వాములు వంటి ధనికవర్గాలు కార్మికులు, శ్రామికులు, కూలీలు, రైతులు వంటి పేదవర్గాలనూ, మధ్య తరగతి వర్గాలనూ ఆర్థికంగా దోచుకుంటూ లాభపడుతున్నాయి. ఈ దోపిడీ వర్గాలు సహజసిద్ధమైన ప్రకృతి వనరులపైనా, శ్రమశక్తిపైనా ఆధిపత్యం చెలాయిస్తూ సమాజం మొత్తాన్ని తమ గుప్పెట్లో వుంచుకుంటున్నాయి. ఆర్థిక అంతరాలు, అవినీతి, పేదరికం, పర్యావరణ సమస్యలు, సామాజిక-నైతిక విలువల పతనం వంటి సమస్యలన్నీ ఈ ఆర్థిక దోపిడీ కారణంగానే ఉత్పన్నమౌతున్నాయి. ఈ వ్యవస్థలో లాభం పొందుతున్న దోపిడీ వర్గాలు ఈ వ్యవస్థను ఇలాగే కొనసాగించడానికి అన్ని విధాలుగానూ ప్రయత్నిస్తున్నాయి. చట్టాలు, న్యాయ వ్యవస్థ, మతం, రాజకీయాలు, విద్య, సంస్కృతి, మీడియా వంటి అన్ని సాధనాలనూ తమ ప్రయోజనాల పరిరక్షణ కొరకే ఉపయోగించుకుంటున్నాయి. తమ దోపిడీకి అనుకూలించే భావజాలాన్ని ఈ వర్గాలు విరివిగా ప్రచారం చేస్తున్నాయి. దోపిడీ, అవినీతి, కపటత్వం, మోసం తదితరాలన్నీ సహజమైన విషయాలనీ, స్వార్థం మానవుని సహజ లక్షణమనీ ఈ దోపిడీ వర్గాలు ప్రచారం చేస్తున్నాయి. “సమాజం గురించి నీకనవసరం... నీ లాభమేంటో నువ్వు చూసుకో” లాంటి బోధలు నేడు సమాజంలో మనకు అడుగడుగునా ఎదురౌతున్నాయి. “పోటీ అభివృద్ధికి సూత్రం, సహకారం, సమిష్టితత్వాలు కాలం చెల్లిన ఆలోచనలు”వంటి సూత్రీకరణలు రాజ్యమేలుతున్నాయి.

ప్రజలు ప్రశ్నించకుండా వుండాలంటే వారికి అవినీతిని అలవాటు చేయాలి. ప్రజలను నైతికంగా సాంస్కృతికంగా పతనం చేస్తే వారు ప్రశ్నించలేరనే ఎత్తుగడతో పాలకవర్గాలు పనిచేస్తున్నాయి. కులం, మతం, ప్రాంతీయతత్వం వంటి సంకుచిత ధోరణులన్నీ దోపిడీ పాలకవర్గాలకు ఉపయోగపడే భావాలే! ప్రజలను ఇలా చీల్చి వుంచితే, తమలో తాము ఘర్షణ పడుతూ దోపిడీ గురించి పట్టించుకోరు, వర్గపోరాటాలను మర్చిపోతారు, వున్న వ్యవస్థతో రాజీపడతారనే ఎత్తుగడను దోపిడీ పాలకవర్గాలు విజయవంతంగా అమలు చేస్తున్నాయి.

నేడు మనం లేచింది మొదలు రాత్రి పడుకొనేదాకా పత్రికలు, టీవీలు, సినిమాలు, సాహిత్యం, మతబోధనలు, అధికారులు.. ఇలా

> ❝ ఒక మంచి పాట, బుర్రకథ, నాటకం, నృత్యం... వంటి కళారూపాలు ఎలానైతే ప్రజలను తన్మయుల్ని చేస్తాయో ఉపన్యాసం లేదా పాఠ్యాంశబోధన కూడా విద్యార్థుల్ని మైమరిపించగలదు. కొందరి ఉపన్యాసాలు, క్లాసులు, వినడానికి ఎంతో దూరం నుండి శ్రోతలు వస్తారు. ❞

ప్రతి అంశమూ మీడియాగా పనిచేస్తూ అశాస్త్రీయ భావాలను ప్రజలలో వ్యాప్తి చేస్తున్నాయి. మనుషుల్ని ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన విద్యావ్యవస్థ కూడా దోపిడీ వర్గాలకే ఉపయోగపడుతోంది. విపరీతంగా జరుగుతున్న గ్లోబల్స్ ప్రచారం వల్ల ప్రజల మెదళ్ళన్నీ అశాస్త్రీయ భావజాలంతో నిండిపోతున్నాయి. దోపిడీ పాలకవర్గాల భావాలే ప్రజల సహజ భావాలుగా చలామణీ అవుతున్నాయి. ప్రజల నిత్యజీవితాలలో మానవ సంబంధాలలో, రోజువారీ ఆచరణలో ఈ అశాస్త్రీయ భావాలే ప్రతిఫలిస్తున్నాయి. మొత్తంగా మనిషి జీవితం, సమాజాలు పరాయీకరణకు గురైనాయి. మితిమీరిన తమ వ్యక్తిగత స్వార్థం తప్ప ఏమాత్రం సామాజిక సంక్షేమం పట్టని సినీహీరోలు, క్రీడాకారులు, రాజకీయ నాయకులు యువతీ యువకులకు రోల్‌మోడల్స్‌గా మారిపోయారు. తమ జీవితాల పెరుగుదలకు ఏమాత్రం సహకరించని ఈ ఫాల్స్ గాడ్స్ కోసం విద్యార్థులు, యువతీయువకులు తమ విలువైన జీవితాలను అంకితం చేస్తున్నారు. ఈ విధమైన డీజనరేషన్‌కూ, సాంస్కృతిక కాలుష్యాలకూ దోపిడీ పాలకవర్గాలు వ్యాపింపజేసే భావజాలమే కారణం.

ఈ దోపిడీకీ, ఈ అనైతిక భావజాలానికీ, ఈ పరాయీకరణకూ వ్యతిరేకంగా ఆవిర్భవించిన విజ్ఞానశాస్త్రమే మార్క్సిజం. మానవజాతి సముపార్జించిన సమస్త విజ్ఞానాన్ని మదించిన మార్క్స్, ఏంగెల్స్‌లు సమాజ గతిని సక్రమ మార్గంలోకి మరలించేందుకుగానూ కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఆవిష్కరించారు. వాస్తవికత, ఆదర్శాల కలబోతగా రూపుదిద్దుకున్న మార్క్సిజం గత నూట డెబ్భై సంవత్సరాలుగా ప్రపంచాన్ని ప్రభావితం చేస్తూ వస్తున్నది. ప్రపంచ చరిత్రను మార్క్సిజం ప్రభావితం చేసినంతగా మరే సాంఘిక సిద్ధాంతమూ ప్రభావితం చేయలేదు. తెలుగు సమాజంపైన కూడా మార్క్సిజం విశేషమైన ప్రభావాన్ని చూపించింది. అయితే దురదృష్టవశాత్తూ గత పాతిక సంవత్సరాలుగా మార్క్సిజం ప్రజలకు అందటం తగ్గిపోయింది. కారణాలేమైనా ఇదొక దురదృష్టకర పరిణామం. నేటితరం యువతీ యువకులకు గాంధీ, భగత్ సింగ్ లాంటి స్వాతంత్ర్యోద్యమ నాయకులే తెలియకుండా పోతున్నారు. మార్క్సిజం అందకపోవడంలో ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు. అయితే మార్క్సిజం ఎంతగా సమాజానికి దూరమైతే అంతగా నష్టం. మార్క్సిస్టు భావజాలం, కమ్యూనిస్టుపార్టీల పోరాటాలు లేని ప్రాంతాలలో దోపిడీ, అవినీతి, అసమానతలు, నైతిక విలువల పతనం, కులతత్వం, మతతత్వం... వంటి నికృష్ట ధోరణులు పెరుగుతాయి. మెరుగైన సమాజానికి మార్క్సిజమే దిక్సూచి. అందుచేత మార్క్సిస్టు విజ్ఞానాన్ని ప్రజలకు అందించి వారిని సామాజిక పోరాటాలలోకి మళ్లించాలి. ఇది నేటి సామాజిక అవసరం. దీనికోసం స్టడీ సర్కిల్స్, సెమినార్లు, క్లాసులు విరివిగా నిర్వహించాలి.

ఈ అవసరాన్ని గుర్తించే భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) విస్తృతస్థాయిలో కృషిని ప్రారంభించింది. రాష్ట్రవ్యాపితంగా స్టడీ సర్కిల్స్, క్లాసులు, సెమినార్లను నిరంతరాయంగా నిర్వహించేందుకు పిలుపుచ్చింది. కేవలం రాష్ట్ర-జిల్లా స్థాయిలోనే కాక మండల, గ్రామశాఖల స్థాయి వరకూ ఈ బోధన – అభ్యసన కార్యక్రమానికి సంకల్పించింది. కొన్ని ప్రాంతాలలో గ్రామస్థాయి వరకు స్టడీ సర్కిల్స్ నడుస్తున్నాయి. అయితే ఇంకా ఎక్కువ ప్రాంతాలలో నడవాల్సి వుంది. ఈ మహా యజ్ఞంలో పాఠ్యాంశాలను బోధించగల ఉపాధ్యాయుల కొరత ఒక ప్రధాన సమస్యగా వుంది. మార్క్సిజాన్ని బోధించగల ఉపాధ్యాయులు వేలసంఖ్యలో తయారు కావాల్సి వుంది. ఎంతగా ఉపాధ్యాయులను తయారు చేసుకోగలిగితే అంతగా విస్తృతస్థాయిలో స్టడీసర్కిల్స్‌ను నిర్వహించుకోవచ్చు. ఉపాధ్యాయుల పరంగా క్వాంటిటీ, క్వాలిటీలను పెంచుకోవాలి. అందుకోసం చురుకైన కార్యకర్తలను గుర్తించి శిక్షణా శిబిరాలనూ, వర్క్‌షాపులనూ నిర్వహించుకోవాలి.

కమ్యూనిస్టు పార్టీల కార్యకర్తలు పుస్తకాలూ, పత్రికలూ చదివి తాము కొంత పరిజ్ఞానాన్ని పొందటంతోనే సంతృప్తి చెందకూడదు. తన చుట్టూ వున్న పదిమందికీ ఆ విజ్ఞానాన్ని బోధించగల నైపుణ్యాన్ని సంతరించుకోవాలి. ప్రతి కమ్యూనిస్టూ తాను నేర్చుకుంటూ పది మందికి నేర్పుతూ వుండాలి. సాధారణ సంభాషణల్లోనే కాక, గ్రూపు డిస్కషన్స్, స్టడీ సర్కిల్స్, క్లాసులు, సెమినార్లలో విషయాలను వివరించగలగాలి... బోధించగలగాలి. ఏదో చెప్పాములే అన్నట్లు సంతృప్తిపడకూడదు. విజయవంతంగా బోధించాలి. ఆ సన్నివేశంలోని ప్రతి ఒక్కరూ విషయాన్ని అర్థం చేసుకోగలిగేలా బోధించాలి. పాఠం చెప్పటంలోని మెళకువలను చర్చించటమే ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశ్యం. పాఠం చెప్పటంలోని మంచి చెడ్డలను చర్చిద్దాం...

### 1. పాఠం చెప్పటం ఒక కళ

ఒక మంచి పాట, బుర్రకథ, నాటకం, నృత్యం... వంటి కళారూపాలు ఎలానైతే ప్రజలను తన్మయుల్ని చేస్తాయో ఉపన్యాసం లేదా పాఠ్యాంశబోధన కూడా విద్యార్థుల్ని మైమరిపించగలదు. కొందరి ఉపన్యాసాలు, క్లాసులు, వినడానికి ఎంతో దూరం నుండి శ్రోతలు వస్తారు. పాఠం బోధించే శైలిలోని రమ్యత విద్యార్థుల్ని కట్టిపడేయాలి. పాఠం కర్ణానందకరంగా వుండాలేగానీ, కర్ణ కఠోరంగా వుండకూడదు. నేర్చుకొనే ప్రక్రియ ఆనందకరంగా, హాయిగా వుంటేనే ఫలప్రదమౌతుందని మనోవిజ్ఞాన శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. నీ దగ్గర ఎంత విషయం వుంది.. ఎంత చెప్పావు అన్నది ముఖ్యం కాదు... విద్యార్థులు ఎంత అర్థం చేసుకున్నారు, ఎంత గ్రహించారు అన్నది ముఖ్యం... కళాత్మకతను, కమనీయతను జోడించి చేసే బోధన వలన విద్యార్థులలో అభ్యసనము బాగా జరుగుతుంది. పాఠం ఆసక్తికరంగా వుంటేనే, విద్యార్థులు బోధనా-అభ్యాసన ప్రక్రియలో నిమగ్నమవ్వగల్గుతారు. ఉపాధ్యాయుడు విద్యార్థి ఏకాగ్రతను నిలిపి వుంచగలిగితేనే పాఠం విజయవంతమౌతుంది. పాఠం బోధించే శైలి బోర్ కొట్టిస్తే, అంటే విసుగు తెప్పిస్తే వినేవారు అసహనానికి గురౌతాడు. ఏకాగ్రత నిలవదు. మనసు ఇతర విషయాలవైపుకు మళ్ళిపోతుంది. ఎప్పుడు క్లాసులోంచి బయటపడదామా అని విద్యార్థి ఆలోచిస్తూ వుంటాడు. మసాలాలతో కూడిన సినిమా, టీవీ ప్రోగ్రామ్‌లకు, 20-20 క్రికెట్ ప్రసారాలకు అలవాటుపడిన యువతీ

యువకులు ఒక గంటసేపు కదలకుండా కూర్చొని పాఠం వినే ఓపికను కోల్పోయారు. ఒకవేళ మొహమాటంతో కూర్చున్నా పాఠం ఆకట్టుకోక పోతే సంతృప్తి చెందదు. పాఠ్యాంశ బోధన ఆసక్తిదాయకంగా సాగి సంతృప్తి చెందితే మరో సారి క్లాసుకు హాజరయ్యేందుకు సిద్ధపడతాడు. "సాధారణ ఉపాధ్యాయుడు చెబుతాడు, మంచి ఉపాధ్యాయుడు వివరిస్తాడు, గొప్ప ఉపాధ్యాయుడు ఇన్‌స్పైర్ చేస్తాడు – అంటే ఉత్తేజాన్ని కల్గిస్తాడు". మన కార్యకర్తలు సాధారణ ఉపాధ్యాయులుగానే ప్రారంభమైనప్పటికీ గొప్ప ఉపాధ్యాయులుగా ఎదగాలి.

ప్రతి కళకూ రూపం, సారం ఉన్నట్లే పాఠ్య బోధనకూ వుంటాయి. సారం అంటే కంటెంట్. అంటే బోధించే విషయం. అంటే అది అర్థ శాస్త్రమా, గతి తర్కమా, భారత రాజ్యాంగమా, సోషలిజం మూల సూత్రాలా, కార్ల్‌మార్క్ జీవిత చరిత్రా... ఇలా బోధించే విషయంగా ఏ సబ్జెక్టును తీసుకుంటావో అదే సారం. రూపం అంటే మెథడాలజీ, అంటే బోధించే పద్ధతి. ఉపాధ్యాయుడు ఉపయోగించే భాష, హావభావాలు, సూక్తులు, ఛలోక్తులు, సామెతలు, పిట్ట కథలు... వంటివన్నీ బోధనా పద్ధతికి రమ్యమైన రూపాన్నివ్వాలి. వివరించే పద్ధతి, తీసుకొనే ఉదాహరణలు, బ్లాక్‌బోర్డు వర్క్, చార్టులు, ఫొటోలు వంటివన్నీ పాఠ్యాంశ బోధనకు మంచి రూపాన్నిస్తాయి. రూపం, సారంల సరైన మేళ వింపుతోనే మార్క్సిస్టు భావజాలాన్ని విరివిగా ప్రచారం చేయగల్గుతాము. "టెల్‌మి ఐ ఫర్గెట్, ఎక్స్‌ప్లెయిన్ మి ఐ రిమెంబర్, ఇన్‌వాల్వ్ మి ఐ లెర్న్" అనేది ఇంగ్లీషులో కొటేషన్. విద్యార్థి మనస్తత్వాన్ని ప్రతిబింబించే వ్యాఖ్యానమిది. విద్యార్థి ఇన్‌వాల్వ్ అయితేనే అంటే నిమగ్నమైతేనే నేర్చుకుంటాడు. బోధనా పద్ధతి యొక్క రూపం విద్యార్థి క్లాసులో నిమగ్నమయ్యేటట్లుగా వుండాలి.

ఉపాధ్యాయుడు "తాను బాగా బోధిస్తున్నానా లేదా, విద్యార్థులు ఏకాగ్రతతో వింటున్నారా లేదా" అని విశ్లేషించుకుంటూ బోధన సాగించాలి. విద్యార్థులు ఎలా వింటున్నారు, ఏ మేరకు గ్రహిస్తున్నారు అనేది ఒక్కటి మాత్రమే బోధకునికి గీటురాయిగా కొలబద్ధగా వుండాలి. అవకాశం దొరికింది కదా అని, మైకు చేతిలో వుంది కదా అని, వినేవాళ్ళు దొరికారు కదా అని అదేపనిగా మాట్లాడుతూ పోకూడదు. విద్యార్థులు గ్రహిస్తున్నారా లేదా అని పట్టించుకుంటూ, దానినే కొలమానంగా భావిస్తూ పాఠం చెప్పాలి. పాఠం చెప్పటం ఒక కళైతే ఆత్మవిమర్శ నిరంతర సాధనలే ఈ కళలో నైపుణ్యాన్ని పెంచుతాయి.

> **❝ క్లాసులో బోధించాల్సిన అంశంపై బోధకునికి క్లారిటీ, పట్టూ వుండాలి. అందుచేత బోధించే అంశానికి సంబంధించిన మూల భావనలను (బేసిక్స్), ఇటీవలి పరిణామాలను (కరెంట్ ఎఫైర్స్) లోతుగా అధ్యయనం చేయాలి. నీకు తెల్సిన అంశమే అయినప్పటికీ, గతంలో నీకు బోధించిన అంశమే అయినప్పటికీ క్లాసుకు వెళ్ళేముందు ఖచ్చితంగా కొంత సమయాన్ని కేటాయించి ప్రిపేర్ అవ్వాలి. ❞**

### 2. సరైన ప్రిపరేషన్‌తో పాఠ్యబోధనకు సిద్ధం కావాలి

క్లాసులో బోధించాల్సిన అంశంపై బోధకునికి క్లారిటీ, పట్టూ వుండాలి. అందుచేత బోధించే అంశానికి సంబంధించిన మూల భావనలను (బేసిక్స్), ఇటీవలి పరిణామాలను (కరెంట్ ఎఫైర్స్) లోతుగా అధ్యయనం చేయాలి. నీకు తెల్సిన అంశమే అయినప్పటికీ, గతంలో నీకు బోధించిన అంశమే అయినప్పటికీ క్లాసుకు వెళ్ళేముందు ఖచ్చితంగా కొంత సమయాన్ని కేటాయించి ప్రిపేర్ అవ్వాలి. ప్రిపరేషన్ లేకుండా వెళ్ళి ఏదో ఒకటి చెపుదాములే అనుకోకూడదు. ప్రిపరేషన్ లేకుండా క్లాసు బోధనకు ఉపక్రమించి తాను గందరగోళపడి, క్లాసును గందరగోళ పర్చిన ఉదాహరణలు గతంలో కొన్ని జరిగాయి. ఇది ఒక రకమైన నిర్లక్ష్య స్వభావం. దీనివల్ల కార్యక్రమ ఉద్దేశ గాంభీర్యత పలచబడుతుంది... చులకనౌతుంది. క్లాసు సాగేటప్పుడు విద్యార్థుల నుండి ఎదురయ్యే ప్రశ్నలకు సమాధానాలు చెప్పగలిగేటట్లు వుండాలి. తగినంత ప్రిపరేషన్ వుంటేనే సరైన జవాబులతో విద్యార్థుల్ని సంతృప్తిపర్చి చైతన్యపర్చగల్గుతాము. సమాధానం తెలియని ప్రశ్నలు ఎదురైనప్పుడు నిజాయితీగా తెలియదని చెప్పాలి. పై నాయకుల్నిగానీ, సంబంధిత మేధావుల్నిగానీ సంప్రదించి సమాధానాలు చెబుతామనాలి. అంతేగానీ ఏదో ఒకటిలే అని తప్పుడు సమాధానాలు చెప్పకూడదు. దీనివల్ల కీడు జరుగుతుంది. ఇట్లాంటి బాధ్యతా రాహిత్యం వల్ల తప్పుడు సంకేతాలు వెడతాయి. మనం ఇచ్చిన సమాధానం తప్పయితే, మన బోధనంతా తప్పుడుదే అనే అభిప్రాయం ఏర్పడుతుంది. తెలియని విషయాన్ని తెలియదని నిజాయితీగా ఒప్పుకోవడం వల్ల మన గౌరవానికేమీ భంగం వాటిల్లదు. ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా వుంటూ నేర్చుకుంటూ వుండాలి. సరైన ప్రిపరేషన్ వుంటే ఇలాంటి ఇబ్బందులు అంతగా తలెత్తవు. ప్రిపరేషన్ వున్న బోధనకూ, ప్రిపరేషన్ లేని బోధనకూ చాలా తేడా వుంటుంది. సరైన ప్రిపరేషన్ ఆధారంగా పాఠ్యాంశ బోధనకు ఒక ప్రణాళికను రూపొందించుకుంటే విజయవంతంగా బోధించొచ్చు. బోధించదల్చుకున్న అంశాన్ని క్లాసులో దశలవారీగా ఎలా ప్రజెంట్ చేయాలో ముందుగానే అనుకొని కాగితంపై రచించుకోవాలి. ఈ రచననే పాఠ్య ప్రణాళిక లేదా బోధనా ప్రణాళిక అంటారు.

### 3. పాఠ్యాంశ బోధనా ప్రణాళిక

బోధించదల్చుకున్న అంశాన్ని చిన్న చిన్న విడి అంశాలుగా విభజించుకొని, వాటిని ఒక తార్కిక క్రమంలో అమర్చుకొని, ఆయా అంశా

## 'మార్క్సిస్టు' పై
## మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తు న్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించా ల్సిన అంశాలున్నా, అదనపు సమాచార మున్నా క్లుప్తంగా రాసి పంపండి

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**
'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక
ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ–2

> **❝ తరగతి గదిలో ఉపాధ్యాయుడు ఉపయోగించ వలసిన భాషకు ప్రధానంగా ఐదు లక్షణాలు ఉండాలి. అవి స్పష్టత, క్లుప్తత, రమ్యత, యోగ్యత, సంపూర్ణత. పాఠాన్ని ఎవరిని ఉద్దేశించి బోధిస్తున్నామో, వారికి అర్థమయ్యేలా మన బోధనలో స్పష్టతఉండాలి. క్లుప్తత అంటే అంశాన్ని తక్కువ మాటలలో ప్రకటించాలి. ❞**

లను ఎలా ప్రజెంట్ చేయాలో ముందుగానే అనుకోవడాన్ని లేదా రచించుకోవడాన్ని పాఠ్య ప్రణాళిక రచన అంటారు. పాఠ్యాంశాన్ని చిన్న చిన్న విభాగాలుగా విడగొట్టిన తర్వాత, ఒక్కొక్క చిన్న అంశం చుట్టూ అవసరమైన అనేక విషయా లను నేర్పుగా అల్లాలి. పాఠ్యబోధనకు ఉపయో గపడగల సామెతలు, సూక్తులు, కవితాపంక్తులు, జోకులు, నిత్య జీవిత ఉదాహరణలను ఈ అల్లికలో అమర్చుకోవాలి. పాఠ్యప్రణాళిక, పాఠ్య బోధనకు దిక్సూచిగా ఉపయోగపడగలగాలి. ఇది ఎంత సవివరంగా వుంటే అంత మంచిది. క్లాసు ప్రారంభించే ముందు ఒక్కసారి చూసు కోవడానికి, డౌట్స్ వచ్చినప్పుడు చూసుకోవడానికి, మధ్యలో ఇచ్చే బ్రేక్‌లలో చూసుకోవడానికి ఈ ప్రణాళికను ఉపయోగించుకోవచ్చు. మంచి ఉపాధ్యాయులుగా గుర్తింపు తెచ్చుకున్న వారిని పరిశీలిస్తే వారి దగ్గర టీచింగ్ నోట్స్ ఖచ్చితంగా వుంటుందనే విషయాన్ని గమనించగల్గుతాము. టీచింగ్ నోట్సంటే మరేమీ కాదు పాఠ్య ప్రణాళికే!... పాఠ్య ప్రణాళిక ఎంత పగడ్బందీగా వుంటే క్లాసు అంత రక్తికట్టి విజయవంతం అవుతుంది. పాఠ్య ప్రణాళిక క్రమబద్ధంగా వుండాలి. ఆ క్రమంలో తార్కికత లేదా హేతు బద్ధత వుండాలి. విషయ అల్లికలో కూర్పులో కంటున్యుటీ వుండాలి. విడి అంశాల మధ్య గ్యాప్ రాకూడదు. ఏ ప్రశ్న ఎక్కడ వేయాలి, ఏ చార్టు ఎక్కడ చూపించాలి, ఏ కథ ఎక్కడ చెప్పాలి? ఉదాహరణలు ఎక్కడ చొప్పించాలి... తదితర వివరాలను ముందుగానే ప్రణాళికలో పొందు పర్చుకోవాలి. ప్రణాళిక రచనలో ముఖ్యాంశా లను రెడ్ ఇంక్‌తోను, ఉప అంశాల వివరాలు, అదనపు సమాచారం తదితరాలను బ్లూ/బ్లాక్ ఇంక్‌తోను వ్రాసుకోవాలి. బోధించాల్సిన విషయం, ఇవ్వబడిన సమయాలను దృష్టిలో వుంచుకొని పాఠ్యప్రణాళికను సిద్ధం చేసుకోవాలి. క్లాసు బోధించడంలో ప్రావీణ్యత వచ్చేవరకూ ఎంత ప్రణాళికపై దృష్టిపెడితే అంత మంచిది. భవిష్యత్తులో ఉపయోగించుకొనేందుకు అవసర పడుతుంది. అయితే ఎప్పటికప్పుడు అవసరమైన మార్పులు చేర్పులు చేసుకుంటూ వుండాలి.

**4. లాంగ్వేజ్ అండ్ బాడీ లాంగ్వేజ్**

క్లాసును రక్తి కట్టించే అంశాలలో అతి ప్రధానమైనది ఉపాధ్యాయుడు ఉపయోగించే భాష. ముందు మంచి నాలుక, వెనుక మంచి ప్రణాళిక" వుండాలి. తరగతి గదిలో ఉపాధ్యా యుని భాష స్పష్టంగా, సూటిగా రమ్యంగా వుండాలి. "వాక్కు యందు జగము వర్ధిల్లు తుండు" "స్పీచ్ ఈజ్ ద మిర్రర్ ఆఫ్ సోల్". కొందరు మాట్లాడేటప్పుడు పదాలలోని చివరి అక్షరాలను స్పష్టంగా పలకరు. వాక్యాలలోని చివరి పదాలను మింగేస్తుంటారు. మాట్లాడే పద్ధతి గొణిగినట్లుగా వుంటుంది. పదే పదే అవసరమైన ఊతపదాలు ఉచ్ఛరిస్తూ వుంటారు. దీనివల్ల వినేవారిలో చిరాకూ, అసహనం కలుగు తాయి. ఉపాధ్యాయునికి స్పష్టంగా మాట్లాడగలిగే సామర్థ్యం వుండాలి. సాధన ద్వారా ఈ నైపుణ్యాన్ని సంపాదించాలి.

తరగతి గదిలో ఉపాధ్యాయుడు ఉపయో గించల్సిన భాషకు ప్రధానంగా ఐదు లక్షణాలు ఉండాలి. అవి స్పష్టత, క్లుప్తత, రమ్యత, యోగ్యత, సంపూర్ణత. పాఠాన్ని ఎవరిని ఉద్దేశించి బోధిస్తున్నామో, వారికి అర్థమయ్యేలా మన బోధనలో స్పష్టత ఉండాలి. క్లుప్తత అంటే అంశాన్ని తక్కువ మాటలలో ప్రకటించాలి. అనవసర మయిన సోది ఉండకూడదు. అదే పనిగా మాట్లాడుతూ ఉండకూడదు. గుర్తొచ్చిందల్లా ఏకరువు పెడుతూ ఉండకూడదు. ఎంత అవసరమో అంతే మాట్లాడాలి. ముఖ్యంగా నిర్వచనాలు, సూత్రీకరణలు, ముగింపు తీర్మానాలు వంటి వాటి విషయంలో క్లుప్తత అవసరం. రమ్యత అంటే పాఠం వినసొంపుగా ఉండాలి. స్వరస్థాయి, ఉచ్ఛారణలు బాషకు అందాన్ని తెచ్చిపెడతాయి. స్వరస్థాయిలో హెచ్చు తగ్గులు సందర్భాన్ని బట్టి మార్చుతూ ఉండాలి. ఫ్లూయె న్సీ, ప్రనౌన్సేషన్‌ల పై దృష్టి పెట్టి సాధన చేయాలి. అవసరమైన పదాలు, సామెతలు, సూక్తులు మాత్రమే ఎంచుకోవాలి. మన ఉద్దే శాన్ని నెరవేర్చగల యోగ్యత కలిగిన పదాలనే ఉపయోగించాలి. వేరే అర్థాన్నిచ్చేవి, అవసరాన్ని తీర్చలేనివి, అనవసరమయిన వన్నీ యోగ్యమైనవి కావు. అందుచేత మన భాషలో యోగ్యమైన పదాలు, వాక్యాలు మాత్రమే ఉండాలి. కొందరు అదేపనిగా "మరి, కాబట్టి, అది, అందుచేత...." వంటి ఊత పదాలను వాడేస్తుంటారు. ఈ బలహీనతను సాధన ద్వారా అధిగమించాలి. అలాగే ఉదాహరణలు కొటేషన్స్, పాటలు, కథలు వంటివి కూడా అంశానికి సంబంధించి యోగ్యతను చూసి వాడాలి. భాషకు ఉండాల్సిన అతి ముఖ్య లక్షణం సంపూర్ణత. ఉచ్ఛారణ లోనూ, అర్థంలోనూ ఈ లక్షణం కనిపించాలి. పదాలను, వాక్యాలను సంపూర్ణంగా వ్యక్తమవు తుందా లేదా సరిచూసుకోవాలి. క్లుప్తత ఎంత అవసరమో సంపూర్ణతా అంతే అవసరం.

క్లాసులో మాట్లాడేటప్పుడు పదాలనూ, వాక్యాలనూ విరవకూడదు. ఒక దానితో మరోకటి కలిపేయకూడదు. భాషా వినియోగం పై పట్టు రావాలంటే మంచి మంచి ఉపన్యా సాలు, క్లాసులు వినాలి. జాగ్రత్తగా పరిశీలిస్తూ నేర్చుకోవాలి. ఆడియో, వీడియో రికార్డులు సంపాదించి వాటిని చూస్తూ, వింటూ సాధన చేయాలి. మనం సాధారణంగా గొప్ప, గొప్ప ఉపన్యాసాలను విషయం కొరకే వింటుంటాము. మాట్లాడే తీరును నేర్చుకోవాలనే కోణంలో కూడా ఆయా ఉపన్యాసాలనూ, క్లాసులనూ పరిశీలిస్తూ అధ్యయనం చేయాలి. వారి నుండి నేర్చుకోవాలి. మక్కీకి–మక్కీ అనుకరించకూడదు. కానీ వారి నుండి నేర్చుకుంటూ సొంత శైలిని సాధించి మెరుగుపరుచుకోవాలి. పుస్తకాలను, న్యూస్ పేపర్లను బిగ్గరగా చదవటం ద్వారా టివి ప్రోగ్రాంల్లో న్యూస్ రీడర్లనూ, యాంకర్లనూ పరిశీలిస్తూ అవసరమయిన మెళకువలు నేర్చుకోవాలి. కాసులో పాఠం బోధించిన తర్వాత మన భాషా వినియోగాన్ని విశ్లేషించు కోవాలి. మన పాఠ్యాన్ని రికార్డు చేసుకొని విశ్లేషించుకోవాలి. ఇతరల నుండి సలహాలూ, సూచనలూ ఆహ్వానిస్తూ తమను తాము మెరుగు పరుచుకోవాలి. ఇతరుల విమర్శలను పాజిటివ్‌గా స్వీకరించాలి. ధారాళత, ఉచ్ఛారణలను వృద్ధి చేసుకోవడానికి బాగా చదవాలి.

కొందరు మాట్లాడేటప్పుడు నోరును పూర్తిగా తెరవరు. ఉపాధ్యాయునికి ఆ లక్షణం ఉండ

కూడదు. స్వేచ్ఛగా నోటిని ఉపయోగించాలి. నోరు పరిశుభ్రంగా ఉండటం తప్పనిసరి. మనం సాధారణంగా రాసేటప్పుడు ఫుల్‌స్టాప్, కామా, ఆశ్చర్యార్థకం, ప్రశ్నార్థకం.....తదితరాలను ఉపయోగిస్తాము. ఇవి మాట్లాడేటప్పుడు కూడా అవసరం. రాసేటప్పుడు వాటిని ఏ ఉద్దేశ్యంతో వాడుతారో, అలాగే మాట్లాడేటప్పుడు కూడా అన్వయించాలి.

బాడీ లాంగ్వేజ్ అంటే కూర్చోవడం, నుంచోవడం, ముఖకవళికలు, హావభావాలు, చేతులు ఉపయోగించడం..... తదితర అంశాల మొత్తాన్ని బాడీ లాంగ్వేజ్ అంటారు. మన శరీరం ద్వారా మన వైఖరి వ్యక్తమవుతూ ఉంటుంది. మన వైఖరెప్పుడూ ప్రసన్నంగా, స్నేహపూర్వకంగా, మర్యాదగా ఉండాలి. ఉపాధ్యాయునికి ఓపిక, సహనం అవసరం. విద్యార్థులనుండి రకరకాల ప్రశ్నలొస్తుంటాయి. విసుక్కోకుండా వివరించాలి. చిరునవ్వుతో ఉండాలి. మన శరీర కదలికలు మనలోని ఉత్సాహాన్నీ, చురుకుదనాన్నీ తెలియజేయాలి. మన హావభావాలు, ముఖకవళికలు బోధిస్తున్న అంశానికి సరిపోయే విధంగా ఉండాలి. దళితులపైనా, మహిళలపైనా ఇతర బలహీనులపైనా జరుగుతున్న దాడుల గురించి వివరించేటప్పుడు సీరియస్‌గా లేకపోవడం, నవ్వడం చేయకూడదు. అటువంటివి యాంటీ సెంటిమెంటుగా పనిచేస్తాయి.

### 5) పాఠ్యాంశ బోధన– తరగతి గది సన్నివేశం

మనకు నిర్ధేశించిన అంశాన్ని, నిర్ధేశించిన సమయంలో, నిర్ధేశించిన స్థాయిగల విద్యార్థులకు విజయవంతంగా బోధించుటానికి కొన్ని మెళకువలు పాటించాలి. వంట సరంజామాను సరైన పాళ్ళలో, సరైన సమయంలో కలుపుకుంటూ నిర్ధిష్ట విధానంలో వండితేనే వంటరుచిగా తయారవుతుంది, పాఠ్యాంశ బోధనకు కూడా అంతేనైపుణత్వం అవసరం. మన పాఠాన్ని ఆస్వాదిస్తూ (రసజ్ఞత) విద్యార్థులు నేర్చుకోవాలంటే కొన్ని ఉపాయాలను (ఎత్తుగడలు) పాటించాలి.

**మోటివేషన్ :** క్లాసు ప్రారంభంలో ఆసక్తికరమైన ప్రశ్నల ద్వారా, ఆసక్తికరమైన సమాచారాన్నీ, సంఘటనలనూ ప్రస్తావించటం ద్వారా విద్యార్థులందరినీ ఉపాధ్యాయుడు తన వైపుకు ఆకర్షించుకోవాలి. క్రమంగా ఈ ఆసక్తిని పాఠ్యాంశం వైపుకు మరలించాలి. రకరకాల ఆలోచనలతో నిండిన విద్యార్థుల మనసులను పాఠ్యాంశం పై కేంద్రీకరించేలా మోటివేట్ చేయాలి. ఈ ప్రక్రియద్వారా విద్యార్థుల్లో ఏకాగ్రతను

“ పాఠం మొత్తం ఉపన్యాసంలాగా ఉంటే బోర్ కొట్టొచ్చు. అందుచేత ప్రారంభం నుండి చివరిదాకా సందర్భాన్ని బట్టి ప్రశ్నలడగాలి. పాఠ్యాంశ బోధనలో ప్రశ్నాపద్ధతి అతి ముఖ్యమైనది. దీనినే సోక్రటీస్ మెథడ్ అంటారు. గ్రీకు తత్వవేత్త సోక్రటీస్ ప్రజలను చైతన్యపర్చేందుకు ఈ పద్ధతిని అనుసరించేవాడు. ”

పెంచవచ్చు. ఈ మోటివేషన్ కార్యక్రమంలోనే బోధనా విషయానికి సంబంధించి, విద్యార్థుల పూర్వజ్ఞానాన్నీ, స్థాయినీ పరిశీలించుకోవచ్చు. సబ్జెక్టును ఎక్కడనుండి ప్రారంభించాలో అంచనాకు రావచ్చు. సరైన మోటివేషన్‌తో ప్రారంభమయిన బోధన సరైన ముగింపును ఇవ్వగలుగుతుంది. వెల్ బిగినింగ్ ఈస్ హాఫ్‌డన్.

**సింపుల్ టూ కాంప్లెక్స్ (సులభత్వం నుండి కఠినత్వం వైపుకు) :** తీసుకున్న విషయం ఏదైనా, అ, ఆ ల నుండి ప్రారంభించాలి. మనం బోధించే అంశాలు, పరిభాష ప్రజలకు మరెక్కడా ఎదురుకావు. కొత్తగా, కఠినంగా ఉంటాయి. అందుచేత అత్యంత సులభతరం చేసి బోధించాలి. సులభమైన అంశాలతో ప్రారం భించి క్రమంగా పై స్థాయి అంశాలకు పోవాలి. మొదట్లోనే కఠినమైన అంశాలను ఎత్తుకుంటే విద్యార్థులకు అర్థం కాక ఆసక్తినీ, ఏకాగ్రతనూ కోల్పోతారు. ఉదాహరణకు గతితర్కం బోధించే క్లాసులో వైరుధ్యం గురించి చెప్పాల్సి వచ్చిన ప్పుడు ముందుగానే నిర్వచనంతో ప్రారంభించ కూడదు. స్త్రీకీ, పురుషునికీ తేడా ఏమిటి వంటి సులభమైన ప్రశ్నలతో ప్రారంభించాలి. విద్యార్థులు కొన్ని తేడాలు చెప్పిన తర్వాత మిగిలిన తేడాలు ఉపాధ్యాయుడు చెప్పి వైరుధ్య భావనను ప్రవేశపెట్టాలి. అలాగే ఐక్యత, ఘర్షణ సూత్రాన్ని వివరించటానికి కూడా భార్యా–భర్తల మధ్య ప్రేమానురాగాలను, అభిప్రాయ భేదాలను తడుముతూ క్రమంగా మిత్రవైరుధ్యాలు శత్రువైరుధ్యాలు దాకా నెమ్మదిగా వెళ్ళాలి.

**ప్రశ్న లేదా సంభాషణా పద్ధతి :** పాఠం మొత్తం ఉపన్యాసంలాగా ఉంటే బోర్ కొట్టొచ్చు. అందుచేత ప్రారంభం నుండి చివరిదాకా సందర్భాన్ని బట్టి ప్రశ్నలడగాలి. పాఠ్యాంశ బోధనలో ప్రశ్నాపద్ధతి అతి ముఖ్యమైనది. దీనినే సోక్రటీస్ మెథడ్ అంటారు. గ్రీకు తత్వవేత్త సోక్రటీస్ ప్రజలను చైతన్యపర్చేందుకు ఈ పద్ధతిని అనుసరించేవాడు. సరైన ప్రశ్నలను సరైన సమయంలో, సరైన విద్యార్థులపై ప్రయోగించడం ద్వారా లాభం పొందొచ్చు. నిజానికి బోధనను ప్రారంభించే మోటివేషన్ ప్రక్రియను కూడా ప్రశ్నలతోనే ప్రారంభించుకోవచ్చు. మనమడిగే ప్రశ్న సమాధానం క్లాసు మొత్తాన్ని పాఠ్యాంశంలో నిమగ్నం చేసేదిగా ఉండాలి. విద్యార్థుల స్థాయిని బట్టి ప్రశ్నలడగాలి. నేర్చుకోవడంలో నెమ్మదిగా ఉండే (స్లో లెర్నర్స్) వారిని కఠినమైన ప్రశ్నలడగకూడదు. వారు సమాధానం చెప్పలేకపోతే చిన్న బుచ్చుకుంటారు. సమధానం చెప్పగలిగితే ఆత్మ విశ్వాసాన్ని సంతరించుకుంటారు. ఏ విద్యార్థిని ఏ ప్రశ్న అడగాలో జాగ్రత్తగా ఎంచుకోవాలి. పాఠం ముగియబోయే ముందు అడిగే ప్రశ్నలు ముగింపు వారి నుండి వచ్చేలా అడగాలి. సూత్రీకరణలు, తీర్మానాలు ఉపాధ్యాయుడు బలవంతంగా రుద్దినట్టుగా ఉండకూడదు. మన ప్రశ్నల వల్ల ఆలోచనలు రేకెత్తాలి. ఆ ఆలోచనలు శాస్త్రీయ నిర్ధారణలకు దారి తీయాలి. విద్యార్థుల్లో స్వయం విశ్లేషణా శక్తి మేల్కొనేలా ప్రశ్నలడగాలి. సరైన ప్రశ్న సరైన సమాధానానికి దారి తీయగలదు. ప్రశ్నలు ఎంతగా నిత్య జీవితంతో ముడిపడుంటే అంతగా విద్యార్థుల నిమగ్నత పెరిగి క్లాసు విజయవంతమవుతుంది.

**నిత్య జీవిత అన్వయము :** ప్రజలకు పుస్తక జ్ఞానం లేకున్నా అనుభవ జ్ఞానం పుష్కలంగా ఉంటుంది. పాఠ్యాంశాన్ని వీలు న్నంత వరకూ నిత్య జీవిత అనుభవాల చుట్టూ తిప్పాలి. చారిత్రిక భౌతికవాదం వివరించేట ప్పుడు కుల వివక్షను ప్రస్తావించాలి. భూస్వామ్య వ్యవస్థకూ–కులతత్వానికీ ఉన్న లింక్‌ను వివరించాలి. కులానికీ–వర్గానికీ మధ్య ఉన్న పోలికలనూ, విభేదాలనూ వివరించాలి. ప్రపంచీకరణ –సంస్కృతి బోధించేటప్పుడు ప్రజల అలవాట్లలో వస్తున్న మార్పులు ప్రస్తావించాలి. ప్రపంచీకరణ ప్రభావాలు పాఠం చెప్పేటప్పుడు ఆ ప్రాంతపు

> **"పార్టీ నిర్ణయాల పట్ల ఉపాధ్యాయునికి భేదాభిప్రాయాలుఉండవచ్చు. అయితే వాటిని క్లాసు బోధించేటప్పుడు బహిర్గత పర్చకూడదు. ఏ విషయంలోనైనా పార్టీలైన్‌నే బోధించాలి.ఉపాధ్యాయుని సొంత అభిప్రాయాలను సరైన వేదికలమీద మాత్రమే వ్యక్తం చేయాలి. నీవు ఎంత ప్రతిభావంతునివి అయినా, ఎంతటి ఆలోచనాపరునివి అయినా పార్టీలైన్‌కు భిన్నంగా బోధించకూడదు."**

కొబ్బరి రైతుల సమస్యలు ప్రస్తావించి కోలా కంపెనీల లాభాలదాకా వెళ్ళాలి. రూపాయి ఖరీదు చేసే కూల్‌డ్రింక్‌ను మనం పది రూపాయలకు కొనుక్కోవాల్సిరావడమే ప్రపంచీకరణగా వివరించాలి. ఒకవైపు దేశంలో పదుల సంఖ్యలో పెరుగుతున్న బిలియనీర్లకూ – వేల సంఖ్యలో జరుగుతున్న రైతుల ఆత్మహత్యలకు గల కారణమే ప్రపంచీకరణ అని వివరించాలి.

**సమయము-విషయము :** క్లాసుల్లో జరుగుతున్న ఒక ప్రధానలోపం టైమ్ మేనేజ్‌మెంట్ లేకపోవడం. కొందరు ఉపాధ్యాయులు ఎన్ని ఎక్కువ అంశాలు చెపితే అంత గొప్ప అనుకొంటున్నారు. దీనికోసం ఎక్కువ సమయాన్ని తీసుకొంటున్నారు. అది తప్పుడు ధోరణి. నీవు ఎంత చెప్పావు అన్నది అస్సలు ముఖ్యంకాదు. విద్యార్థులు ఎంత గ్రహించారు అన్నదే గీటురాయి. మనుకు ఇవ్వబడిన సమయాన్ని దృష్టిలో పెట్టుకొని బోధించాలి. అవసరాల రీత్యా రెండు గంటల కోసం ప్రిపేర్ చేసిన పాఠాన్ని ఒక గంటలో చెప్పాల్సి రావచ్చు. అందుకనుగుణంగా ప్రణాళికలో మార్పులు చేసుకోవాలి. సమయం తక్కువగా ఉన్నప్పుడు ఏ విషయాన్ని వదిలేయాలి? ఏవిషయాన్ని వివరించాలో తెలివిగా నిర్ణయించుకోవాలి. క్లాసులో పది విషయాలు బోధించి ఏదీ అర్థం కాకుండా చెయ్యడం కన్న ఐదు విషయాలు తీసుకొని వివరణాత్మకంగా బోధించి విద్యార్థులకు అవగాహన కల్గించాలి. అలాగని క్లాసులో తార్కిక క్రమాన్ని, సంపూర్ణత్వాన్నీ విడిచి పెట్టరాదు. మనమనుకున్న ముగింపుకు క్లాసును తీసుకురావాలి. ప్రయత్నపూర్వకంగా, లక్ష్యాత్మకంగా (సెన్స్ ఆఫ్ పర్పస్) వ్యవహరిస్తే ఈ కోణంలో పట్టు సాధించొచ్చు.

**విద్యార్థుల స్థాయి :** మన క్లాసులో ఒక్కోసారి గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లు ఉండొచ్చు, మరోసారి నిరక్షరాశ్యులు ఉండొచ్చు. కొన్ని సార్లు వారూ, వీరూ ఉండొచ్చు. మన దగ్గర ఎంత విషయం ఉన్నది అన్నది ముఖ్యం కాదు. విషయాన్ని నిరక్షరాశ్యులకు కూడా తగినట్లు మలిచి బోధించాలి. అరటి పండు ఒలిచి పెట్టినట్లు బోధన సాగాలి. యం.ఎస్సీ స్థాయి ఉపాధ్యాయుడు మూడో తరగతి విద్యార్థికి భిన్నాలు బోధించడం లాంటిది సైద్ధాంతిక బోధన. యం.ఎస్సీ స్థాయి ముఖ్యం కాదు, మూడో తరగతి విద్యార్థి స్థాయికి దిగటం, స్థాయికి తగ్గట్టు విషయాన్ని మలచటం ముఖ్యం. నీ ధోరణిలో నీవు అదేపనిగా చెప్పుకుంటూ పోతే విద్యార్థులు నిద్రపోతారు.

**రూపం సారాన్ని మింగేయకూడదు :** పాఠ్యాంశ బోధన ఆహ్లాదకరంగా ఉండటం అవసరం! అందుకోసం పిట్టకథలు, జోకులు, పాటలు వంటి వాటిని బోధనలో చొప్పించొచ్చు. అయితే ఇవి యోగ్యమయినవిగా ఉండాలి. అసలు విషయాన్ని మరుగు పర్చేవిగా ఉండకూడదు. కేవలం పాఠమంతా జోకులు, పిట్టకథలుగా ఉండకూడదు. క్లాసు పూర్తయిన తరువాత విషయమేమీ ఎక్కక ఈ పిట్టకథలు మాత్రమే గుర్తుంటే నష్టం. అందమయిన శైలి అవసరమే! కానీ దానికోసం విలువైన సారాన్ని బలిపెట్టకూడదు. సారం ముందు నడుస్తుంటే రూపం దానిని అనుసరించాలి.

**ముఖ్యమైన అంశాలను నొక్కి చెప్పాలి :** పాఠ్యాంశాన్ని తార్కిక క్రమం తెగకుండా విభజించుకోవాలి. బోధించేటప్పుడు ముఖ్యాంశాలను ఒకటికి రెండుసార్లు నొక్కి వక్కాణించాలి. అంశం చుట్టూ అల్లే అదనపు అంశాలు ముఖ్యాంశానికి బలం చేకూర్చాలి. సాధారణీకరణాలు, నిర్వచనాలు, సూత్రీకరణాలు ఒకటికి రెండు సార్లు చెప్పాలి. విద్యార్థులచే చెప్పించాలి. ఇట్లాంటి ముఖ్యాంశాలను విద్యార్థులచే నోట్సుల్లో రాయించాలి. దీనివల్ల అవి తీర్మానాలుగా మనసుల్లో గుర్తుండిపోతాయి. ఉదాహరణకు రాజకీయ అర్థశాస్త్రం క్లాసులో అదనపు విలువను, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం క్లాసులో కార్పోరేట్ శక్తులకూ, ఎంపీలకూ మధ్య సంబం ధాలను, అస్థిత్వ ఉద్యమాల క్లాసులో ఆ ఉద్యమ నాయకుల అవకాశవాద వైఖరులనూ, భారత రాజ్యంగం క్లాసులో ఆస్తిహక్కు, ఆదేశ సూత్రల పరిమితిని నొక్కి వక్కాణించాలి.

**విద్యార్థులతో సంబంధాలు, తరగతి గది అమరిక :** ఉపాధ్యాయుడు విద్యార్థులతో స్నేహపూర్వకంగా ఉండాలి. పెద్దవారిని గౌరవపూర్వకంగా సంబోధించాలి. విద్యార్థిని పేరుపెట్టి పిలవగలగాలి. ఉపాధ్యాయుడూ, విద్యార్థులూ సౌకర్యవంతంగా కూర్చోవాలి. వేదికపై ఉపాధ్యాయుడొక్కడే ఉండాలి. హోదాలతో సంబంధం లేకుండా నాయకులు, కార్యకర్తలు అందరూ విద్యార్థులు లాగానే భావించుకుంటూ విద్యార్థుల తోపాటు కూర్చోవాలి. ఉపాధ్యాయుడు విద్యార్థులందరికీ కనిపించాలి. అలాగే విద్యార్థులందరూ ఉపాధ్యాయునికి కనిపించాలి. ఉపాధ్యాయుడు విద్యార్థులందరినీ దృష్టిలో పెట్టుకోవాలి. కొందరినే దృష్టిలో పెట్టుకుంటూ, మరికొందరితోనే మాట్లాడుతూ బోధించకూడదు. క్లాసు క్రమశిక్షణాయుతంగా జరగడానికి అవసరమయిన జాగ్రత్తలన్నీ ముందుగానే విద్యార్థులకు చెప్పాలి. ఉపాధ్యాయుడు ప్రశ్నించినప్పుడు తప్ప, డౌట్ అడగటానికి తప్ప ఎవ్వరూ మాట్లాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. క్లాసులో ఎప్పుడూ ఒక్క గొంతుక మాత్రమే వినిపించాలి. ఒకే సమయంలో ఇద్దరు అంతకంటే ఎక్కువ మంది అస్సలు మాట్లాడకూడదు. ఉపాధ్యాయుని అనుమతి లేకుండా మాట్లాడటం, క్లాసు విడిచి బయటికి పోవటం చేయకూడదు. సెల్‌ఫోన్స్ ఖచ్చితంగా సైలెంట్ మోడ్‌లో ఉండాలి. క్రమశిక్షణ విషయంలో అందరూ సమానులే !

**పార్టీ లైన్ అతిక్రమించకూడదు :** పార్టీ నిర్ణయాల పట్ల ఉపాధ్యాయునికి భేదాభిప్రాయాలు ఉండవచ్చు. అయితే వాటిని క్లాసు బోధించేటప్పుడు బహిర్గత పర్చకూడదు. ఏ విషయంలోనైనా పార్టీలైన్ నే బోధించాలి. ఉపాధ్యాయుని సొంత అభిప్రాయాలను సరైన వేదికలమీద మాత్రమే వ్యక్తం చేయాలి. నీవు ఎంత ప్రతిభావంతునివి అయినా, ఎంతటి ఆలోచనాపరునివి అయినా పార్టీలైన్‌కు భిన్నంగా బోధించకూడదు. ఇది పార్టీ క్రమశిక్షణలో అంతర్భాగం. ఉదాహరణకు ఎన్నికల సమయాలలో పార్టీ పొత్తులు వ్యక్తిగతంగా నీకు నచ్చక పోవచ్చు. క్లాసులో ఆవిషయాన్ని విమర్శించకూడదు. కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రం పార్టీకయినా, సైద్ధాంతిక బోధకునికైనా, కార్యకర్తకయినా ప్రాణంగా ఉండాలి.

**విద్యార్థులతో నోట్సు రాయించడం :** క్లాసు వినేటప్పుడు ముఖ్యాంశాలను నోట్సులో రాసు

కోవడం అనేది మంచి అలవాటు. క్లాసులోని ప్రతి కార్యకర్తచేతా నోట్సు రాయించాలి. నిర్వచ నాలు, సూత్రాలు, తీర్మానాలు వంటి ముఖ్యాం శాలను విద్యార్థులచే నోట్సులో రాయించాలి. పాఠం వినేటప్పుడు వచ్చే డౌట్స్‌ను కూడా నోట్సులో రాసుకొని చివరిలో అడగమని చెప్పాలి. ఎప్పుడొచ్చిన సందేహం అప్పుడే అడుగు తూవుంటే కొత్త చర్చ మొదలై, బోధనా క్రమం దారి తప్పుతుంది. నోట్సు రాసే అలవాటును కొందరు నిర్లక్ష్యం చేస్తుంటారు. ప్రతి కమ్యూనిస్టూ నిరంతరం నేర్చుకుంటూ ఎదుగుతూ ఉండాలి. మార్క్సిజాన్ని నేర్చుకోవాలనే కోరిక తీవ్రంగా ఉంటే రాసే అలవాటు కష్టంగా అనిపించదు. కేవలం క్లాసులోనే కాక అధ్యయనం చేసే టప్పుడు కూడా నోట్సు రాసుకోవాలి. నోట్సు రాయడం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది. అంశాలు బాగా గుర్తుంటాయి. ప్రతి కమ్యూనిస్టు కార్యకర్తకూ స్టడీనోట్సు ఉండాలి. చదవటం, రాయటం అనేవి కమ్యూనిస్టు కృషిలో అతిముఖ్యమైన అంశాలు. సైద్ధాంతిక చైతన్యం పెంచడంలో ఈ రెండు అలవాట్లూ ఎనలేని సహాయం చేస్తాయి. కాబట్టి క్లాసు నిర్వాహ కులూ, ఉపాధ్యాయుడూ నోట్సు రాయించే అల వాటు గురించి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. గుర్తు పెట్టుకొండి "రాయని చదువు నిరర్థకము "

> ❝ క్లాసు ఎంత గొప్పగా బోధించినా ముగింపు పేల వంగా ఉంటే అపజయం పొందినట్లే! పద్మవ్యూహం లోకి వెళ్ళడం ఎంత ముఖ్యమో బయటికి రావడం కూడా అంతే ముఖ్యం. క్లాసును ఎలా ముగించాలో కూడా ముందుగా ప్రణాళికలో పొందుపర్చుకోవాలి. ❞

**ముగింపు :** క్లాసు ఎంత గొప్పగా బోధించి నా ముగింపు పేలవంగా ఉంటే అపజయం పొందినట్లే! పద్మవ్యూహంలోకి వెళ్ళడం ఎంత ముఖ్యమో బయటికి రావడం కూడా అంతే ముఖ్యం. క్లాసును ఎలా ముగించాలో కూడా ముందుగా ప్రణాళికలో పొందుపర్చుకోవాలి. ఉపాధ్యా యుడు క్లాసును ముగించిన పద్ధతి వల్ల విద్యార్థులకు ఆత్మ విశ్వాసం కలగాలి. క్లాసు మొత్తం సారాంశాన్ని మరొక్కమారు రేఖామాత్రం గా తడిమి ఒక పాజిటివ్ అప్పీల్ లేదా తీర్మానంతో ముగించాలి. నేర్చుకున్న అంశాలు ఆచరణకు పురికొల్పేలా ముగింపు ఉండాలి. ఈ పాఠం ద్వారా కొంత నేర్చుకున్నామన్న తృప్తి కలగాలి. స్పష్టత ఏర్పడాలి. దండ మొత్తం అల్ల టం ఒక ఎత్తు, రెండు అంచులను కలుపుతూ చివరిముడి వేయడం మరో ఎత్తు, చివరి ముడి సరిగ్గా లేకపోతే గుచ్చిన పూలన్నీ చెల్లా చెదురుగా ఎటువటు పడిపోతాయి. అందుచేత ముగింపు ఉపయోగాత్మకంగా ఉండాలి. ముగింపు ఉత్సాహపర్చేదిగా, ప్రోత్సహించేదిగా ఉండాలి. విద్యార్థులను మరింత అధ్యయనానికి, పోరాటా లలోకి పురికొల్పేదిగా ఉండాలి. సమాజాన్ని సమస్యలను విశ్లేషించడం మాత్రమే పాఠం ఉద్దేశం కాదు. సమస్యల పరిష్కారం కోసం, సమాజ మార్పుకోసం ప్రజలను సమాయత్త పర్చడమే పాఠం ఉద్దేశం. కాబట్టి ముగింపును ఆ కోణంలో ఇవ్వాలి. అలాగని యాంత్రికంగా, కృత్రిమంగా ఉపదేశాలు ఇవ్వకూడదు. పాఠ్యాం శ బోధనలోని తార్కిక క్రమమే అట్లాంటి ముగింపుకు దారితీయాలి. విద్యార్థులకు పోరాట ఆవశ్యకతను వివరించేటప్పుడు "మీరు పోరా డండి" "పోరాటం మీ బాధ్యత, మనందరిదీ" అనాలి.

**స్వయం కృషి – విస్తృత అధ్యయనం :** "మంచి కమ్యూనిస్టు ఎలా ఉండాలి" అనే గొప్ప గ్రంథంలో చైనా కామ్రేడ్ లీ షావ్ చీ ప్రతి కమ్యూనిస్టు నిర్వహించాల్సిన స్వయంకృషిని గురించి పదే పదే గుర్తు చేశాడు. కమ్యూనిస్టు తనకు తానుగా ఉన్నతంగా ఎదగగలిగితేనే సామాజిక మార్పుకు తానొక ఆయుధంగా ఉపయోగ పడగలడు. అలాంటి స్వయంకృషి అన్ని కోణాలలోనూ సాగాలి. విస్తృతంగా సైద్ధాం తిక జ్ఞానాన్ని పొందడంలోనూ, అవసరమయిన నైపుణ్యాలు నేర్చుకోవ డంలోనూ, కమ్యూనిస్టు కారెక్టర్‌ను నిర్మించుకోవడంలోనూ నిరంతర సాధన అవసరం. ప్రతి కమ్యూనిస్టూ ఉపాధ్యా యుడు కావాలి. పాఠం బోధించే పనిలో అద్వితీయమైన నైపుణ్యాన్ని సాధించాలి. ప్రతి కమ్యూనిస్టుకు ఖచ్చితంగా ఉండాల్సిన రెండు అలవాట్లు చదవటం, రాయటం. కరపత్రాలు, రిపోర్టులు, మినిట్స్, దరఖా స్తులు, పత్రికా ప్రకటనలు స్వయంగా రాయగలగాలి. వ్యాసాలు రాయటం కూడా నేర్చుకోవాలి. స్వయం కృషి లేదా స్వయం సాధనే దీనికి మార్గం. ఈ సమాజాన్ని మార్చాలనే పట్టుదల ఉంటే అందుకవసరమైన విల్‌పవర్ దానంతటదే కమ్యూనిస్టు నైజంలో భాగమైపోతుంది. ఆల్ గ్రేట్ లీడర్స్ ఆర్ గ్రేట్ రీడర్స్, గొప్ప కమ్యూనిస్టు నాయకుల్లో చదివే అలవాటు వారి వ్యక్తిత్వంలో విడదీయరాని భాగంగా ఉంటుంది. మావో కోటు జేబులో ఎప్పుడూ పుస్తకాలుండేవట. మార్క్స్ ఉదయం 9 గంటలకు లైబ్రరీలోనికి ప్రవేశిస్తే రాత్రి 7 గంటల దాకా చదువుతూనే ఉండేవాడు. పుస్తక పఠనం, సాహిత్య సృజనల విషయం లో కమ్యూనిస్టుల కృషి అనన్య సామాన్య మైనది. ఇది ఏ ఒక్క దేశానికో పరిమిత మైన అంశం కాదు. విద్య పాత్ర మనిషి జీవితం మీద, సమాజం మీద ఎలా ఉంటుందో తెలుసు కనుకనే కమ్యూనిస్టులు విద్యా ప్రక్రియకు ఎనలేని ప్రాధాన్యత నిస్తారు. ప్రతి కమ్యూనిస్టు కార్యకర్తా ఈ విలువైన వారసత్వాన్ని కొనసాగించాలి. ప్రతి కార్యకర్తా సొంత లైబ్రరీ ఇంట్లో ఏర్పరు చుకోవాలి. కమ్యూనిస్టు పార్టీ ఆఫీసులు విజ్ఞాన కేంద్రాలు కావాలి. అధ్యయనానికి టైమ్ లేదనటం కుంటి సాకు మాత్రమే. సుందరయ్య, బసవపున్నయ్య, నంబూద్రిపాద్ లాంటి నాయ కులు ఎంతటి పని ఒత్తిడి ఉన్నా చదవటాన్నీ, రాయటాన్నీ నిర్లక్ష్యం చేసేవారు కాదు.

మంచి ఉపాధ్యాయునిగా ఎదగా లనుకున్న వారిపై ఈ బాధ్యత మరింతగా ఉంటుంది. కేవలం పుస్తకాలను చదవటం మాత్రమేగాక గొప్ప ఉపాధ్యాయులనుండి నేర్చుకోవాలి. వారి భాష, మాట్లాడే పద్ధతి, హావభావాలు తదితరాలు గమనిస్తూ నేర్చుకోవాలి. సాధన చెయ్యాలి. పార్టీ నిర్వ హించే వర్క్‌షాపులకు, శిక్షణా కార్యక్రమా లకు హాజరవుతూ బోధనా నైపుణ్యాలు పెంచు కోవాలి. ⊙

ఆర్థిక రంగం

# ఆర్థిక వ్యవస్థలో స్థబ్దత - ద్రవ్యీకరణ వైరుధ్య స్వభావం

**వేగవంతమైన అభివృద్ధి పెట్టుబడిదారీ వ్యవస్థ సాధారణ లక్షణంగానూ, సంక్షోభం అడపాదడపా వచ్చి వెళ్లే అతిథిగానూ సాంప్రదాయ ఆర్థిక వేత్తలు వ్యాఖ్యానిస్తారు. కానీ అది నిజం కాదు. సంక్షోభం పెట్టుబడిదారీ వ్యవస్థలో సాధారణ లక్షణం. వేగవంతమైన అభివృద్ధి అప్పుడప్పుడూ కనిపించే మినహాయింపు.**

**- ఫ్రెడ్ మెగ్డాఫ్, జాన్ బెల్లమీ ఫాస్టర్**

అమెరికాలో మహా తిరోగమనం మొదలైన (2008) ఆరేళ్ల తర్వాత, ఈ తిరోగమన దశ ముగిసింది అని అధికారికంగా నిర్ధారించిన ఐదేళ్ల తర్వాత కూడా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మూలస్థంభాలుగా ఉన్న దేశాల్లో ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలోనే మునిగి ఉంది. తిరోగమన దశలో అమెరికాలో ఉపాధి కోల్పోయిన వారికి నేటికీ ఉపాధి దొరకలేదు. యూరప్‌లో గ్రీస్, స్పెయిన్, పోర్చుగల్ వంటి దేశాల ఆర్థిక వ్యవస్థలు మాంద్య దశకు చేరుకున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థకు అమెరికా, యూరప్ తర్వాత మరో మూల స్థంభం జపాన్. జపాన్ ఆర్థిక వ్యవస్థ రెండు దశాబ్దాల పాటు తిరోగమనంలో కొనసాగింది. దీన్నే ఆర్థిక వేత్తలు నష్టపోయిన దశాబ్దాలు అని పిలుస్తున్నారు. తిరిగి జపాన్ కరెన్సీ యెన్ విలువ తగ్గించటం, లోటు పెంచటం ద్వారా ఆర్థిక వ్యవస్థలో కదలిక తేవాలని ప్రయత్నిస్తోంది.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం కొనసాగుతున్న దశ తాత్కాలికమైనది కాదనీ, పెట్టుబడిదారీ వ్యవస్థ వ్యవస్థాగత లక్షణాల్లో అంతర్భాగమే అనీ కొందరు ఆర్థిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 2013 నవంబరులో అమెరికా ఆర్థిక మంత్రి లారీ సమ్మర్స్ ఒక ఉపన్యాసంలో అర్థశాస్త్ర చరిత్రలో విస్మరించిన కోణాల గురించి అధ్యయనం ప్రారంభించాలని అభిప్రాయపడ్డారు. 'నిలకడగా ఉన్న స్థబ్దత' గురించి ప్రత్యేకంగా పరిశీలించాలని పిలుపునిచ్చారు. అమెరికాలో తొలితరం కీన్స్ అనుయాయుల్లో ఒకరైన అల్విన్ హాన్సెన్ పరిపక్వం చెందిన ఆర్థిక వ్యవస్థల్లో పెట్టుబడి పెట్టేందుకు నూతన అవకాశాలు లేకపోవటాన్ని వివరించేందుకు 'నిలకడగా కొనసాగుతున్న స్థబ్దత' అన్న పదబంధాన్ని ముందుకు తెచ్చారు. అమెరికాలో సమకాలీన ఆర్థిక పరిణామాల గురించి ప్రస్తావిస్తూ లారీ సమ్మర్స్ 2007, 2009లో ద్రవ్యబుడగ పతనానికి ముందుకూడా ఆర్థిక వ్యవస్థలో చెప్పుకోదగ్గ ఊపు లేదనీ, 'చివరకు కృత్రిమంగా సృష్టించబడ్డ ద్రవ్యబుడగలు కూడా సగటు డిమాండ్‌ను పెంచలేకపోయాయనీ' వ్యాఖ్యానించారు. ఆర్థిక వ్యవస్థలో స్థబ్దత మరింత లోతుగా వేళ్లూనుకుని ౯న్నదని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. తాజాగా ఫైనాన్షియల్ టైమ్స్ పత్రికలో రాసిన ఒక వ్యాసంలో "సాధారణ ఆర్థిక పరిస్థితులు పునరావృతం అవుతాయని అనుకోవటానికి తావులేదు' అని తన విశ్లేషణ ముగించారు.

ఐఎంఎఫ్‌ను ఉద్దేశించి లారీ సమ్మర్స్ చేసిన వ్యాఖ్యలను మరింత ముందుకు తీసుకెళ్తూ నోబెల్ బహుమతి గ్రహీత అయిన ఆర్థిక వేత్త పాల్ క్రుగ్‌మన్ 'నిలకడగా కొనసాగుతున్న స్థబ్దత ఆర్థిక వ్యవస్థలో ఏదో ఒక ప్రత్యేక పరిస్థితులకు పరిమితమైన పరిణామం కాదు. నేడు ఇది సాధారణ లక్షణంగా మారింది' అన్నారు. ఈ పరిస్థితుల్లో ఆర్థిక వ్యవస్థ ముందుకు నడవాలంటే ద్రవ్య బుడగల సృష్టీ, ఆర్థిక వ్యవస్థలో వృథా వ్యయమూ అనివార్యం. క్రుగ్‌మన్ తన విశ్లేషణ కొనసాగిస్తూ "2003 – 2007 మధ్య కాలంలో ఆర్థిక వ్యవస్థ ద్రవ్య బుడగల ద్వారానే శ్వాస పీల్చుకున్నదని మనకు తెలుసు. 1990 దశకం తర్వాతి పరిస్థితి, రీగన్ హయాంలో అమెరికా ఆర్థిక వ్యవస్థ చవిచూసిన వృద్ధిరేటుకు కూడా ఈ గాలిబుడగలే కారణం అని చెప్పవచ్చు. రీగన్ హయాంలో మదుపు, రియల్ ఎస్టేట్ రంగాల్లో కృత్రిమ కదలిక తేవటం ద్వారా ఆర్థిక వ్యవస్థ వేగం పెంచుకుంది" అని వ్యాఖ్యానించాడు.

మరో రకంగా చెప్పాలంటే ప్రస్తుత పరిణామాలకు కారణం మందగిస్తున్న వృద్ధి రేటు లేదా స్థబ్దత అన్నది నిర్వివాదాంశం. 2007కు



ఫ్రెడ్ మెగ్డాఫ్, జాన్ బెల్లమీ ఫాస్టర్

**ఫ్రెడ్ మెగ్డాఫ్ అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ వెర్మాంట్‌లో మొక్కలు, నేల సాంకేతిక శాస్త్రంలో ఎమిరిటస్ ప్రొఫెసర్. రాజకీయ, ఆర్థిక అంశాలపై అనేక వ్యాసాలు రాశారు. జాన్ బెల్లమీ ఫాస్టర్ మంత్లీ రివ్యూ పత్రిక ఎడిటర్. ఓరెగావ్ యూనివర్సిటీలో సోషియాలజీ ప్రొఫెసర్. ఇద్దరూ కలిసి 'మహా ఆర్థిక సంక్షోభం' (2009), పెట్టుబడిదారీ వ్యవస్థ గురించి ప్రతి పర్యావరణ వేత్త తెలుసుకోవలసిన అంశాలు' (2011) అనే పుస్తకాలు రాశారు. వీటిని మంత్లీ రివ్యూ ప్రెస్ ప్రచురించింది.**

ముందు అమెరికా గృహనిర్మాణ రంగంలో కనిపించిన గాలిబుడగ కూడా కేవలం ఆర్థిక వ్యవస్థను ఒక మోస్తరు స్థాయిలో కదిలించటానికే ఉపయోగపడింది.

ఈ నిలకడగా కనిపిస్తున్న స్థబ్దత వెనక గల సంస్థాగత కారణాలుగానీ, సైద్ధాంతిక నేపథ్యం గానీ క్రుగ్‌మన్, సమ్మర్స్‌ల వ్యాఖ్యలు వినిపించలేకపోతున్నాయి. దీనికి బదులుగా వీరు కేవలం ద్రవ్య కొరతపైనే దృష్టి సారించారు. తద్వారా వడ్డీ రేట్లు తగ్గించటమే ప్రత్యామ్నాయంగా చూపారు. అదికూడా ఒక స్థాయికి మించి చేయలేని పరిస్థితికి అమెరికా ఆర్థిక వ్యవస్థ చేరుకుంది. ఏది ఏమైనా పై వ్యాఖ్యలు, విశ్లేషణల విధానపరమైన పర్యవసానాలు వారికి బాగా తెలుసు. ఈ పర్యవసానం ఏమిటంటే ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థలో చలనం రావాలంటే ప్రభుత్వ వ్యయం విపరీతంగా పెరగాలి. అయితే ఈ విధంగా తెచ్చే కదలిక ప్రైవేటు పెట్టుబడికి ద్వారాలు తీసేదిగా ఉండాలి. ఈ విశ్లేషణను అంగీకరిస్తే ప్రభుత్వ వ్యయం, ప్రైవేటు వ్యయం పెరగటం అవసరమే కాదు. ఈ పెరుగుదల కూడా ఆర్థిక వ్యవస్థల్లో కొత్త గాలిబుడగలు సృష్టించేంతగా ఉండాలి. ఎందుకంటే అటువంటి గాలిబుడగలు లేకుండా వేగవంతమైన అభివృద్ధి సాధించటం వీలుపడదు. క్రుగ్‌మాన్ మాటల్లోనే, "పూర్తిగా గానీ, పాక్షికంగా గానీ వృధా అయ్యేదే అయినా ప్రైవేటు వ్యయం, ప్రభుత్వ వ్యయం భవిష్యత్తులో కొత్త సమస్యలకు తెరతీయనంతవరకు మంచిదే..."ఈ వ్యాఖ్యానాన్ని అంగీకరిస్తే ఏదో ఒక రూపంలో ఆర్థిక వ్యవస్థలో కొత్త రంగాల్లో కొత్త గాలిబుడగలు సృష్టించటం ఆ దిశగా వ్యయం చేయటం తప్ప మరో మార్గంలో ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం కదలిక తేవటం సాధ్యం కాదు. అలా చేయటం అంటే దీర్ఘకాలంలో ఆర్థిక వ్యవస్థను మరింత లోతైన సంక్షోభానికి దగ్గర చేయటమే.

పెట్టుబడిదారీ వ్యవస్థను బలపర్చే ఆర్థిక వేత్తలు కొందరు సమకాలీన పెట్టుబడిదారీ వ్యవస్థలో స్థబ్దత దీర్ఘకాల పరిణామం, లక్షణంగా కనిపిస్తుందని అంగీకరించటం ఈ కాలంలో చెప్పుకోదగ్గ మరో పరిణామం. అంతేకాదు, ఈ లక్షణం నేపథ్యంలో కొన్ని రంగాల్లో స్వల్పకాలం కనిపించే ఉత్థానపతనాలు, వృధా వ్యయాలు 'హేతుబద్ధమైనవే' అన్న నిర్ధారణ కూడా సమంజసంగానే కనిపిస్తుంది. ఈ పరిస్థితులు పెట్టుబడిదారీ వ్యవస్థ ఎదుర్కొంటున్న స్థబ్దత గురించి దాని లోతుపాతుల గురించి మరో సారి చర్చించేందుకు అవకాశం కల్పిస్తున్నాయి.

> "పెట్టుబడిదారీ వ్యవస్థలో అనూహ్యంగా పెరుగుతున్న ఉత్పాదక సామర్థ్యాన్ని సంపూర్ణంగా వినియోగించుకోలేకపోవటం మనకు కనిపించే మౌలిక వైరుధ్యం. ఈ పరిస్థితి పెట్టుబడిదారీ వ్యవస్థను స్థబ్దతకు లోను చేస్తుంది."

### పెట్టుబడి ద్రవ్యీకరణ – స్థబ్దత

పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో స్థబ్దతకూ, పెట్టుబడి ద్రవ్యీకరణకూ మధ్య ఉన్న వైరుధ్యం గురించి తెలుసుకోవాలంటే మార్క్సిస్టు అవగాహనకు రావటం తప్ప మరో మార్గం లేదు. మార్క్సిస్టు అర్థశాస్త్రంలో పెట్టుబడి పోగుపడే ప్రక్రియకు ప్రాధాన్యత ఉంది. ఈ సందర్భంగా 1980లో పాల్ స్వీజీ 'అమెరికా పెట్టుబడిదారీ వ్యవస్థలో సంక్షోభం' అనే పేరుతో చేసిన ప్రసంగాన్ని పరిశీలించటం ఉపయోగకరంగా ఉంటుంది. రీగన్ అధ్యక్షునిగా ఎన్నిక కావటానికి ఆర్నెల్ల ముందు స్వీజీ ఈ ఉపన్యాసం ఇచ్చారు. ఈ ప్రసంగంలో స్వీజీ 'అమెరికాలో పెట్టుబడిదారీ విధానం పెట్టుబడి పోగుచేసుకోవటానికి సంబంధించి దీర్ఘకాల సంక్షోభంలో పడింద'ని నిర్ధారించారు.

ఈ సిద్ధాంతాన్ని 'మితిమీరిన సమీకరణ' సిద్ధాంతంగా చెప్పుకోవచ్చు. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లో 20వ శతాబ్దంలో చోటు చేసుకున్న విధంగా గుత్తపెట్టబడిదారీ వ్యవస్థలో లాభదాయకమైన పెట్టుబడి కార్యక్రమాలు ఆర్జించే అదనపు విలువకంటే ఎక్కువ అదనపు విలువను పోగుచేయటం మొదలైంది. ఈ ధోరణి ప్రారంభమైన అన్ని దేశాల్లోనూ ఉత్పాదక సామర్థ్యాన్ని సంపూర్ణంగా వినియోగించుకోవటంలో అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు విఫలం కావటంతో నిరుద్యోగం పెరిగి, వృద్ధి రేటు, ఉత్పత్తి, ఆదాయం పతనం ప్రారంభమయ్యింది. ఈ పరిస్థితి పెట్టుబడి, ఆర్థిక వృద్ధికి అవరోధంగా మారుతుంది. ఈ ధోరణి క్రమంగా పుంజుకొంటోంది. దీనికి కారణం – మార్క్స్ చెప్పినట్లు పెట్టుబడి ఒక చోట కేంద్రీకృతం కావటం – గుత్తాధిపత్యం పెరగటం –పెట్టుబడిదారీ వ్యవస్థ పుట్టుక నుండీ కొనసాగుతున్న లక్షణం. ఈ శతాబ్దకాలంలో మరింత పుంజుకున్న లక్షణం. ఈ పరిణామాన్ని 'గుత్తాధిపత్యం ఎంతగా పెరిగితే స్థబ్దతకు లోనయ్యే లక్షణం అంతగా ఎక్కువవుతుంది' అని వ్యాఖ్యానించవచ్చు.

అభివృద్ధి, పెట్టుబడిదారీ విధానం గురించి సాంప్రదాయక ఆర్థిక వేత్తల వాదనలు ప్రస్తుతం తలకిందులుగా ఉన్నాయి. వాటిని తిరిగి కాళ్లపై నిలబెట్టాల్సిన సమయం వచ్చింది. వేగవంతమైన అభివృద్ధి పెట్టుబడిదారీ వ్యవస్థ సాధారణ లక్షణంగానూ, సంక్షోభం అడపాదడపా వచ్చి వెళ్లే అతిథిగానూ సాంప్రదాయ ఆర్థిక వేత్తలు వ్యాఖ్యానిస్తారు. కానీ అది నిజం కాదు. సంక్షోభం పెట్టుబడిదారీ వ్యవస్థలో సాధారణ లక్షణం. వేగవంతమైన అభివృద్ధి అప్పుడప్పుడూ కనిపించే మినహాయింపు.

పెట్టుబడిదారీ వ్యవస్థలో అనూహ్యంగా పెరుగుతున్న ఉత్పాదక సామర్థ్యాన్ని సంపూర్ణంగా వినియోగించుకోలేకపోవటం మనకు కనిపించే మౌలిక వైరుధ్యం. ఈ పరిస్థితి పెట్టుబడిదారీ వ్యవస్థను స్థబ్దతకు లోను చేస్తుంది. ఈ లక్షణం తొలుత నిరంతరం లాభాలు సంపాదించే అవకాశాలు తగ్గిపోవటం ద్వారా పెట్టుబడి పోగుపడటంలో అవాంతరాలు సృష్టించటం రూపంలో మనకు కనిపిస్తుంది. ఆర్థిక వ్యవస్థలో గుత్తాధిపత్యం పెరగటంతో ధరలు, లాభాలు, ఆదాయం, ఉత్పత్తి, గిరాకీ అన్ని అంశాలపైనా దాని ప్రభావం కనిపిస్తోంది.

పారిశ్రామిక పెట్టుబడి గుత్తపెట్టుబడి స్వభావం సంతరించుకోవటంతో వ్యవస్థలో తలెత్తే పర్యవసానాలను ఆర్థిక వేత్త హాబ్సన్ పెట్టుబడిదారీ వ్యవస్థ సాధించిన పరిణతి అని విశ్లేషించగా ఈ పరిణామాన్ని మార్క్సిస్టు దృక్కోణంతో విశ్లేషించిన స్వీజీ 'స్థబ్దత'గా గుర్తించాడు. 19, 20 శతాబ్దాల్లో చోటుచేసుకున్న పారిశ్రామికీకరణ, ఉత్పత్తి క్రమంలో రెండు విభాగాలను నిర్మించుకొన్నది. మొదటి విభాగాన్ని ఉత్పత్తి సాధనాలను తయారు చేసే విభాగంగానూ, రెండో విభాగాన్ని వినియమ వస్తువులను ఉత్పత్తి చేసే విభాగంగానూ ఆర్థికవేత్తలు విభజించారు. మొదటి విభాగంలో పెట్టుబడిదారీ

**❝ వియత్నాం యుద్ధం చరమాంకంలోకి ప్రవేశించిన తర్వాత అమెరికా ఆర్థిక వ్యవస్థ తిరోగమన దిశకు చేరుకోవటం కాకతాళీయం కాదు. 1974-75లో మొదలైన చక్రీయ తిరోగమనం రెండో ప్రపంచ యుద్ధానంతర కాలంలో పెట్టుబడిదారీ వ్యవస్థ చవిచూసిన అన్ని రకాల తిరోగమన ధోరణుల్లోకీ అత్యంత తీవ్రమైనది. అంతేకాదు, ఈ ధోరణి అమెరికా ఆర్థిక వ్యవస్థ లోనూ, తర్వాతి కాలంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోనూ నిరంతరంగా కనిపిస్తూ వచ్చిన స్థబ్దతకు పునాదులు వేసింది. ❞**

వ్యవస్థ విశేష అభివృద్ధి సాధించింది. కొద్దిపాటి అదనపు పెట్టుబడులతో వ్యవస్థలో తలెత్తే అన్ని రకాల అవసరాలను తీర్చుకోగల స్థాయికి మొదటి విభాగం అభివృద్ధి చెంది ఉంది. ఈ పరిణామాన్ని హాన్సన్ 'పెట్టుబడి దృష్ట్యా పేదరికం నుండి సంపన్నతకు చేరుకోవటంగా వర్ణిస్తారు. దీర్ఘకాలంలో అదనపు విలువను వినియోగించుకోగల అన్ని అవకాశాలనూ ఈ లక్షణం ప్రతికూలంగా ప్రభావితం చేస్తోంది.

దీంతో పెట్టుబడిదారీ విధానం ముందుకు సాగటానికి బాహ్య వనరులపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ పరిణామం పెట్టుబడిదారీ విధానం చరిత్రలో అన్ని దశల్లోనూ మనకు కనిపిస్తుంది. ఈ బాహ్య వనరులు ప్రభుత్వ వ్యయం కావచ్చు. భారీ సాంకేతిక ఆవిష్కరణల కోసం జరిగే వ్యయం కావచ్చు. 'సంక్షోభంలో అమెరికా పెట్టుబడిదారీ విధానం' మరియు ఇతర వ్యాసాల్లో స్వీజీ ఇటువంటి ఆరు బాహ్య వనరులను, కారకాలను గుర్తిస్తారు. ఈ ఆరు కారణాల రీత్యా అమెరికా ఆర్థిక వ్యవస్థ రెండో ప్రపంచ యుద్ధానంతరం శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. 1. ప్రపంచ వాణిజ్యం, పెట్టుబడి సరఫరాల ద్వారా బహుళజాతి కంపెనీలు తెరమీదకు రావటంతో అమెరికా ఆర్థిక వ్యవస్థ తనతో మిగిలిన దేశాలు పోటీ పడలేని స్థాయికి చేరుకుంది. 2. యుద్ధసమయంలో అమెరికాలో పెద్దఎత్తున మదుపు నిధులు పోగుపడ్డాయి. 3. యుద్ధంలో శిథిలమైన యూరోపియన్ దేశాల ఆర్థిక వ్యవస్థలను పునర్నిర్మించటానికి అమెరికా పెట్టుబడులు పెట్టాల్సి వచ్చింది. 4. యుద్ధావసరాల నిమిత్తం ఆవిష్కరించబడిన నూతన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాలు జెట్ విమానాలు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు వంటివి పెట్టుబడి వినియోగానికి నూతన అవకాశాలు కల్పించాయి. 5. అమెరికాలో రాష్ట్రాల మధ్య జాతీయ రహదారులు నిర్మించటం ద్వారా ఆటోమొబైల్ రంగానికి కొత్త జీవం పోయటం. 6. ఆసియాలో జరిగిన రెండు ప్రధాన యుద్ధాలు (కొరియా,



పాల్ క్రుగ్‌మన్

వియత్నాం యుద్ధాలు)తో పాటు ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో సామ్రాజ్యవాద వ్యూహాల అమలు. ఈ ఆరు కారణాలు అమెరికా పెట్టుబడిదారీ వ్యవస్థలో పెట్టుబడి సంచయానికి కొత్త అవకాశాలు కల్పించాయని స్వీజీ విశ్లేషించారు.

అదనపు పెట్టుబడిని వినియోగించటం ద్వారా ప్రైవేటు పెట్టుబడి సంచయానికి దోహదం చేసిన శక్తివంతమైన అంశాలు ఇవి. అయితే ఇవి కూడా ఉపాంత ప్రయోజనం సిద్ధాంతానికి లోబడి పని చేసేవే. పెట్టుబడిదారీ వ్యవస్థకు ఈ అంశాలు ఒక్కసారి మాత్రమే ఊతమివ్వగలిగాయి. వియత్నాం యుద్ధం చరమాంకంలోకి ప్రవేశించిన తర్వాత అమెరికా ఆర్థిక వ్యవస్థ తిరోగమన దిశకు చేరుకోవటం కాకతాళీయం కాదు. 1974-75లో మొదలైన చక్రీయ తిరోగమనం రెండో ప్రపంచ యుద్ధానంతర కాలంలో పెట్టుబడిదారీ వ్యవస్థ చవిచూసిన అన్ని రకాల తిరోగమన ధోరణుల్లోకీ అత్యంత తీవ్రమైనది. అంతేకాదు, ఈ ధోరణి అమెరికా ఆర్థిక వ్యవస్థలోనూ, తర్వాతి కాలంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోనూ నిరంతరంగా కనిపిస్తూ వచ్చిన స్థబ్దతకు పునాదులు వేసింది.

1980 వసంత రుతువులో స్వీజీ ఈ ఉపన్యాసం చేస్తున్నపుడు భవిష్యత్తు గురించిన స్పష్టత లేదు. స్థబ్దతకు తాత్కాలిక పరిష్కారం గానీ, దీర్ఘకాలిక పరిష్కారం కానీ కనుచూపు మేరలో లేదు. రీగన్ అధికారంలోకి వచ్చిన వెనువెంటనే – రీగన్ విధానాలు రెండో దశ ప్రచ్ఛన్నయుద్ధానికి తెరతీశాయి. అప్పుడు ప్రారంభమైన సైనికీకరణ క్రమం ఒక్కటే పెట్టుబడి సంచయం ఇంజనుకు కావల్సిన ఇంధనాన్ని సమకూర్చలేకపోయింది. మహా మాంద్యం నుండి అమెరికా, జర్మనీ ఆర్థిక వ్యవస్థలను బయట పడేసిన తరహాలో ప్రపంచవ్యాప్తమయ్యే యుద్ధం జరిగే అవకాశం లేదు. కొరియా, వియత్నాం యుద్ధాల స్థాయిలో జరిగే సామ్రాజ్యవాద యుద్ధాలకు కూడా నాడు తావు లేదు.

ఈ పరిస్థితుల్లో ఆర్థిక వ్యవస్థలో కదలిక తేవటానికి ఉన్న ఏకైక ప్రత్యామ్నాయ మార్గం ద్రవ్యరంగం, బీమా రంగం, రియల్ ఎస్టేట్ రంగాల్లో కార్యకలాపాలు ఊపందుకొనేలా చేయటమే. దీన్నే ఇంగ్లీషులో ఫైర్ అంటున్నారు. ( ఎఫ్ : ఫైనాన్స్, ఐ : ఇన్సూరెన్స్, ఆర్ ఇ : రియల్ ఎస్టేట్ రంగాలు) పాల్ స్వీజీ, బరాన్‌లు "గుత్తపెట్టుబడిదారీ వ్యవస్థ" అన్న గ్రంథంలో విశ్లేషించినట్లుగా ఈ ఒక్కటి మాత్రమే అదనపు పెట్టుబడిని వినియోగించుకుని ఆర్థిక వ్యవస్థను ముందుకు నెట్టగలిగిన మార్గం. అయితే 1980 నాటికి మొత్తంగా ఆర్థిక వ్యవస్థలో కదలిక తేగలిగిన స్థితిలో ద్రవ్య రంగం లేదు. తమ వాదనలకు మద్దతుగా అప్పటికి రెండు మూడు నెల్ల ముందు అలెన్ గ్రీన్ స్పాన్, ఛాలెంజ్ అనే పత్రికలో అమెరికా ఆర్థిక వ్యవస్థ గురించి ప్రచురించిన అంచనాలను బరాన్, స్వీజీలు ఉపయోగించారు. సదరు వ్యాసంలో గ్రీన్‌స్పాన్ అమెరికా ఆర్థిక వ్యవస్థ ప్రమాదకర స్థాయికి చేరుకొందనీ, రుణ చెల్లింపుల వైఫల్యం మొత్తం ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయనున్నదనీ, ధరలు పెరగనున్నాయనీ అంచనా వేశారు.

తదనంతర కాలంలో అమెరికా ఆర్థిక వ్యవస్థలో సమూల మార్పులు చోటు చేసుకున్నాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థలో గుణాత్మకమైన మార్పుగా చెప్పుకోదగ్గ ద్రవ్య పెట్టుబడి రంగం రెక్కలు విచ్చుకుంటున్న కాలం అది. 1990లో స్వీజీ ఈ పరిణామాన్ని "పెట్టుబడి సంచయాన్ని ద్రవ్యీకరించటం"గా వ్యాఖ్యానించారు. గుత్తపెట్టుబడిదారీ విధానం పై మార్క్సిస్టు విమర్శకుల తర్కంలో మౌలిక సూత్రం ఒక్కటే. సరైన లాభాలు తెచ్చిపెట్టే అవకాశాలు లేనపుడు బహుళజాతి కంపెనీలు, సంపన్నుల చేతుల్లో పోగుపడ్డ పెట్టుబడి ద్రవ్యరంగంలోకి ప్రవేశించటం ద్వారా ఉత్పత్తి విలువతో సంబంధంలేని


ఊహాజనిత విలువలు, గాలివాటు కార్యక్రమాల్లోకి మళ్లుతాయి. కుప్పలు తెప్పలుగా వచ్చిపడుతున్న ద్రవ్య పెట్టుబడులకు అవకాశాలు కల్పించటానికి ద్రవ్య యాజమాన్య సంస్థలు అనేక నూతన సాధనాలు సృష్టించాయి. మార్గాలు కనుగొన్నాయి. వాటికి ఆకర్షణీయమైన పేర్లు పెట్టాయి. ఇటువంటి ఆకర్షణీయమైన పెట్టుబడి మార్గాలకు లాభార్జనలో ముప్పు వాటిల్లినపుడు కేంద్ర రిజర్వు బ్యాంకులు ఆఖరిక్షణంలో గజేంద్ర మోక్షంలో విష్ణుచక్రంలా పని చేయటం ప్రారంభించాయి. ఈ నూతన ద్రవ్య పెట్టుబడి చట్రం అనతికాలంలోనే ప్రపంచీకరించ బడింది. ఉత్పాదకరంగంపై ఆధిపత్యం సాధించింది.

"ఉత్పత్తి మరియు ద్రవ్యం" అన్న శీర్షికతో 1983లో హారీ మాగ్డాఫ్, పాల్ స్వీజీ ఒక మౌలికమైన పత్రాన్ని ప్రచురించారు. ఈ పత్రంలో ద్రవ్యపెట్టుబడి రంగం విస్తరించటం అనేది స్థబ్దతను తాత్కాలికంగా నిలువరించేందుకు ఉపయోగపడుతోందనీ, పెట్టుబడిదారీ వ్యవస్థ చరిత్రలోనే ఎన్నడూ లేని గుణాత్మక మార్పు కనిపిస్తోందనీ విశ్లేషించారు. ఆర్థికాభివృద్ధి మందగించినపుడు ద్రవ్యోత్పత్తులు విస్తరించటం, ద్రవ్య పెట్టుబడి ప్రభావం పెరగటం పరస్పర విరుద్ధ స్వభావం కలిగిన పరిణామం అని వ్యాఖ్యానించారు. గుత్తపెట్టుబడిదారీ వ్యవస్థలో ఉత్పాదక చట్రం మీద ద్రవ్య పెట్టుబడి చట్రం నిర్మితమవుతోందని గుర్తించారు.

సంపద ప్రభావం గురించి ప్రస్తావిస్తూ "ఉత్పాదక వ్యవస్థ సంక్షోభంలో ఉన్నప్పటికీ ద్రవ్య వ్యవస్థ వికసించగలదని నిరూపించింది ఈ కాలం. ఇది జరిగినపుడు పెరుగుతున్న గిరాకీని అందుకునే విధంగా ఉత్పత్తిరంగం విస్తరించటం, ద్రవ్యపెట్టుబడి రంగంలో కొత్త ఉపాధి అవకాశాలు తెరమీదకు రావటంతోనే ఆగదు. మొత్తంగా ఆర్థిక రంగంలో ఈ ద్రవ్యపెట్టుబడి విలువ పెరుగుతుంది. మార్చి మాసంలో మోర్గాన్ గ్యారంటీ సర్వేలో 1982 చివరి ఆర్నెల్లలో బాండ్లు, స్టాక్‌లు, ఇతర ద్రవ్య మదుపు సాధనాల విలువ 500 బిలియన్ డాలర్లు పెరిగిందని తేల్చారు. ఇదంతా ద్రవ్యరంగంలో క్రియాశీలత పెరిగినందువల్ల సాధ్యమైనదే. దీని పర్యవసానంగా వినియోగదారుల గిరాకీలో కొంత పెరుగుదల ఉంటే ఉండవచ్చు. స్థూలంగా చూసినపుడు ఆర్థిక వ్యవస్థ తిరోగమనం నుండి బయట పడుతున్నట్లు కనిపించే అవకాశం కూడా ఉంది.

సంపన్నవర్గంలో పెరిగిన గిరాకీ మరోవైపున వ్యక్తిగత రుణగ్రస్తత కూడా పెంచుతుంది. అత్యధికులైన కార్మికుల నిజవేతనాల్లో స్థబ్దత

> **❝ సంపన్నవర్గంలో పెరిగిన గిరాకీ మరోవైపున వ్యక్తిగత రుణగ్రస్తత కూడా పెంచుతుంది. అత్యధికులైన కార్మికుల నిజవేతనాల్లో స్థబ్దత చోటుచేసుకున్నపుడు కార్ల లోన్లూ, ఇళ్ల తనఖా, క్రెడిట్ కార్డులూ, విద్యారుణాల వంటి అనేక మార్గాల్లో రుణగ్రస్తత పెరుగుతుంది. అమెరికా ఆర్థికాభివృద్ధి వెనక ఈ అన్ని రకాల రుణగ్రస్తత కీలక పాత్ర పోషించింది. ❞**




చోటుచెసుకున్నపుడు కార్ల లోన్లూ, ఇళ్ల తనఖా, క్రెడిట్ కార్డులూ, విద్యారుణాల వంటి అనేక మార్గాల్లో రుణగ్రస్తత పెరుగుతుంది. అమెరికా ఆర్థికాభివృద్ధి వెనక ఈ అన్ని రకాల రుణగ్రస్తత కీలక పాత్ర పోషించింది. స్థూల జాతీయోత్పత్తిలో 1980లో 150శాతంగా ఉన్న రుణగ్రస్తత మహా తిరోగమనం ప్రారంభం కావటానికి ముందు 350 శాతానికి చేరింది. స్థూల జాతీయోత్పత్తిలో 45 శాతంగా ఉన్న వ్యక్తిగత రుణాలు ఈ కాలంలో 95 శాతానికి పెరిగాయి. వాస్తవిక ఆర్థిక వ్యవస్థతో సంబంధం లేకుండా రానురాను పెరుగుతున్న ద్రవ్య మార్కెట్ సాధనాల రూపంలో పెరిగిన రుణ భారం ఈ కాలంలో చోటుచేసుకున్న ద్రవ్యీకరణ సారాంశంగా చెప్పుకోవచ్చు.

స్వీజీ, మాగ్డాఫ్‌లు స్థబ్దత, ద్రవ్యీకరణల గురించిన తమ వాదనలన్నీ 1987లో ప్రచురించిన స్థబ్దత–ద్రవ్య విస్ఫోటనం అన్న గ్రంధంలో పొందుపర్చారు. ఆ సంవత్సరంలోనే అలెన్ గ్రీన్‌స్పాన్‌ను రీగన్ ఫెడరల్ రిజర్వు (రిజర్వు బ్యాంకు) అధ్యక్షునిగా నియమించారు. అదే సంవత్సరం చోటుచేసుకున్న స్టాక్‌మార్కెట్ పతనంతో మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యింది. ద్రవ్య పెట్టుబడి ప్రయోగిస్తున్న అస్త్రాలను ఎదుర్కోవాల్సిన గ్రీన్‌స్పాన్, స్టాక్ మార్కెట్ పతనమైన రెండో రోజున ఒక ప్రకటన విడుదల చేస్తూ ఫెడరల్ రిజర్వు "ఆర్థిక వ్యవస్థ గాడిలో పడటానికి అవసరమైన ద్రవ్య వనరులు అందుబాటులో ఉంచేందుకు" సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఈ ప్రకటన నేపథ్యంలో అమెరికా ప్రభుత్వం డాలర్లు ముద్రించటంతో అప్పటికి సంక్షోభం వాయిదా పడింది.

కానీ భవిష్యత్తులో ఈ సమస్య మరింతగా వెర్రితలలు వేయనున్నదని అర్థమైంది. స్థబ్దతను నిలువరించటానికి మూల కారణాలు పరిష్కరించటానికి బదులుగా ద్రవ్యీకరణ సాధనంగా వాడుకుంటే పెట్టుబడిదారీ వ్యవస్థలోని వ్యవస్థాగత సంక్షోభం మరింత తీవ్రమవనున్నదని నాటి అనుభవాలతో తేటతెల్లమైంది. 1987 స్టాక్ మార్కెట్ పతనం మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మాగ్డాఫ్, స్వీజీలు "మరో సంక్షోభం తెరమీదకు రావటానికి ముందు ఇది కేవలం విరామం మాత్రమే. కీలకమైన స్థానాల్లో ఉన్న వాళ్లు సంక్షోభం దేశాన్ని సర్వనాశనం చేయటానికి ముందే రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులో పెట్టరా అని మీరు ప్రశ్నించవచ్చు. ఖచ్చితంగా ఆ ప్రయత్నం చేస్తారు. ఇప్పుడు అలా జోక్యం చేసుకోవటమే ప్రామాణికంగా మారింది. 1987 స్టాక్ మార్కెట్ పతనం నేపథ్యంలో జోక్యం చేసుకున్నపుడు వచ్చిన సానుకూల ఫలితాలే మిగిలిన సందర్భాల్లోనూ వస్తాయని భావించటానికి వీల్లేదు. అలా జరిగితే మరింత మెరుగైన పైస్థాయిలో ఇటువంటి జోక్యం చేసుకోవాల్సి ఉంటుంది. కానీ భవిష్యత్తులో ఇటువంటి ప్రయత్నాలు, ప్రయోగాలు ఫలిస్తాయన్న గ్యారంటీ ఏమీ లేదు. అటువంటపుడు ఒక నూతన పరిస్థితి మన ముందుంటుంది" అని అభిప్రాయపడ్డారు.

1987లో స్వీజీ, మాగ్డాఫ్‌లు ఏ అంచనా వేశారో అదే నేడు మన కళ్ల ముందు ఉన్నదన్న వాస్తవాన్ని ఎవ్వరూ నిరాకరించలేరు. 1980, 1990 దశకాల్లో అమెరికా ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకున్న అభివృద్ధి కొద్దికాలం మనుగడ

**❝ కార్మికవర్గం దృష్టి నుండి చూసినపుడు స్థబ్దత అంటే ఉపాధి అవకాశాల కుదింపు, వేతనాలు పెరగకపోవటం.ఉపాధి అవకాశాల్లో వస్తున్న మార్పులు గమనిస్తే ఆర్థిక వ్యవస్థలు స్థబ్దతకు లోనయ్యాయని ఘంటాపథంగా చెప్పవచ్చు. 1950-60 దశకంలో అమెరికాలో నిరుద్యోగం 4.6 శాతం ఉండగా 1970 నాటికి 6.4కి పెరిగింది. ఈ కాలంలో కేవలం నిరుద్యోగం పెరగటమే కాదు. కార్మికవర్గాన్ని దోపిడీ చేయటంలో అనేక నూతన ధోరణులు, కోణాలు ముందుకొచ్చాయి. ❞**

సాగించే ద్రవ్య గాలిబుడగల ద్వారానే సాధ్యం అయ్యింది. ఈ గాలిబుడగలు మళ్లీ ఒకదాని తర్వాత ఒకటిగా అనేక సంక్షోభాలకు తెరతీశాయి. తొలిప్రయత్నంలో వృద్ధి రేటును ముందుకు తీసుకెళ్లినా చివరకు ఈ గాలిబుడగలే మొత్తం ఆర్థిక వ్యవస్థను సంక్షోభం పదఘట్టనల కిందకు లాగేశాయి. 1987 స్టాక్ మార్కెట్ సంక్షోభం మొదలు నేడు మనం చూస్తున్న మహా తిరోగమనం దశకు మధ్య అనేక సంక్షోభాలు, పతనాలు, దివాళాలు అమెరికా ఆర్థిక వ్యవస్థ చవిచూసింది. 1980 దశకంలో మదుపు నిల్వల సంక్షోభం, 1994లో మెక్సికో సంక్షోభం, 1997లో ఆసియా దేశాల సంక్షోభం, 2000లో డాట్‌కాం సంక్షోభం, వంటి అనేక వ్యవస్థాగత సంక్షోభాల మధ్యలో అమెరికా ఆర్థిక వ్యవస్థ ప్రయాణం సాగించింది. బడ్జెట్ మరియు విధాన ప్రాధాన్యతల కేంద్రంలో పని చేసే జేర్డ్ బెర్నిస్టీన్ "గత కొద్దికాలంగా చోటుచేసుకుంటున్న వాణిజ్య చక్రాలను గాలిబుడగ, పతనం పునరావృతం అవుతున్నట్లు గుర్తించకుండా ఉండలేము" అని అభిప్రాయపడ్డారు.

2000 సంవత్సరంలో డాట్‌కాం పతనంతో సంపన్న వర్గాలకు జరిగిన నష్టాన్ని పూడ్చటానికి అమెరికా రిజర్వు బ్యాంకుతో సహా అనేక దేశాల రిజర్వు బ్యాంకులు ఆర్థిక వ్యవస్థల్లో పెద్దమొత్తంలో నిధులు కుమ్మరించాయి. ఇదే సమయంలో ఆఫ్గనిస్తాన్ యుద్ధంతో అమెరికాలో సైనిక వ్యయం గణనీయంగా పెరిగింది. ఈ పరిణామాన్నే 2004లో అమెరికా రిజర్వు బ్యాంకులో డైరెక్టర్ల బోర్డు సభ్యుడైన బెన్ బెర్నాంకే 'గొప్ప సంయమనం'గా అభివర్ణించారు. ద్రవ్య వాణిజ్య వలయాలను నియంత్రించటంలో కేంద్ర రిజర్వు బ్యాంకుల పరిణితికి నిదర్శనంగా ఆయన ఈ పదబంధాన్ని ఉపయోగించారు. 2006లో బెర్నాంకే అమెరికా రిజర్వు బ్యాంకు అధ్యక్షునిగా నియమితులయ్యారు. 2007లో వడ్డీ రేట్లు పెంచటంతో అప్పటి వరకు కొనసాగుతున్న మరో గాలి బుడగ బద్దలయ్యింది. 'గొప్ప సంయమనం' విఫలమైంది.

ఫలితంగా స్వీజీ, మాగ్డాఫ్‌లు హెచ్చరించినట్లుగానే, "అనూహ్య పరిస్థితుల్లో నూతన స్థితి నెలకొంది". తాజా సంక్షోభ సమయంలో లక్షల కోట్ల ప్రజా ధనాన్ని బహుళజాతి కంపెనీల ఖాతాల్లోకి తరలించి సంపన్న వంతుల ద్రవ్య సంపద విలువను కాపాడినప్పటికీ జరగాల్సిన నష్టం జరిగింది. పై స్థాయిలో పెట్టుబడి నిల్వలు కాపాడబడ్డప్పటికీ బ్యాంకులు రుణాల మంజూరు నిలిపి వేశాయి. తద్వారా పెట్టుబడి పోగుపడే క్రమం బలహీనపడటంతో మరో గాలిబుడగ ఆర్థిక వ్యవస్థలో ఏర్పడకుండా ప్రస్తుతానికి నిలువరించగలిగారు. వడ్డీ రేట్లు సున్నాకు చేరటంతో ద్రవ్య విధానం నిరుపయోగమైంది. తాజా సంక్షోభం ఫలితంగా నిజమైన ఆర్థిక వ్యవస్థలో వేళ్లూనుకున్న స్థబ్దత ద్రవ్యపెట్టుబడి మేఘాలను చీల్చుకుని ముందుకొచ్చింది.

1980లో స్థూల జాతీయోత్పత్తిలో ద్రవ్య, ద్రవ్యేతర కార్పొరేట్ రుణాల వాటా బాగా పెరిగింది. అయితే 1987-2007 మధ్యకాలంలో ద్రవ్య కార్పొరేట్ రుణాలు అనూహ్యంగా పెరగటంతో ఈ కాలంలో ఆర్థిక వ్యవస్థ ద్రవ్యీకరించబడింది. మూడు దశాబ్దాల కాలంలో ద్రవ్య కార్పొరేట్ రుణాల వాటా స్థూల జాతీయోత్పత్తిలో 20 శాతం నుండి 116 శాతానికి పెరిగింది. 2007-2009 మధ్య కాలంలో ఈ ప్రక్రియ కొంత వెనుకపట్టు పట్టింది. ఈ విధంగా ద్రవ్య కార్పొరేట్ రుణాలను అదుపులో పెట్టడం ద్వారానే ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న స్థబ్దతను తాత్కాలికంగా నిలువరించగలిగారు. ఈ పరిస్థితుల్లో వర్తమాన ఆర్థిక చరిత్రను స్థబ్దత-ద్రవ్యీకరణ దశగా నిర్ధారించవచ్చు. ద్రవ్యరంగంలో గాలిబుడగలు లేకుండా గత రెండు మూడు దశాబ్దాల్లో పెట్టుబడిదారీ వ్యవస్థ వృద్ధి రేటు మందగించి ఉండేదనటంలో సందేహం లేదు. మిగిలిన గాలిబుడగలలాగానే తాజా గాలిబుడగలు కూడా బద్దలయ్యే వరకూ ఆర్థిక వ్యవస్థ అంతటా విస్తరిస్తూ వచ్చాయి. అటువంటి గాలిబుడగలు బద్దలయ్యాక స్థబ్దతకు లోనయ్యే అవకాశాలు తీవ్రమవుతున్నాయి.

దశాబ్దాల తరబడి పరుగులెత్తిన ద్రవ్యరంగ గాలిబుడగలు ప్రస్తుతానికి నిదానించాయి. ద్రవ్య కంపెనీలు తమ రుణభారం తగ్గించుకుంటున్నాయి. తాజా సంక్షోభం నుండి ద్రవ్య వ్యవస్థలు బతికి బట్టకలిగాయి. అదేసమయంలో ద్రవ్య సంపన్నుల సంపద కూడా నిలకడగానే ఉంది. గత రెండు మూడు దశాబ్దాలతో పోల్చి చూస్తే ప్రస్తుతం ద్రవ్యీకరణ వేగం తగ్గింది. 2009లో మేము రాసిన పుస్తకం "ది గ్రేట్ ఫైనాన్షియల్ క్రైసిస్"లో చెప్పినట్లుగానే 2007-2009 మధ్యకాలంలో చోటుచేసుకున్న సంక్షోభం "ద్రవ్యీకరణ సాధారణ సంక్షోభం దశ నుండి స్థబ్దత భూతం ఆర్థిక వ్యవస్థలను ఆవహించనుంది".

### స్థబ్దత నేడు ఎలా కనిపిస్తోంది?

ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మూల స్థంభాలు అనదగ్గ దేశాల్లోనే ద్రవ్యీకరణ బలహీనపడటంతో ఆర్థిక వ్యవస్థలు స్థబ్దత కబంధ హస్తాల్లో చిక్కుకుపోయినపుడు ఈ పరిణామాన్ని మరింత విపులంగా అధ్యయనం చేయాలి. ఆర్థిక విశ్లేషణలో ద్రవ్యీకరణ ఆర్థిక వేత్తల దృష్టినాకర్షించినంతగా స్థబ్దత ఆకర్షించలేదు.

కార్మికవర్గం దృష్టి నుండి చూసినపుడు స్థబ్దత అంటే ఉపాధి అవకాశాల కుదింపు, వేతనాలు పెరగకపోవటం. ఉపాధి అవకాశాల్లో వస్తున్న మార్పులు గమనిస్తే ఆర్థిక వ్యవస్థలు స్థబ్దతకు లోనయ్యాయని ఘంటాపథంగా చెప్పవచ్చు. 1950-60 దశకంలో అమెరికాలో నిరుద్యోగం 4.6 శాతం ఉండగా 1970 నాటికి 6.4కి పెరిగింది. ఈ కాలంలో కేవలం నిరుద్యో గం పెరగటమే కాదు. కార్మికవర్గాన్ని దోపిడీ చేయటంలో అనేక నూతన ధోరణులు, కోణాలు ముందుకొచ్చాయి.


పెట్టుబడిదారీ వ్యవస్థ లక్షణానికి అనుగుణం గానే కంపెనీల పరమయ్యే మిగులును పెంచటం ఈ కాలంలో చూశాము. దీంతో పాటు సంపద, ఆదాయం కేంద్రీకరణ కూడా జరిగింది. వాస్తవానికి ఆర్థిక వ్యవస్థలో ఒక విషవలయం మొదలైంది. అదేమంటే 1. ఒక వైపున పెరుగుతున్న మిగులను పెట్టుబడిగా మార్చుకోవటానికి తగిన అవకాశాలు లేకపోవటంతో వృద్ధి రేట్లు పడిపోయాయి. స్థబ్దత చోటు చేసుకుంది. 2. ఈ పరిస్థితుల్లో సామాజిక ఉత్పత్తిలో సాధ్యమైనంత ఎక్కువ వాటా స్వంతం చేసుకోవటానికి ప్రైవేటు పెట్టుబడిదారులు

చేయగలిగిందంతా చేశారు. 3. దీని పర్యవసానంగా ఆర్థిక వ్యవస్థ లో శీర్షస్థానంలో మరింతగా సంపద కేంద్రీకృ తం కావటంతో అలా పోగుపడ్డ మిగులను కూడా వినియోగించుకోలేని స్థితి తలెత్తింది.

ఆర్థిక వ్యవస్థ మందగించటంతో సంపన్న వర్గాలు మరింత ఎక్కువ సంపద, ఉత్పత్తి ఫలాలను తమ స్వంతం చేసుకుని కార్మికవర్గానికి అతి తక్కువ ఫలాలు వదిలిపెట్టడం జరిగింది. ఆదాయం, సంపద గురించిన వివరాలు మాత్రమే కాదు. పెరుగుతున్న ఆకలి, క్షీణిస్తున్న ఆరోగ్యం, నివాస స్థలాలు లేకపోవటం, వ్యక్తిగత దివాళాలు వంటి అంశాల్లో కూడా సంపద కేంద్రీకరణ పర్యవసానాలు కనిపిస్తున్నాయి. కార్మికవర్గానికి ఇది గడ్డు కాలం. ప్రత్యేకించి కొత్త ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న వాళ్లకు, అసంఘటిత కార్మికులకు ఇది క్లిష్ట సమయం. సంక్షోభం సమయంలో నష్టపోయిన ఉపాధి అవకాశాలు సంక్షోభానంతర కాలంలో కనపడక పోవటంతో ఈ వలయం రాను రాను ఉపాధి రహిత ఆర్థికాభివృద్ధిగా మారింది. వరుస సంక్షోభాల తర్వాత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది. కానీ సదరు సంక్షోభంలో ఉపాధి కోల్పోయిన వారికందరికీ పని కల్పించేలా ఆ అభివృద్ధి ఉండటం లేదు. ఇదే పరిస్థితి ఆర్థిక తిరోగమనం తర్వాత కాలంలో స్థూల జాతీయోత్పత్తికి కూడా వర్తిస్తుంది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అమెరికా, జపాన్, యూరప్‌లు ఆర్థిక తిరోగమనం నుండి వేగంగా బయట పడ్డాయి. దాంతో ఆయా దేశాల్లో ఉపాధి కల్పన కూడా వేగవంతమైంది. దీనికి భిన్నంగా గత మూడు సందర్భాల్లో ఆర్థిక వ్యవస్థ తిరోగమనం నుండి బయట పడటానికి చాలా సమయం తీసుకొన్నది.

స్థూల జాతీయోత్పత్తిని పరిశీలిస్తే 1950, 60 దశకంలో 4 శాతంగా ఉన్న జిడిపి 1970–90 దశకం మధ్య కాలంలో 3 శాతానికి, 2000 అనంతరం 2 శాతానికి పడిపోయింది. స్థూల జాతీయోత్పత్తిని లెక్కించటానికి ఆర్థిక వ్యవస్థలో నాలుగు అంశాలు కీలకంగా పరిశీలించాలి. అవి, ఎ. వాణిజ్య సంస్థలు తమ వాణిజ్య కార్యకలాపాల్లో వెచ్చించే ధనం, బి. ప్రజా వ్యయం, 3. నికర ఎగుమతులు, 4. వివిధ స్థాయిల్లో ఉన్న ప్రభుత్వాల ద్వారా జరిగే వ్యయం, పెట్టుబడులు. ఈ నాలుగు అంశాల్లో ఏ అంశంలో పతనం చోటు చేసుకున్నా స్థూల జాతీయోత్పత్తి పతనం అవుతుంది. గత మూడు దశాబ్దాల్లో ద్రవ్యోల్బణం పెచ్చరిల్లినపుడు మినహా మిగిలిన

“ఆర్థిక వ్యవస్థ మందగించటంతో సంపన్న వర్గాలు మరింత ఎక్కువ సంపద, ఉత్పత్తి ఫలాలను తమ స్వంతం చేసుకుని కార్మికవర్గానికి అతి తక్కువ ఫలాలు వదిలిపెట్టడం జరిగింది. ఆదాయం, సంపద గురించిన వివరాలు మాత్రమే కాదు. పెరుగుతున్న ఆకలి, క్షీణిస్తున్న ఆరోగ్యం, నివాస స్థలాలు లేకపోవటం, వ్యక్తిగత దివాళాలు వంటి అంశాల్లో కూడా సంపద కేంద్రీకరణ పర్యవసానాలు కనిపిస్తున్నాయి.”




సమయాల్లో ఈ నాలుగు అంశాల్లో వ్యయం కుడిఎడంగా ఒకే రీతిలో కొనసాగుతూ వచ్చింది. కానీ వాస్తవిక స్థూలజాతీయోత్పత్తిలో పతనం కనిపిస్తోంది. ఈ పతనమే తిరోగమనం. మహా తిరోగమన కాలంలో (2008 సంక్షోభం అనంతర కాలం) సాధారణ స్థూల జాతీయోత్పత్తిలో కూడా పతనం కనిపిస్తోంది. తాజాగా అందు బాటులో ఉన్న గణాంకాలు పరిశీలిస్తే వ్యక్తిగత వినిమయం స్థూల జాతీయోత్పత్తిలో మూడింట రెండు వంతులు ఉంటుంది. ప్రభుత్వ వ్యయం ఆర్థిక వ్యవస్థ ముందుకెళ్లటానికి అవసరమైన రంగం సిద్ధం చేస్తుంది. అయితే ఈ కాలంలో పొదుపు చర్యలు, సంక్షేమ వ్యయంపై వేటు, ఇతర ప్రజా సేవల కుదింపు వంటి విధాన నిర్ణయాలతో ఇటు ప్రభుత్వ వ్యయం గణనీ యంగా తగ్గటంతో ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకెళ్లగలిగిన శక్తి క్షీణించింది.

స్థూల జాతీయోత్పత్తి వృద్ధిలో ప్రభుత్వ వ్యయం, వ్యక్తిగత వినిమయం పెద్ద పాత్ర పోషిస్తున్నా ప్రైవేటు పెట్టుబడి వినియోగంలో పెద్దఎత్తున వ్యత్యాసాలు వచ్చాయి. భవిష్యత్తు వృద్ధి రేట్లకు ఈ ప్రైవేటు పెట్టుబడి వినియోగమే ముఖ్యమైనది. ఆర్థిక వ్యవస్థ తిరోగమిస్తున్న కాలంలో ప్రైవేటు పెట్టుబడి వినియోగం తగ్గటం మొత్తంగా స్థూల జాతీయోత్పత్తిని తగ్గించేస్తుంది. అదేవిధంగా ఆర్థిక వ్యవస్థ కోలుకునే సమయంలో పెద్దఎత్తున ప్రైవేటు పెట్టుబడులు జిడిపి వృద్ధికి తోడ్పడతాయి.

**మిగులు వినియోగం–పెట్టుబడి వినిమయం**

ఆర్థిక వ్యవస్థలో పోగుపడిన ఉత్పాదక సామర్థ్యం సంపూర్ణంగా వినియోగంలోకి రాక పోవటంతో వాణిజ్య పెట్టుబడులు, లేదా పెట్టుబడి సంచయంలో ఎదుగుదల, పతనం కనిపిస్తుంటాయి. 1960–70 మధ్య కాలంలో అమెరికా ఆర్థిక వ్యవస్థలో వస్తూత్పత్తిరంగ స్థాపక సామర్థ్యంలో 85 శాతం సామర్థ్యాన్ని వినియోగంలోకి తీసుకురాగలిగింది. 1980 దశకంలో ఇది 80 శాతానికి పడిపోయి 1990 దశకం నాటికి 81 శాతానికి చేరింది. గత దశాబ్దకాలంలో ఇది మరింత పతనం అయి 75శాతం స్థాపక సామర్థ్యాన్ని మాత్రమే వినియో గించుకోబడుతోంది.

ఫలితంగా అమెరికా వాణిజ్య సంస్థల వద్ద లక్షల డాలర్ల మిగులు నిధులు పోగుపడ్డాయి. 1995 నుండి 2010 వరకు సంవత్సరానికి 10 శాతం చొప్పున అమెరికా కంపెనీల చేతుల్లో మిగులు నిధులు పోగుపడుతూ వచ్చాయి. దాంతో దాదాపు 5 లక్షల కోట్ల (ట్రిలియన్) డాలర్ల రిజర్వు నిధులు ప్రస్తుతం అమెరికా

> **“ కంప్యూటర్ వచ్చాక సమాచారం ఇచ్చిపుచ్చుకోవటంలోనూ, కార్యాలయ నిర్వహణలోనూ పెద్దఎత్తున మార్పులు వచ్చాయి. దాంతో ఏ కొత్త వాణిజ్యకార్యకలాపాలు తెరమీదకు వచ్చినా వాటి వల్ల కార్మికులకు ఉపాధి దొరికే అవకాశాలు నామమాత్రంగా ఉన్నాయి. ”**

కంపెనీల చేతుల్లో ఉన్నాయి. అమెరికా స్థూల జాతీయోత్పత్తిలో ఇది మూడోవంతుతో సమానం. 2013 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసంలో అమెరికా కంపెనీలు పన్నులు చెల్లించిన తర్వాత కూడా 11.1 శాతం లాభాలు స్వంతం చేసుకున్నాయి. 1990 నుండి ఈ కంపెనీలు సంపాదించిన లాభాల రేటుకు ఇది రెట్టింపు. అందువల్లనే వాల్‌స్ట్రీట్ జర్నల్ 'పెట్టుబడి తగ్గిపోయినపుడు లాభాలు పెరగటం' ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్య అని వ్యాఖ్యానించింది.

ఒక వేళ కంపెనీలు తమ చేతుల్లో పోగుపడ్డ మిగులు పెట్టుబడిని వినియోగించాల్సి వచ్చినా ఇతర కంపెనీల్లో వాటాలు కొనుగోలు చేయుట మో, వ్యవస్థాపకుల వాటాలు పెంచటమో, లేదా షేర్‌హోల్డర్లకు డెవిడెండ్లు పంచటమో వంటి ఉత్పత్తితో సంబంధం లేని అవసరాలకోసం వెచ్చిస్తున్నారు తప్ప ఉత్పాదక అవసరాలకు వెచ్చించటం లేదు. ఒక్క 2013లోనే కంపెనీలు తమ కంపెనీల్లో వాటాలు తామే కొనుగోలు చేసేందుకు (తద్వారా స్టాక్‌మార్కెట్‌లో కదలిక తెచ్చేందుకు, గాలిపెట్టుబడులు ఆహ్వానించేందు కు) 755 శతకోటి (బిలియన్) డాలర్లు వెచ్చించా యి. ఉత్పాదకత పెంచే దిశగా కాకుండా ఊహాజనిత వాణిజ్య కార్యకలాపాల్లో ఈ పెట్టుబడులు ఖర్చు కావటం అంటే ఆర్థిక వ్యవస్థ తన సామర్థ్యం కంటే తక్కువగా పనిచేయటమే. అదేసమయంలో కంపెనీలు కూడా కార్మికులను తగ్గించుకోవటానికీ, ఉత్పత్తి వ్యయం నియంత్రించటానికీ చర్యలు చేపట్టడం తో కంపెనీల వద్ద మరిన్ని మిగులు నిధులు పోగుపడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పోగుపడు తున్న పెట్టుబడులు మొత్తంగా ఆర్థిక వ్యవస్థకు ప్రాణం పోయటానికి ఉపయోగపడవు.

ఈ పరిణామాలు పరిశీలిస్తే పెట్టుబడి కేంద్రీకరణకు అప్పటికే పోగుపడ్డ పెట్టుబడి ప్రధాన అవరోధంగా ఉందని స్పష్టమవుతుంది.



పాల్ స్వీజీ

ఈ అవరోధం వల్లనే వృద్ధి రేటు పతనం అవుతోంది. తదనుగుణంగానే ఈ కాలంలో ఆర్థిక వ్యవస్థకు ఇంధనంగా పని చేయాల్సిన పెట్టుబడుల వృద్ధి రేటు గణనీయంగా తగ్గిపోయింది. 1960–70 నుండి 2010–13 మధ్య చూస్తే నివాసేతర స్థిర పెట్టుబడి పెరుగుదల రేటు 6.4 శాతం నుండి 2.3 శాతానికి తగ్గిపోయింది.

**బయటపడే మార్గం ఉందా?**

స్థబ్దత–ద్రవ్యీకరణ కబంధ హస్తాల నుండి అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు బయటపడతాయా అన్న సందేహం తొలుస్తోంది. 2014లో వాషింగ్టన్ పోస్ట్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో లారీ సమ్మర్స్ “నిలకడగా స్థబ్దతకు లోనైన ఆర్థిక వ్యవస్థలో గాలిబుడగలు ఏర్పడేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి” అన్నారు. ఆర్థిక వ్యవస్థలో కదలిక తీసుకురాగలిగే బాహ్య కారణాలు లేనప్పుడు తాత్కాలికంగా వృద్ధి రేటు కొనసాగించేందుకు స్థబ్దత నుండి బయట పడే ప్రయత్నం చేసేందుకు ఊహాజనిత వాణిజ్య కార్యకలాపాలకు పెద్ద పీట వేయాల్సి వస్తుంటుంది. మరో సంక్షోభం తెరమీదకు వచ్చేంతవరకూ ఈ పరిస్థితి కొనసాగుతుంది.

ఆర్థిక వ్యవస్థకు చోదకశక్తిగా పని చేయాల్సిన పెట్టుబడి పోగుపడే ప్రక్రియ నేడు కకావికలైంది. కొత్తగా ఉత్పాదక సామర్థ్యాన్ని తోడు చేసుకునేందుకు కంపెనీలు వెనకాడుతున్నాయి. కాస్తో కూస్తో ఈ పని చేసినా దానికి అవసరమైన నిధులు తరుగుదల నిధుల నుండి సమకూర్చుకుంటున్నాయి తప్ప తమ వద్ద పోగుపడ్డ పెట్టుబడి నిల్వల నుండి ఖర్చు చేయటం లేదు. ఆర్థిక వ్యవస్థను స్థబ్దత నుండి బయటపడేయటానికి కొత్త సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణల్లో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉన్నా ఈ ప్రయత్నాలు మొత్తంగా ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపలేవు. వీటి ప్రభావం కొన్ని రంగాలకు మాత్రమే పరిమితం అవుతుంది. ప్రత్యేకించి ఉపాధి కల్పనలో వీటి పాత్ర, ప్రభావం పరిమితం.

కంప్యూటర్ వచ్చాక సమాచారం ఇచ్చిపుచ్చుకోవటంలోనూ, కార్యాలయ నిర్వహణలోనూ పెద్దఎత్తున మార్పులు వచ్చాయి. దాంతో ఏ కొత్త వాణిజ్యకార్యకలాపాలు తెరమీదకు వచ్చినా వాటి వల్ల కార్మికులకు ఉపాధి దొరికే అవకాశాలు నామమాత్రంగా ఉన్నాయి. 'మహా స్థబ్దత' అన్న తన గ్రంథంలో టైలర్ కోవెన్ చెప్పినట్లు : “గతంలో సాంకేతిక ఆవిష్కరణల ద్వారా వచ్చినన్ని ఉపాధి అవకాశాలు ఇంటర్నెట్ రంగంలో వచ్చే మార్పులు ద్వారా రావు. ఫోర్డ్, జనరల్ మోటార్స్ కంపెనీలు ఎదిగే క్రమంలో లక్షలాది మందికి ఉపాధి దొరికింది. డెట్రాయిట్ నగరం అమెరికాలోనే ప్రముఖ నగరంగా అభివృద్ధి చెందింది. నేడు ఫేస్‌బుక్ కంపెనీ స్టాక్ విలువ ఎంత పెరిగినా క్షీణ సంస్కృతికి వేదికగా ఉందే తప్ప కంపెనీ కార్యాలయం ఉన్న పాలో అల్టో ప్రాంతానికి ఒరిగిన మేలు ఏమీ లేదు. చాలా భాగం వరకు పని సాఫ్ట్‌వేర్ సర్వర్లే చేసిపెడుతున్నాయి. మనుషులతో పని లేకుండా పోతోంది. నిజమైన పని ఏదన్నా జరుగుతుంది అంటే ఫేస్‌బుక్ వాడేవాళ్లే కాలక్షేపం కింద కాస్త సమయం వెచ్చిస్తున్నారు”.

2013 నాటికి ఆపిల్ కంపెనీలో 30వేల మంది, గూగుల్‌లో 40,000 మంది ఉద్యోగులు ఉంటే ఫేస్‌బుక్‌లో 4600 మంది ఉద్యోగులు మాత్రమే ఉన్నారు. 45 మంది పని చేస్తున్న వాట్సప్ అనే కంపెనీని ఫేస్‌బుక్ 19 బిలియన్ డాలర్లు పెట్టి కొన్నది. ఈ కంపెనీ తయారు చేసిన సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫారం సమా చారం పంపుకోవటానికి మాత్రమే ఉపయోగ పడుతోంది. స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు పెద్ద ఎత్తున కార్మికుల కడుపు కొట్టాయి. ఈ కంపెనీల వల్ల కాస్తో కూస్తో ఉపాధి కలిగింది అంటే ఇది విదేశాల్లోనే. అమెరికాలో కాదు. ఇంటర్నెట్ ద్వారా వాణిజ్యం చేసే కంపెనీలు కూడా కార్మి

**" నేడున్న వ్యవస్థలో తేలికైన ప్రత్యామ్నాయాలు ఏమీ లేవు. మొత్తంగా వ్యవస్థ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నపుడు సంస్కరణవాద పరిష్కారాల సామర్థ్యం కూడా తగ్గిపోతుంది. కొందరు కీన్స్ తరహా పరిష్కారం ప్రతిపాదిస్తున్నారు. అంటే ఉపాధి కల్పన, గిరాకీ కల్పనలో ప్రభుత్వమే నిర్ణాయక పాత్ర తీసుకోవాలి. మొత్తంగా పెట్టుబడిదారీ వర్గం ద్రవ్యపెట్టుబడి దారీ వర్గంగా మారిన ఈ తరుణంలో ఇటువంటి ప్రత్యామ్నాయం అంత తేలిక కాదు. "**

కుల ఉద్యోగాలు ఊడగొట్టటంలో ప్రముఖ పాత్రే పోషిస్తున్నాయి. "అమెరికా జనాభా లెక్కల ఆధారంగా ఇనిస్టిట్యూట్ ఫర్ లోకల్ సెల్ఫ్ రిలయన్స్ సంస్థ నిర్వహించిన అధ్యయనంలో ఇంటర్నెట్ వాణిజ్యం చేసే కంపెనీలు సంపాదించే ప్రతి 1 కోటి డాలర్లకు కేవలం 47 మంది కార్మికులు మాత్రమే పని చేస్తున్నారు. అమెజాన్ కంపెనీ సంపాదించే ప్రతి కోటి డాలర్లకు 14 మంది ఉద్యోగులు మాత్రమే పని చేస్తున్నారు." ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నిర్వ హించిన మరో అధ్యయనంలో మొబైల్ రోబోట్లు, కృత్రిమ ఇంటెలిజెన్స్ వ్యవస్థల కారణంగా లక్ష లాది ఉద్యోగ అవకాశాలు రానున్న దశాబ్దాల్లో ప్రమాదకర పరిస్థితిలో పడనున్నాయి. ఈ కొత్త ప్రయోగాలు, ఆవిష్కరణలు ఉపాధి కల్పనపై ఎంత ప్రతికూల ప్రభావం చూపిస్తున్నప్పటికీ మొత్తంగా ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టగలిగిన శక్తి సామర్థ్యాలు వీటికి లేవు.

జర్మనీ కాస్తో కూస్తో కుదుటపడింది అంటే కారణం, ఆ దేశం ఎగుమతుల ద్వారా నికర ఆదాయం సంపాదించుకోగలగటమే. అయితే అన్ని దేశాలూ ఎగుమతిదారులు కాలేవు. కావటం అసాధ్యం. 1990లో కొద్ది కాలం మినహాయిస్తే అమెరికా 1980 దశకం నుండీ నికర దిగుమతిదారుగా ఉంది.

ప్రస్తుతానికి ద్రవ్య పెట్టుబడి రంగాన్ని విస్తరించటం నేడున్న స్థబ్దత నుండి ఆర్థిక వ్యవస్థ తాత్కాలికంగానైనా బయట పడటానికి ఒక మార్గంగా కనిపిస్తోంది. అయితే సంక్షోభం ప్రభావం ఇంకా గణనీయంగానే ఉంది. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లో జరుగుతున్న పరిణామాలను ఈ విధంగా అర్థం చేసుకోవాలి. ద్రవ్య పెట్టుబడికి అవసరమైన నిధులు మళ్లించేం దుకు ఆర్థిక వ్యవస్థలో సాధారణ ఆర్థిక కార్య కలాపాలను నియంత్రించటం అవసరం. అందు కనే పొదుపు చర్యల ద్వారా అమెరికా, యూరప్ దేశాల్లో ఈ పని జయప్రదంగా సాగుతోంది. ఈ విధంగా ద్రవ్యరంగానికి అవసరమైన నిధులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వాలు చూస్తు న్నాయి. క్రమంగా ద్రవ్యపెట్టుబడి రంగంలో ఆస్తులు, అప్పుల మధ్య విలోమ సంబంధాన్ని సరి చేసేందుకు కూడా ప్రయత్నాలు జరుగు తున్నాయి. ఈ దిశగా ప్రభుత్వ రుణాలు తగ్గించటం ప్రథమ ప్రాధాన్యత కలిగిన చర్యగా ఉంది. తద్వారా పతనం అయ్యే అవకాశం లేని పెద్ద కంపెనీలు పతనం అయ్యే పరిస్థితి వస్తే వాటిని ఆదుకోవటానికి అవసరమైన నిధులు ప్రభుత్వాల వద్ద ఉండాలని ద్రవ్యపెట్టుబడి రంగం ఆశిస్తోంది. ఈ పరిణామాలు తాత్కాలికంగానైనా ఆర్థిక వ్యవస్థను పట్టాలు ఎక్కించేందుకు ఉపయోగపడవచ్చు. అయితే ఇది ఒక్కరోజులో జరిగే పని కాదు. నిదానంగా జరగాల్సిన పని. ఈ కాలంలో మితిమీరిన పెట్టుబడిసంచయం ప్రక్రియపై ప్రతికూల ప్రభావాలు పడే అవకాశాలు కూడా లేకపోలేదు. తద్వారా భవిష్యత్తులో తెరమీదకు రానున్న గాలిబుడగలు బద్దలయితే భరించలేనంత నష్టం జరిగే అవకాశాలూ లేకపోలేదు.

తాజా ఆర్థిక సంక్షోభానికి కారణం పెట్టుబడి సంచయం ప్రక్రియలో ఉన్న వ్యవస్థాగత బలహీనతలు కాదు మితిమీరిన ఊహాజనిత ఆర్థిక కార్యకలాపాలు అన్న అవగాహనతో ఆర్థిక రంగంలో కొందరు ప్రగతిశీలురు ప్రస్తుతానికి ద్రవ్యపెట్టుబడి రంగంలో సంస్కరణలు రావాలని ప్రతిపాదిస్తున్నారు. 1980–2007 మధ్య కాలంలో ఆర్థిక వ్యవస్థను పెద్దఎత్తున కదలించటంలో ద్రవ్యీకరణ ప్రక్రియ పోషించిన పాత్రను వీరు గుర్తించనిరాకరిస్తున్నారు. ద్రవ్య వ్యవస్థలో నియంత్రణల రద్దు అందరూ అనుకుంటున్నట్లుగా అత్యాశతోనో, అవినీతిపర్యవసానంగానో, తప్పుడు ఆర్థిక సూత్రాలపై ఆధారపడో జరిగింది కాదు. రానున్న కాలంలో మరిన్ని ఆర్థిక గాలిబుడగల సృష్టి లక్ష్యంగా సాగిన విధాన నిర్ణయాలే అని గుర్తించటంలో ఈ మేధావులు విఫలం అవుతున్నారు. ద్రవ్య పెట్టుబడి నియంత్రణ బాధ్యతలు చూస్తున్న వారంతా ఈ గాలిబుడగలు తమ పర్యవేక్షణలో బద్దలు కాకుండా ఉండేలా జాగ్రత్త పడుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నించలేదు. నూతన మార్కెట్ అవకాశాలు సంపాదించేందుకు అవసరమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఇవ్వాలని ద్రవ్య పెట్టుబడి సంస్థలు డిమాండ్ చేసినపుడు ఈ నియంత్రణాధికారాలు కలిగిన పెద్దలు అడిగినదానికంటే ఎక్కువ అవకాశాలు ఇచ్చారు.

థామస్ పాలే అనే రచయిత తన పుస్తకం "ద్రవ్య సంక్షోభం నుండి స్థబ్దత వరకు"లో ఈ పరిణామాన్ని "ద్రవ్యసంస్కరణల్లో పరస్పర విరుద్ధ పరిస్థితి" అని వ్యాఖ్యానించారు. అంతే కాదు, ఈ తరహాలో ఆర్థిక వ్యవస్థను సుస్థిర పర్చాలన్న ప్రయత్నం "అనివార్యంగా ద్రవ్యపెట్టుబడి క్రియాశీలతను నియంత్రించటం ద్వారా ఆర్థిక వ్యవస్థను మరింత స్థబ్దతకు లోను చేస్తుంది" అని అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని మరింత స్పష్టం చేస్తూ క్రుగ్‌మన్ "ఈ పరిస్థితి బాధ్యతారహితమైన పరపతిని కట్టడి చేయవచ్చు. కానీ ఏదో ఒకరకమైన వ్యయం ఆర్థిక వ్యవస్థలో కదలికకు అవసరం అయినపుడు ఇలా ద్రవ్య లభ్యత కట్టడిచేయటం ఇబ్బంది కలిగిస్తుంది" అన్నారు. ఈ పరిస్థితులన్నీ గమనించినపుడు ద్రవ్య వ్యవస్థల నియంత్రణ కంటే నియంత్రణా రాహిత్యానికే పాలకులు, విధాన నిర్ణేతలు పెద్దపీట వేస్తున్నట్లు కనిపిస్తుంది.

ఇదంతా చెబుతున్నంత మాత్రాన ఇక ఏమీ చేయలేమన్న నిర్ధారణకొచ్చినట్లు కాదు. నేడున్న వ్యవస్థలో తేలికైన ప్రత్యామ్నాయాలు ఏమీ లేవు అన్నది అంగీకరించాల్సిన విషయం. మొత్తంగా వ్యవస్థ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నపుడు సంస్కరణవాద పరిష్కారాల సామర్థ్యం కూడా తగ్గిపోతుంది. కొందరు కీన్స్ తరహా పరిష్కారం అమలు చేయాలని ప్రతిపాదిస్తున్నారు. అంటే ఉపాధి కల్పన, గిరాకీ కల్పనలో ప్రభుత్వమే నిర్ణాయక పాత్ర తీసుకోవాలి. నేడు పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా ఉపాధి కల్పన అవకాశాలు కల్పించాలన్న వాదన రూపంలో ప్రభుత్వ జోక్యం గురించిన చర్చ జరుగుతోంది. మొత్తంగా పెట్టుబడిదారీ వర్గం ద్రవ్యపెట్టుబడి దారీ వర్గంగా మారిన ఈ తరుణంలో ఇటువంటి ప్రత్యామ్నాయం అంత తేలిక కాదు.

నేడు బహుళ సాంకేతిక సంపన్నులు ఇటు ప్రభుత్వం మీద అటు ఆర్థిక వ్యవస్థ మీద పెత్తనం చలాయిస్తున్నారు. వీళ్లు ఉత్పత్తి ద్వారా వచ్చే ఆదాయంపై కంటే ఉత్పత్తేతర లావాదేవీల ద్వారా వచ్చే ఆదాయంపై ఆధారపడుతు

**“పెట్టుబడి లాభాపేక్షకంటే ప్రజల కనీస అవసరాలు, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వటం ద్వారా కూడా ఈ లక్ష్యాలను సాధించవచ్చు. స్థబ్దతకు ప్రత్యామ్నాయంగా “నిరుద్యోగులకు ఉపాధి కల్పించటం, ఆకలిగొన్న వారికి ఆహారం అందుబాటులోకి తేవటం, ఇళ్లు లేని వారికి ఇళ్లు నిర్మించటం, సరైన ఆరోగ్య సంరక్షణ విధానాలు అమలు చేయటం, ఆర్థిక, ఆదాయ భద్రత మార్గాలు అన్వేషించటం, అమలు చేయటం” వంటి లక్ష్యాల సాధన దిశగా అడుగులు వేయటం అవసరం.”**

న్నారు. ఈ క్రమంలోనే శ్రమ శక్తి అత్యంత కారుచౌకగా దొరికే ప్రాంతాలకు ఉత్పత్తి వ్యవస్థలు బదిలీ జరుగుతోంది. తద్వారా పిడికెడు బహుళజాతి కంపెనీలు సామ్రాజ్య వాదం తరహాలో ఈ శ్రమశక్తిని దోపిడీ చేయటంలో గుత్తాధిపత్యం సంపాదించాయి. ఈ పరిస్థితుల్లో కీన్స్ ఆర్థిక సూత్రాలు యథాతథంగా అమలు జరగటానికి గల అవకాశాలు తక్కువగా ఉన్నాయి.

కీన్స్ చెప్పినట్లు పూర్తి స్థాయి ఉపాధి కల్పన ప్రతిపాదనే పెట్టుబడిదారీ వర్గాలకు కంటగింపుగా ఉంది. ఈ ప్రతిపాదన అమలు చేయటం అంటే కార్మికవర్గాన్ని శక్తివంతులను చేయటమే. ఒకప్పటి కీన్స్ యువ సహచరుడు జోవాన్ రాబిన్సన్ చెప్పినట్లు, “పెట్టుబడిదారీ వ్యవస్థలోని దుర్లక్షణాలను సరిచేయగల శక్తి సామర్థ్యాలు ఉన్న ఏ ప్రభుత్వమయినా మొత్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థనే నిర్మూలిస్తుంది.”

గిరాకీ సృష్టించటం ద్వారా ఆర్థిక వ్యవస్థలో కదలిక తేవటానికి కీన్సియన్ ఆలోచనలను అంగీకరించే వారు ముందుకు తెచ్చే మరో ప్రతిపాదన సంక్షేమ వ్యయం పెంచటం ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గించటం. తక్కువ ఆదాయాలు వచ్చే కుటుంబాలు తమ అవసరాలు తీర్చుకోవటానికి ఎక్కువ మొత్తంలో ఖర్చు పెడతారు. సంపన్నులు అంత ఎక్కువ మొత్తం ఖర్చు చేయాల్సిన అవసరం రాదు. సంపన్నుల నుండి పేదలకు ధనం బదిలీ చేయ టం ద్వారా ఆర్థికవ్యవస్థలో కదలిక తేవచ్చు అన్నది సిద్ధాంతరీత్యా సరైన ప్రతిపాదనే. దీనికోసం సంపన్నులపై పన్నులు విధించవచ్చు. ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయవచ్చు. కార్మికుల వేతనాలు పెంచవచ్చు. కనీసవేతనాల అమలు రాజకీయంగా సాధ్యమే అనిపిస్తున్నప్పటికీ ఈ నిర్ణయం వల్ల (అమెరికాలో) లబ్ధిపొందగలిగేది కేవలం కోటి 60 లక్షల మంది కార్మికులు మాత్రమే. ఈ నిర్ణయం మొత్తంగా ఆర్థిక వ్యవస్థలో కదలిక తేవటం అటుంచి కనీస గిరాకీనికూడా సృష్టించలేదు. ఉన్న వ్యవస్థలోనే ప్రత్యామ్నాయాలు చూడటం – సంపన్నులపై పన్నులు విధించి ఆ నిధులను పేదల ప్రయోజనాల కోసం ఖర్చు పెట్టడం వంటివి– స్థూలంగా వర్గ దృక్పథంతో పెట్టుబడి కేంద్రీకరణలో ఉన్న సమస్యను చూడ నిరాకరిస్తూ తాత్కాలిక పరిష్కారాలతో పెట్టుబడిదారీ వ్యవస్థకు ఊపిరి పోసే ప్రయత్నమే తప్ప మరోటి కాదు. ఒక వేళ ఇటువంటి విధానాలు అమలు జరిపినా పోగుపడ్డ అదనపు విలువను ఉపయోగించటంలో వీసమెత్తు ప్రయోజనం కూడా కలగదు. వేతనాలు–లాభాలుపై ఆధారపడి వ్యవస్థ నడుస్తున్నపుడు ఆదాయాల్లో సమానత్వం గురించి ఎంత ప్రయత్నించినా అది ఎండమావితో దప్పిక తీర్చుకునే ప్రయత్నమే తప్ప మరోటి కాదు.

ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పెట్టుబడిదారీ వ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్షోభానికి సరైన పరిష్కారం ఏదీ లేదని చెప్పినంత మాత్రాన సమాజపు అట్టడుగు భాగంలో ఉన్న ప్రజలు తిరుగుబాటు చేయటం ద్వారా తెరమీదకు తెచ్చే ప్రత్యామ్నాయాలు కూడా అక్కరకు రావు అన్న నిర్ధారణకు రాకూడదు. ఇస్టెవాన్ మెజరోస్ తన ‘బియాండ్ కాపిటల్’ అన్న గ్రంథంలో చెప్పినట్లు, “ప్రస్తుత వ్యవస్థలో నూతన సామాజిక నియంత్రణ వ్యవస్థలు ఏర్పాటుచేయాలంటే రాజకీయాలను పెట్టుబడి నియంత్రణ నుండి బయటకు తేవాలి.” అంటే ఈ వ్యవస్థ పరిమితులకు లోబడని ఇతర ప్రత్యామ్నాయాల గురించిన అన్వేషణ ప్రారం భం కావాలి. ఆ పరిస్థితుల్లో పెట్టుబడి ప్రేరిత రాజకీయ ఆర్థిక విధానాల స్థానంలో కార్మికవర్గ ప్రేరిత రాజకీయ ఆర్థిక విధానాలు ఎలా ఉండాలో క్లుప్తంగా చూద్దాం.

థామస్ పికెటీ తన 21వ శతాబ్దిలో పెట్టుబడి అన్న గ్రంథంలో “నిరంతరాయంగా సాగే పెట్టుబడి సంచయం” ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న మౌలిక వైరుధ్యం అని అభిప్రాయపడ్డారు. పెట్టుబడిదారీ వ్యవస్థ పరిధిలో నిరంతరాయంగా సాగే అహేతుకమైన పెట్టుబడి సంచయానికీ, దాంతోపాటు వచ్చే అన్ని రకాల సమస్యలకూ కారణం అవుతుంది. ఈ పరిస్థితుల్లో పికెటీ ‘పెట్టుబడిపై అంతర్జాతీయ పన్ను’ ‘సంపన్నులైన వ్యక్తులపై ఏటా పెరుగుతూ ఉండేలా ఆదాయపు పన్ను’ వంటి ప్రతిపాదనలు ముందుకు తెచ్చారు. గుత్తాధిపత్యంతో కూడిన పెట్టుబడి సంచయాన్ని నియంత్రించటానికి అంత ర్జాతీయ సంపద పన్ను విధించాలన్న సమగ్ర ప్రతిపాదన ముందుకు తెచ్చిన తొలి ఆర్థిక వేత్త మైఖేల్ కలేకి. 1937లోనే ఆయన ఈ ప్రతి పాదన చేశారు. పికెటి ప్రతిపాదనలో అంతర్జా తీయ పెట్టుబడి పన్ను పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా తలెత్తే విప్లవానికి అడ్డుకట్ట వేసే ప్రయత్నంలో భాగమే తప్ప కలెకి ఆశించినట్లు ఈ పెట్టుబడి సంచయాన్ని అడ్డుకోవటానికి ఉపకరించే సాధనంగా దీన్ని ముందుకు తేవటం లేదు. అంతర్జాతీయ, జాతీయ స్థాయిల్లో ఇటు వంటి పన్ను విధించటం ద్వారా సామాజిక అవసరాలు తీర్చుకోవటానికి అయ్యే వ్యయాన్ని సమకూర్చుకోవటంతో పాటు నిష్క్రియాపరత్వంతో ఉన్న పెట్టుబడి వినిమయంలో క్రియాశీలత నింపవచ్చని పికెటి ప్రతిపాదిస్తున్నారు.

పెట్టుబడి లాభాపేక్షకంటే ప్రజల కనీస అవసరాలు, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వటం ద్వారా కూడా ఈ లక్ష్యాలను సాధించవచ్చు. స్థబ్దతకు ప్రత్యామ్నాయంగా “నిరుద్యోగులకు ఉపాధి కల్పించటం, ఆకలిగొన్న వారికి ఆహారం అందుబాటులోకి తేవటం, ఇళ్లు లేని వారికి ఇళ్లు నిర్మించటం, సరైన ఆరోగ్య సంరక్షణ విధానాలు అమలు చేయటం, ఆర్థిక, ఆదాయ భద్రత మార్గాలు అన్వేషించటం, అమలు చేయటం” వంటి లక్ష్యాల సాధన దిశగా అడుగులు వేయటం అవసరం. పరిమిత వర్గాలకు ప్రయోజనం కల్పించే లాభార్జన, పెట్టుబడి సంచయం కంటే విశాల ప్రజానీకానికి ప్రయోజనం కలిగించే ఈ లక్ష్యాలు అమలు చేయటం ద్వారా పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థను స్థబ్దత నుండి బయటపడేయవచ్చు.

చారిత్రకంగా చూసినపుడు అమెరికాలో రెండో ప్రపంచ యుద్ధకాలంలో అమలు జరిగిన ‘నూతన ఒప్పందం’ చివరి దశలో తెరమీదకు వచ్చిన ఆర్థిక హక్కుల పత్రం ద్వారా, 1960లో ముందుకొచ్చిన పౌరహక్కుల ఉద్యమంలో భాగంగా ఫ్రీడం బడ్జెట్ రూపంలోనూ ఈ అంశాలు ముందుకు వచ్చాయి. ఈ మధ్య కాలంలో పాల్ లి బ్లాంక్, మిఖాయిల్ యేట్స్‌లు ఫ్రీడం బడ్జెట్ ఆలోచనలు పునాదిగా అమెరికన్ పౌరు

(మిగతా 34వ పేజీలో)

# ప్రజాద్యమాలద్వారా ప్రత్యామ్నాయ శక్తులు పెరగాలి

**సందేహాలు సమాధానాలు**



**- బి.వి.రాఘవులు**

**గతంలో నయా-ఆర్థిక విధానాలు అమలు జరిపిన కాంగ్రెస్‌ను ఓడించి ప్రజలు ఎన్డీఏ ప్రభు త్వాన్ని ఎన్నుకున్నారు. ఎన్డీఏ కూడా అవే విధానాలను అమలు జరపడం వల్ల తిరిగి కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఎ1 ను ఎన్నుకున్నారు. వామపక్షాల ఒత్తిడితో యుపిఎ1 కొన్ని ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టి రెండోసారి గెలిచింది. కానీ యుపిఎ2 ప్రభుత్వం నయా-ఉదారవాద విధానాలను మరింత ఉధృతంగా అమలు జరపడంతో దాన్ని ఓడించి మళ్లీ ఎన్డీఏను ఎన్నుకున్నారు. ప్రజలు ఇలా పెనం మీద నుండి పొయ్యిలోకీ, పొయ్యి మీదనుండి పెనం మీదకూ పడుతుండడానికి కారణ మేమిటి.ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాల గురించి వామపక్షాల ప్రచా రంలో లోపమా లేక ప్రజలు అర్థం చేసుకోవడంలో లోపమా?**

**ఇలిపిల్ల సూర్యనారాయణ,**
4-33-37, భీమనవారి పేట,
విజయావడ-9

16వ లోక్‌సభలో ఎన్‌డిఏ కూటమి ఊహిం చినదానికన్నా పెద్దవిజయాన్ని సాధించింది. సీట్లే కాకుండా ఓటింగ్ శాతాన్ని కూడా బాగా పెంచు కుంది. ఈ విజయానికి యుపిఏ ప్రభుత్వంపై ప్రజల్లో పెరిగిన తీవ్రమైన అసంతృప్తి, ముఖ్య మైన దేశ విదేశాల్లోని కార్పోరేట్ పెట్టుబడి దారులు ఎన్‌డిఏ కూటమికి అండగా నిలబడడం, సంఘపరివార శక్తులు ముమ్మరంగా పనిచేయ డం కారణం. యుపిఏ ప్రభుత్వం సరళీకరణ సంస్కరణలను అమలు జరిపినా పెట్టుబడిదారీ వర్గానికి సంతృప్తి కాలేదు. సంస్కరణలను ఇంకా వేగంగా, విస్తృతంగా, లోతుగా అమలు జరపా లని అవి కోరుకుంటున్నాయి. అలా చేయగలిగే శక్తి బిజెపికి ఉందని దాని నాయకులు నరేంద్ర మోడీ అయితేనే సాధ్యం అవుతుందని అవి నిర్ణయించు కున్నాయి. అందువల్ల బడా పెట్టుబడిదారీవర్గం తన శక్తినంతా నరేంద్ర మోడీని ప్రధాన మంత్రిని చేయడానికై వెచ్చిం చాయి.

నరేంద్రమోడీ గెలుపు వలన సంస్కరణల అమలు తీవ్రమవుతాయని పాలక వర్గాల కార్పోరేట్ శక్తులకు తెలుసు తప్ప ప్రజలందరికీ అవగాహన అయిందని అనుకోలేము. ఒక్కొక్క తరగతిని ఆకర్షించడానికి ఒక్కో ప్రచారాన్ని, ఒక్కో నినాదాన్ని ఇవ్వడంద్వారా ఎన్‌డిఏ కూట మి ప్రజలను మభ్యపెట్టింది. కొంతమందిని అభివృద్ధి పేరుతో, కొంతమందిని సత్పరిపాలన పేరుతో, మరికొంతమందిని మతంపేరుతో ఆకర్షించగలిగింది. సంస్కరణలు ఉధృతమ యినప్పుడు పాలక వర్గాలకు లబ్ది జరుగుతుంది కాబట్టి భవిష్యత్తులో కూడా ఎన్‌డిఏ కూటమికి మీడియాలోనూ సానుకూల ప్రచారం లభిస్తుం ది. అయితే సంస్కరణల మూలంగా నష్టపోయే విశాలమైన ప్రజానీకంలో అసంతృప్తి పెరుగు తుంది. వచ్చే ఎన్నికల నాటికి అసంతృప్తి తీవ్ర మైతే ఆనాడు ప్రతిపక్షంగా ఎవరు అందు బాటులో ఉంటే ప్రజలు వారివైపుకి మొగ్గు చూపుతారు. వచ్చే ఎన్నికలనాటికి ప్రత్యామ్నాయ శక్తులు బలంగా ముందుకు రాకపోతే మళ్లీ యుపిఏకే లబ్ది చేకూరుతుంది. ఇదొక విషవల యంగా ఉంటుందన్న దానిలో సందేహంలేదు. దీనిని బద్దలు కొట్టాలంటే ప్రజాఉద్యమాల్లో ప్రత్యామ్నాయ శక్తులు పెరగాలి. అటు ఎన్‌డిఏ ఇటు యుపిఏలకి భిన్నంగా ప్రత్యామ్నాయ కూటమి ఆవిర్భవించాలి.

**తెలంగాణాలో ఉద్యమం జరుగుతున్నంత కాలం తెరాసకు వ్యతిరేకంగా ఉన్న సిపిఎం ఎన్నికల వేళ దానితో చేతులు కలపడానికి కారణమేమిటి? ఎన్ని కలైన తరువాత ఆ పార్టీ ప్రభుత్వానికి సిపిఎం మద్దతు ప్రకటించడం సరైనదేనా?**

**సిహెచ్. నరసింగ్,**
దూపకుంట,
వరంగల్.

తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ పట్ల మన వైఖరి మొదటి నుంచీ ఒకే రకంగా వుంది. అది ఓ ప్రాంతీయ బూర్జువా భూస్వామ్య లౌకిక పార్టీ. రాష్ట్రాన్ని విభజించాలని టిఆర్ఎస్ ఇంకా అనేక పార్టీలు తీసుకున్న వైఖరిని సిపియం వ్యతిరేకించింది. రాష్ట్రం సమైక్యంగా ఉండాలని చెప్పింది. ఈ విషయంపై టిఆర్ఎస్‌తో గానీ, విభజనను సమర్థించిన ఏ ఇతర పార్టీలతోగానీ ఎప్పుడూ రాజీ పడలేదు.

ఎన్నికల్లో పొత్తులూ, సర్దుబాటులూ వచ్చే సరికి అఖిలభారత విధానంలో భాగంగా లౌకిక ప్రతిపక్ష శక్తులను కూడగట్టేందుకు రాష్ట్రంలో కూడా ప్రయత్నం చేసింది. కాంగ్రెస్, బిజేపిలకు వ్యతిరేకంగా గతంలో తెలుగుదేశం, సిపిఐ, టిఆర్ఎస్ కూటమిగా ఏర్పడినప్పుడు వాటితో కలిసి పనిచేసాం. ఈ శక్తిలో విభజన వాదాన్ని సమర్థించేది ఒక్క టిఆర్ఎస్ మాత్రమే కాదు, తెలుగుదేశం, సిపిఐ కూడా ఉన్నాయి. అందు వల్లనే ఆ అంశం ప్రాతిపదిక కాకుండా కాంగ్రెస్, బిజేపిలకు వ్యతిరేకంగా ప్రాంతీయ లౌకిక ప్రతి పక్ష పార్టీలను కలుపుకొచ్చే ప్రయత్నం గతంలో చేసాం. ఈ ఎన్నికల్లో కూడా అదే వైఖరిని అనుసరించాం. కాంగ్రెస్, తెలుగుదేశం, బిజేపి కూటములకు వ్యతిరేకంగా ఉన్న ప్రాంతీయ లౌకిక ప్రతిపక్ష పార్టీగా టిఆర్ఎస్‌ను సిపియం పోటీ చేయని చోట సమర్థిం చాం. వాస్తవంగా ఈ ఎన్నికల్లో టిఆర్ఎస్‌తో సిపియం పొత్తు పెట్టు కోలేదు. సిపియం పోటీ చేయని చోట ఇతర పార్టీలతో సర్థుబాటులేని చోట టిఆర్ఎస్ కు మద్దతిచ్చాం.

టిఆర్ఎస్ పూర్తి మెజార్టీ సాధించి ప్రభు త్వాన్ని ఏర్పాటు చేసింది. కాంగ్రెస్, బిజేపి కూట ములను ఓడించి అధికారం చేపట్టిన ప్రభు త్వంగా టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని పార్టీ చూస్తున్నది. కాంగ్రెస్, బిజేపి ప్రభుత్వాలను చూసినట్లుగానే ఈ ప్రభుత్వాన్నీ పరిగణించకూడదు. అందుకే ప్రస్తుత టిఆర్ఎస్ ప్రభుత్వం పట్ల రాజకీయ సానుకూల వైఖరిని సిపియం ప్రకటించింది. అయితే దీని అర్థం ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలనూ, రాజకీయ ఊగిసలాటలనూ సహిం చడమని గాదు. అవసరమైనప్పుడు పోరాటా లకూ, ఉద్యమాలకూ, రాజకీయంగా వ్యతిరే కించటానికీ సిపియం వెనకాడదు.

**ఎన్నికల్లో జగన్ సంక్షేమ కార్యక్రమాలపై ప్రచా రం చేస్తే, చంద్రబాబు నాయుడు అభివృద్ధి గురించి ప్రచారం చేసి గెలుపొందారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసినా జగన్ ఓడిపోవడమే కాకుండా ప్రజల్లో రాజ శేఖరరెడ్డి సంక్షేమ కార్యక్రమాల పట్ల నమ్మకం లేదని తేల్చారు. స్వలాభ దృష్టిగల జగన్‌తో చేతులు కలప కూడ**

దని తెలిసి కూడా సిపిఎం అతనికి ఎందుకు మద్దతిచ్చింది?

**ఎస్. వేణుగోపాల్,**

ఎస్.బి.ఐ కాలనీ, విజయవాడ-10

సీమాంధ్ర ప్రాంతంలో తెలుగుదేశం పార్టీ ఎందుకు గెలిచింది, వైస్సార్ పార్టీ ఎందుకు ఓడిందనేది పరిశీలించాల్సిన విషయమే. అయితే ఇప్పుడు జరిగిన ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు, ఎవరు ఓడుతారు అనేదానిని బట్టి మార్క్సిస్టు పార్టీ తన రాజకీయ వైఖరిని నిర్ణ యించుకో లేదు. కాంగ్రెస్, బిజేపిల కూటమిలను ఓడించా లనీ, వామపక్ష లౌకిక ప్రాంతీయ పార్టీ లను బలపర్చాలనీ తీసుకున్న నిర్ణయానికను గుణంగా సిపియం ఎన్నికల ఎత్తుగడలను రాష్ట్రంలో అను సరించింది. దీనికనుగుణంగానే కాంగ్రెస్, తెదే– బిజేపి కూటములను ఓడించాలని పిలుపునిచ్చింది. జై సమైక్యాంధ్ర పార్టీతో ఎక్కువ చోట్ల, కొద్ది చోట్ల సిపిఐతో సర్దుబాట్లు చేసుకుని పోటీ చేసింది. సిపియం అభ్యర్థులు గానీ, సిపియం సర్దుబాట్లు చేసుకున్న పార్టీల అభ్యర్థులు గానీ లేనిచోట్ల టిడిపి, బిజేపి కూటమిల అభ్యర్థులను ఓడించగల ఇతర అభ్యర్థులకు ఓటెయ్యమని పిలుపిచ్చింది. వాస్త వంగా సీమాంధ్ర ప్రాంతంలో సిపియం, వైఎస్ ఆర్ పార్టీకి ఎటువంటి పొత్తులేదు. ఖమ్మం జిల్లాలో స్థానికంగా వైఎస్ఆర్‌సిపి సిపియంతో సర్దుబాట్లు చేసుకుంది. సిపియం సర్దుబాటు చేసు కున్న జై సమైక్యాంధ్ర పార్టీ అభ్యర్థులు కొంతమంది చివరి నిమిషంలో ప్లేట్ మార్చి బిజేపి అభ్యర్థికి మద్దతు ప్రకటించారు. అటు వంటి చోట్ల మరో గత్యంతరం లేక బిజేపికి వ్యతిరేకంగా వైఎస్ఆర్ అభ్యర్థులకు మద్దతివ్వాల్సి వచ్చింది.

# కాలం చెల్లిన స్వేచ్ఛా మార్కెట్

(16వ పేజీ తరువాయి)

అమలు జరిపే యోధుడిగా మోడీని ముందుకు తెచ్చారు. కార్మిక ఉద్యమాలు, ప్రజల అసమ్మతిని కఠినంగా అణిచివేసి స్వదేశీ, విదేశీ పెట్టుబడి దారులకు సంపూర్ణ విశ్వాసం కల్పించడానికి నేడు మోడీ ప్రభుత్వం నడుం కట్టింది. ఆ రీత్యా పికెటి చెప్పినట్లుగా ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదం రానుందని ప్రస్తుతం మన దేశంలో జరుగుతోన్న పరిణామాలు కూడా తెలియజేస్తు న్నాయి. ఈ స్థితిలో తమను తాము కాపాడుకోవ డానికి కార్మికవర్గం సంఘటితం కాక తప్పదు. తమను తాము సంఘటితం చేసుకోవడమే కాకుండా మిగతా ప్రజానీకాన్ని కూడా సంఘ టితం చేయాల్సిన బాధ్యత కార్మికవర్గంపై ఉంది. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో వైరుధ్యాలు, సమాజంలో పెరిగే అసమానతల గురించి మార్క్స్ ఎంతో శాస్త్రబద్ధంగా విశ్లేషించాడు. ఈ వైరుధ్యాలు వర్గ పోరాటం ద్వారానే అంతమౌతా యని మార్క్సిజం చెబుతోంది. పికెటి మార్క్స్‌తో విభేదించినా ఆయన సేకరించిన సమాచారం మార్క్సిజం శాస్త్రీయతను మరింతగా బలపరు స్తోంది. పికెటి లేవనెత్తిన అంశాలపై రానున్న కాలంలో జరిగే చర్చ యువతరాన్ని నూతన భావాలవైపు మళ్లిస్తుందని ఆశిద్దాం.

# ఆర్థిక వ్యవస్థలో స్థబ్దత - ద్రవ్యీకరణ

(32వ పేజీ తరువాయి)

లందరికీ స్వేఛ్ఛా బడ్జెట్ అన్న వాదన ముందుకు తెచ్చారు. ఇందులో భాగంగా 12 ప్రాథమిక అంశాలను వాళ్లు ప్రస్తావించారు. 1. పూర్తి స్థాయి ఉపాధి. 2. పనిచేసే వారందరికీ తగినంత ఆదాయం, 3. పని చేయలేని వారికి, పని చేయకూడని వారికి కనీస ఆదాయాన్ని గ్యారంటీ ఇచ్చే కార్యక్రమం. 4. అందరికీ సురక్షితమైన నివాస సదుపాయం. 5. అందరికీ ఆరోగ్యం. 6. అందరికీ విద్య. 7. రక్షిత, విస్తృత ప్రజా రవాణా వ్యవస్థ. 8. రక్షిత విస్తృత సామా జిక బీమా కార్యక్రమం. 9. అందరికీ ఆహార భద్రత. 10. మన్నికైన పర్యావరణం.11. అందరికీ సాంస్కృతిక స్వేచ్ఛ. 12. ఈ లక్ష్యాల సాధన కోసం ఆర్థిక అంతరాలు తగ్గించటం. ఇవి యేట్స్, బ్లాంక్ ముందుకు తెచ్చిన ఎజెండా.

అమెరికా ప్రత్యేక పరిస్థితుల్లో ఈ ప్రతిపాద నలు అమలు చేయటానికి ద్రవ్యపరమైన ఆంక్షలు ఏవీ లేవని వారిద్దరూ అభిప్రాయపడుతున్నారు. ఇరాక్‌పై యుద్ధం చేయటానికి 3 లక్షలకోట్ల (ట్రిలియన్) డాలర్లు వెచ్చించలేదా, మహా తిరోగ మన దశ నుండి ఆర్థిక వ్యవస్థను రక్షించటానికి ఉద్దీపన పథకాల రూపంలో కొన్ని వందల శతకోటి (బిలియన్) డాలర్లు వెచ్చించలేదా అని ప్రశ్నిస్తున్నారు. ఈ దిశగా లిండా బిల్మెస్, స్టిగ్లిట్జ్ అంచనాలను ముందుకు తెస్తున్నారు.

నేడున్న రాజ్యవర్గ స్వభావం రీత్యా ప్రభు త్వం సంపూర్ణంగా పెట్టుబడిదారీ వర్గ ప్రభుత్వం గా మారింది. అటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం వైపు నుండి చేపట్టే ఇటువంటి సంక్షేమ పథకా లకు చర్యలకు అవకాశాలు లేవు. అట్టడుగు సమాజం నుండే విప్లవాత్మక మార్పులు రావాలి. అందుకుగాను విప్లవ స్ఫూర్తితో పోరాటాలకు పదును పెట్టాలి.

ఉమ్మడి అవసరాల రీత్యా విశ్వవ్యాప్తమైన విప్లవోద్యమానికి నేడు మెరుగైన అవకాశాలు ఉన్నాయి. తద్వారా విప్లవాత్మకమైన సామాజిక మార్పుకు పునాదులు వేయవచ్చు. ఇటువంటి తీవ్ర స్వభావం కలిగిన ఉద్యమాలు దక్షిణార్ధ గోళంలోనే తలెత్తే అవకాశం ఉంది. అదే సమయంలో పెట్టుబడిదారీ వ్యవస్థకు ఆయు పట్టుగా ఉన్న దేశాల్లో కూడా ప్రజా ఉద్యమాలు నిర్మించబడాలి. ఈ ఉద్యమాల కారణంగా సమాజ నిర్మాణ పొందికలో మార్పులు సాధించ గలిగితే ప్రపంచ వ్యాప్తంగా ఊహించలేనన్ని నూతన అవకా శాలు తెరమీదకు వస్తాయి.

ఏది ఏమైనప్పటికీ అటువంటి విశ్వవ్యాప్త మైన సామాజిక ఉద్యమ ప్రేరేపిత మార్పులకు ప్రస్తుతం ఉన్న వ్యవస్థలో అనేక పరిమితులు ఉన్నాయి. భూగోళ పర్యావరణం విధించే పరిమితు లకులోబడే అభివృద్ధికి సంబం ధించిన వ్యూహాలు రూపొందించుకోవాల్సి ఉంటుంది. కార్మికులకు పూర్తి స్థాయిలో ఉపాధి కల్పించాలంటే చావో రేవో అన్న పద్ధతిలో పెట్టుబడి సంచయానికి దారులు వేస్తున్న పెట్టుబడిదారీ వ్యవస్థలో ఈ క్రమం మరింత వేగవంతం కావాలి. అయితే ఈ ఆర్థికాభివృద్ధి ప్రకృతి వనరులపై సరికొత్త ఒత్తిడి తెస్తుంది. ప్రకృతి పరమైన పరిమితుల కారణంగా అటువంటి అభివృద్ధి నిర్నిరోధంగా ముందుకెళ్లటం సాధ్యం కాదు. ఆర్థిక వ్యవస్థను ఆరోగ్యవంతంగా నిలబెట్టగలిగే పరిమితమైన ఆర్థికాభివృద్ధి వ్యూహానికీ, భౌగోళిక వనరులను పదితరాలకు మన్నికగా అందించే ప్రయత్నా లకూ మధ్య వైరుధ్యం లేదని మేము అభిప్రాయ పడుతున్నాము. ఇక్కడ ఉన్న వైరుధ్యం పెట్టుబడి దారీ విధానంలోనే ఉంది. ఈ పరిస్థితులు ప్రపంచంలో వేగవంత మైన విప్లవాత్మక మార్పు లు సాధించటమే ఏకైక పరిష్కారం అని స్పష్టం చేస్తున్నాయి.

కార్మికులపై ఆర్థిక స్థబ్దత ప్రభావం తోపాటు మానవాళి మనుగడకు ముప్పుతెచ్చే రీతిలో మనముందున్న తీవ్రమైన సంక్షోభాన్ని పరిష్క రించుకోవాలంటే ప్రపంచ చారిత్రక పరిణామం అనుభవాల ఆధారంగా ఒక నూతన దృక్పథాన్ని మనం అనుసరించాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో కొద్ది మందికి ప్రయోజనం కలిగించే పెట్టుబడి సంచయం విధానాల స్థానంలో విశాల ప్రజానీ కానికి ప్రయోజనం కలిగించే ప్రత్యామ్నాయ విధానాలకు అవకాశం ఇవ్వాలి. తద్వారా భావి తరాలకు భవిష్యత్తుకు భద్రత కల్పించాలి.

**(అనువాదం: కె. వీరయ్య)**

# కా॥ ఉమానాథ్

(2వ పేజీతరువాయి)

ల తర్వాత పప్పా తల్లి లక్ష్మి మరణించారు. జైలు నుండి విడుదలయిన తరువాత 1952 అక్టోబరు 9న కామ్రేడ్ ఉమానాథ్, పప్పా ఎలియాస్ ధనలక్ష్మిని గోల్డెన్‌రాక్ వర్క్‌షాపు యూనియన్ ఆఫీసులో వివాహమాడారు. ఈ వివాహ వేదికకు స్వయంగా అధ్యక్షత వహించి, నడిపించింది ద్రవిడ కజగమ్ ఉద్యమ ప్రారంభ నాయకుడు ఈ.వి. రామస్వామి పెరియార్. భారతదేశంలో ట్రేడ్ యూనియన్ ఉద్యమ సింహాలలో ముఖ్యుడైన సక్కరాయ్ చెట్టియార్, ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు యం.కళ్యాణ సుందరం, కె.ఆనంద్ నంబియార్‌లు వివాహానికి హాజరయ్యారు. ఆనాటి నుండి చనిపోయేంత వరకు ఉమానాథ్, పప్పా దంపతులు కమ్యూనిస్టు ఉద్యమంతో మమేకమై పనిచేశారు. వీరిది కులాంతర వివాహం. వామపక్ష పార్టీల కార్యకర్తలకు, అభిమానులకు ఉమానాథ్, పప్పా ఉమానాథ్‌ల జీవితం అత్యంత స్ఫూర్తి దాయకంగా నిలిచింది. వారు కేవలం ఉపన్యాసాలకే పరిమితం కాకుండా, కమ్యూనిస్టు విలువలనూ, సూత్రాలనూ ఆచరించి చూపారు. అందువల్లనే వారిద్దరూ కేవలం వామపక్షాల నాయకులకూ, కార్యకర్తలకే కాకుండా అన్ని రాజకీయ పార్టీల వారికి అత్యంత గౌరవనీయులు, ఆదర్శవంతంగా నిలిచారు.

స్వాతంత్రం రాకముందు, తరువాత తన రాజకీయ జీవిత కాలంలో కామ్రేడ్ ఉమానాథ్ తొమ్మిదిన్నర సంవత్సరాలు జైలు జీవితం, ఏడు సంవత్సరాలు అజ్ఞాతవాసం గడిపారు. 1962, 1967లలో తమిళనాడులోని పుదుకొట్టయ్ నుండి పార్లమెంట్ సభ్యునిగా, 1977, 1980 లలో నాగపట్నం నుండి తమిళనాడు శాసన సభకు ఎన్నికయ్యారు. కామ్రేడ్ ఉమానాథ్ తమిళంలోనూ, ఆంగ్లంలోనూ అనర్గళంగా మాట్లాడ గలిగేవాడు. ఆయన పార్లమెంట్‌లో అడుగు పెట్టిన తరువాత మాట్లాడిన మొదటి ప్రసంగం మరణ శిక్ష రద్దు చేయాలని.

70 సంవత్సరాలుగా తమిళనాడులో పార్టీ నిర్మాణంలో, ముఖ్యంగా సిఐటియు నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించారు కామ్రేడ్ ఉమానాథ్. 1978 నుండి 2012 వరకు పార్టీ కేంద్ర కమిటీ సభ్యునిగా, 1991 నుండి 2008 వరకు పొలిట్ బ్యూరో సభ్యునిగా తన వంతు బాధ్యతలను ఎంతో ఉన్నతంగా నిర్వహించారు. తమిళనాడు సిఐటియు ఆవిర్భావ ప్రధాన కార్యదర్శిగానే కాక, తరువాత కాలంలో రాష్ట్ర కమిటీ అధ్యక్షునిగా, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గంలో బాధ్యతలు నిర్వహించారు.

జీవితంలో ఎక్కువ కాలం తమిళనాడులో గడిపినప్పటికీ, మలబార్ ప్రాంతంతో (కోజికోడ్) ఆయనకు ఉన్న అనుబంధం ఆయన చనిపోయేంత వరకు కొనసాగింది. కమ్యూనిస్టుగా ఊపిరి పోసుకున్న ఈ ప్రాంతంలో ఆయన రాజకీయ, ట్రేడ్ యూనియన్ జీవితం ఎన్నటికీ విడదీయ లేనిదిగానే ఉంది. దక్షిణ భారత ఇన్సూరెన్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులుగా ఆయన దీర్ఘకాలం పాటు పని చేశారు. 1988లో కోజికోడ్‌లో జరిగిన మహాసభలో ఆయన ఈ బాధ్యత నుండి తప్పుకున్నారు. కోజికోడ్‌లో 2012 ఏప్రిల్‌లో జరిగిన పార్టీ మహాసభలో కామ్రేడ్ ఉమానాథ్‌తో జెండా ఆవిష్కరణ చేయించి పార్టీ ఆయన సేవలను గౌరవించింది.

కామ్రేడ్ ఉమానాథ్‌కు ఇద్దరు కుమార్తెలు. ఒకరు యు.వాసుకి. ఆమె తల్లిదండ్రుల బాటలోనే పయనించి పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలుగా ఎదిగి, నేటికీ పార్టీ ముఖ్య నాయకురాలుగా కొనసాగుతున్నారు. మరొకరు యు. నిర్మలా రాణి. ఈమె లాయర్ పట్టా పుచ్చుకుని తిరుచ్చిలోనే పేద ప్రజలకు న్యాయసేవలు అందిస్తున్నారు. కామ్రేడ్ ఉమానాథ్ లింగ వివక్షతకు వ్యతిరేకంగా నిలబడ టమేకాక, మహిళా సాధికారత, రాజకీయా లలో మహిళల ప్రవేశం, వారి ఎదుగుదలకై పెద్ద ఎత్తున కృషి చేశారు. పితృస్వామిక వ్యవస్థ దుర్గుణాలను దరికి రానీయకుండా, ఆ అవలక్షణాలు పార్టీలోనూ, బయటా ప్రభావం చూపించకుండా ఉండేందుకు నిరంతరం కృషి చేశారు. పప్పా ఉమానాథ్ రెండు సంవత్సరాల క్రితమే మరణించారు. వీరిద్దరి సాధారణ జీవన శైలి అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచింది.


కామ్రేడ్ ఉమానాథ్ పరిస్థితి విషమించిందని తెలిసిన మరుక్షణం కామ్రేడ్ ప్రకాష్ కారత్ మే 15వ తేదీన ఆయనను తిరుచ్చిలోని ఆసుపత్రిలో కలిశారు. ఆ తరువాత వారం రోజులకే ఆయన మరణించారు. పార్టీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ప్రకాష్‌కారత్, పొలిట్‌బ్యూరో సంతాప ప్రకటనలో కామ్రేడ్ ఉమానాథ్ గురించి ఇలా వివరించారు: కమ్యూనిస్టు నాయకులలో అత్యున్నతమైన కమ్యూనిస్టు నాయకునిగా ఎదగాలంటే, మార్క్సిజం–లెనినిజం పట్ల ఉన్న సంపూర్ణ విశ్వాసం, విధేయత ప్రధానం. అవి రెండూ ఉన్నాయి కాబట్టే కామ్రేడ్ ఉమానాథ్ అత్యున్నత కమ్యూనిస్టు నాయకునిగా ఎదిగారు. అంతేకాదు జీవిత కాలమంతా కార్మికవర్గ నిర్మాణం కోసం నిబద్ధతతో పని చేసిన మహోన్నతుడాయన. 19,20 ఏళ్ల పిన్న వయస్సులోనే అన్నిటినీ వదిలేసి కమ్యూనిస్టుగా మారి పూర్తికాలం కార్యకర్తగా వచ్చి, 70 వసంతాలు అదే బాటలో పయనించిన మహానుభావుడు.

తమిళనాడులోని అనేక ప్రాంతాలలో కార్మికవర్గాన్ని సంఘటితం చేసే కృషిలో కామ్రేడ్ ఉమానాథ్ అహోరాత్రులు శ్రమించారు. రైల్వే వర్కర్ల సమ్మె తరువాత, కోయంబత్తూరులోని పారిశ్రామిక కేంద్రాలలో కార్మికులను సంఘటితం చేశారు. అప్పుడు కూడా పోలీసులు నిర్బంధించి జైలుపాలు చేస్తే, వీరోచితంగా తప్పించుకొని సంచలనం సృష్టించారు. తిరుచురాపల్లి ప్రాంతంలో కూడా అనేక పరిశ్రమలలో కార్మికులను సంఘటితం చేశారు. 1950 తమిళనాడు కార్మికోద్యమంలో ప్రముఖ నాయకుడిగా ఎదిగారు. తమిళంలోనూ, ఆంగ్లంలోనూ అనర్గళంగా మాట్లాడగలిగే వాగ్ధాటి కారణంగానే ఆయన తరువాత కాలంలో పార్లమెంట్‌లో, శాసనసభలో కార్మికవర్గ వాణిని అత్యద్భుతంగా వినిపించ గలిగారు. అటు సుదీర్ఘకాల కార్మికవర్గ నిర్మాణం, ఇటు పార్లమెంట్, శాసనసభల అనుభవాలు పార్టీకి ఎంతగానో ఉపయోగపడ్డాయి. పార్టీ అంతరంగిక విశ్లేషణలు, సంభాషణలు, సమావేశాలలోను, అలాగే పార్టీ కార్యక్రమాన్ని తాజాపర్చే సందర్భంలో ఆయన పాత్ర కీలకంగా పోషించారు. అంతేకాదు ఆయన చెప్పదల్చుకున్న అంశాన్ని, విమర్శను సూటిగా చెప్పేవారు. ఎంతటివారయినా తప్పు జరుగుతున్నదనిపిస్తే నిర్మొహమాటంగా తన అభిప్రాయాన్ని తెలియ చేయటంలో ఆయన దిట్ట. అదే సందర్భంలో పార్టీ కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాన్ని అత్యున్నతంగా గౌరవించేవారు. అలాగే ఆ అంశాలను, సంభాషణలను ఎన్నడూ పార్టీయేతర సమావేశాలలోగానీ, బయటగానీ బహిర్గతం చేసేవారు కాదు.

జాతీయ, అంతర్జాతీయ అంశాలనూ, రాజకీయ మార్పులను అర్థం చేసుకోవటంలో దిట్ట, వర్గ దృక్పథాన్ని కోల్పోకుండా, స్థిరంగా కార్మికవర్గ పక్షపాత ధోరణిని అవలంబిస్తూ, మార్క్సిస్టు, లెనినిస్టు సిద్ధాంతాన్ని ఆచరించిన ఆచరణశీలి కామ్రేడ్ ఉమానాథ్. పార్లమెంట్ సభ్యుడిగా, శాసనసభ్యుడిగా ఆయనకు వచ్చే పెన్షన్‌లు, అలవెన్సులు అన్నిటిని పార్టీకే ఇచ్చేవారు. పార్టీ ఇచ్చిన అలవెన్సుతోనే కడవరకు జీవించిన త్యాగమూర్తులు ఉమానాథ్ దంపతులు. ప్రపంచీకరణ నేపథ్యంలో నేడు కార్మికవర్గాన్ని సంఘటితం చేయటంలోనూ, పార్టీని నిర్మించటంలోనూ మనం ఎదుర్కొంటున్న సవాళ్ళను అధిగమించాలంటే కామ్రేడ్ ఉమానాథ్ అనుసరించిన మార్క్సిస్టు, లెనినిస్టు దృక్పథాన్ని పెంపొందించుకోవటమే మన ప్రధాన కర్తవ్యం. ఏడు దశాబ్దాల విప్లవ పయనంలో ఆయన చూపిన అసామాన్య పోరాట పటిమ, నిరాడంబరత, కార్మికవర్గ పాక్షపాత ధోరణి నేటి మన కార్మివర్గ ఉద్యమానికి స్ఫూర్తిగా ఉండాలి. ఆయన చేసిన సుదీర్ఘ పోరాటాల సంకల్పసాధనే లక్ష్యంగా పని చేయటమే మనం ఆయనకు అర్పించే ఘనమైన నివాళి. ●

RNI Reg. No. APTEL/2006/17554 Postal Regd. No L1/SD/407/13-15

# ప్రయివేటు అభివృద్ధినుండి సమిష్టి అభివృద్ధివైపు మళ్ళేదే పురోగామి విధానం



**– ఎరిక్ హాబ్స్‌బామ్**

"పురోగామి విధానం ఏది? అనేదానికి పరీక్ష... ప్రయివేటు రంగం కాదు, పబ్లిక్ రంగం. వ్యక్తుల ఆదాయాలు, వినియోగం పెరగడం కాదు, అవకాశాలు పెంచడం, అమర్త్యసేన్ చెప్పినట్లు సమిష్టి కార్యాచరణ ద్వారా అందరి 'సామర్థ్యాలు' పెంచడం. అంటే అర్థం, ప్రయివేటు సంపదను పునఃపంపిణీ చేసైనా సరే లాభాపేక్షలేని పబ్లిక్ చొరవను పెంచడం. పబ్లిక్ నిర్ణయాలు సమిష్టి సామాజికాభివృద్ధి లక్ష్యంగా సాగాలి. దాని ద్వారా మానవులందరూ లాభం పొందాలి. అదీ – పురాగామి విధానానికి పునాది. అంతేకాని ఆర్థికాభివృద్ధినీ, వ్యక్తిగత ఆదాయాలనూ గరిష్టంగా పెంచుకోవడం కాదు. వాతావరణ సంక్షోభం ముంచుకొస్తున్న ఈ శతాబ్దంలో ఈ సమస్యను పరిష్కరించడానికి అన్నిటికన్నా కూడా ఇది మరింత ముఖ్యమైన అంశం. దీనికి మనం ఎటువంటి సైద్ధాంతిక లోగోను స్వీకరించినప్పటికీ, దీని అర్థం మాత్రం స్వేఛ్ఛా మార్కెట్ నుండి దూరంగా జరగడం, పబ్లిక్ కార్యచరణ వైపు మళ్లడం..... ప్రస్తుత ఆర్థిక సంక్షోభ తీవ్రత దృష్ట్యా చూస్తే ఈ పని చాలా వేగంగా జరగాలి. కాలం మనవైపు లేదు....

"కానీ పురోగామి విధానానికి గత 30 ఏళ్లుగా సాగుతున్న ఆర్థిక, నైతిక విలువలతో తెగతెంపులు చేసుకోవడం ఒక్కటే సరిపోదు. ఆర్థికాభివృద్ధి, దాని ద్వారా వచ్చే విలాసవంతమైన జీవితం... ఇవన్నీ కూడా మార్గాలే గానీ అవే లక్ష్యాలు కావన్న భావనకు మనం మళ్లాలి. మన జీవితాలు, జీవిత అవకాశాలు, ప్రజల ఆశలు ఏమికానున్నాయి అనేదే తుది లక్ష్యంగా గాండాలి....."

Marxistu, monthly organ of Communist Party of India (Marxist) A.P . State Committee.
Printer & Publisher B.V. Raghavulu. RNI Reg.No. APTEL/2006/17554. Vol.9, No.2, June 2014